RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 2 సంచిక : 275 మేడ్చల్ మల్కాజ్‌గిరి 27 అక్టోబర్ 2024 ఆదివారం పేజీలు : 4

### భారత్ - బంగ్లా సరిహద్దుల్లో కొనసాగుతున్న హైఅలర్ట్

ఢిల్లీ: భారత్ – బంగ్లా సరిహద్దుల్లో హైఅలర్ట్ కొనసాగుతోంది. బంగ్లాదేశ్ పరిణామాల నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నారు. బంగ్లా–భారత్ సరిహద్దుల్లో రాకపోకలను భద్రతా సిబ్బంది తాత్కాలికంగా నిలిపివేసింది. సరిహద్దులకు అదనపు బలగాలను బీఎస్ఎఫ్ తరలించింది. ఆర్మీ యూనిట్లను కూడా ప్రభుత్వం అప్రమత్తం చేసింది. బంగ్లాదేశ్ విద్యార్థి సంఘం నేతలతో నేడు ఆ దేశ ఆర్మీ చీఫ్ భేటీ అయ్యారు. దేశంలో నెల కొన్న అశాంతి, అల్లర్ల నేపథ్యంలో కీలక భేటీ జరిగింది. బంగ్లా ప్రధాని షేక్ హసీనా దేశం విడిచి వెళ్లిన తర్వాత కూడా అల్లర్లు కొనసాగాయి. ప్రధాని నివాసం, చీఫ్ జస్టిస్ నివాసం సహా అనేక అధికారిక నివాసాల్లోకి చొరబడి ఆందోళనకారులు లూటీ చేశారు. అల్లర్లను అదుపుచేసే ప్రయత్నాల్లో బంగ్లాదేశ్ ఆర్మీ, పోలీసు బలగాలు ఉన్నాయి.

# మోదీ దీపావళి కానుక!

## పెట్రో ధరల తగ్గింపు!!




వాహనదారులు గత కొంతకాలంగా పెట్రోల్ ,డీజిల్ ధరలు అధికంగా ఉండడంతో ఎక్కడికి వెళ్లాలన్న కాస్త ఆలోచిస్తూ ఉన్నారు. గ్యాస్ ధరలు కూడా ప్రజలకు గుధిబండ లాగా మారుతున్నాయి. గత కొద్ది రోజుల నుంచి పెట్రోల్, డీజిల్ గ్యాస్ ధరలు కేంద్రం తగ్గిస్తోందనే వార్తలు అయితే వినిపిస్తున్నాయి. అయితే ఇప్పుడు తాజాగా మరొకసారి పెట్రోల్, డీజిల్ ధరల పైన కేంద్ర ప్రభుత్వం దీపావళికి మరో గుడ్ న్యూస్ చెప్పబోతోంది అన్నట్లుగా వార్తలు వినిపిస్తున్నాయి. నిజానికి పెట్రోల్ ,డీజిల్ ధరలు అంతర్జాతీయ క్రూడాయిల్ ధరలపైన ఆధారపడి ఉంటాయని చెప్పవచ్చు. క్రూడాయిల్ ధరలు కూడా భారీగా తగ్గడంతో చమురు సంస్థల వద్ద భారీగానే నిలువ ఉండడంతో కొన్ని వారాల క్రితం బ్యారెల్ చమురు ధర 80 డాలర్లకు ఉండగా ప్రస్తుతం 70 డాలర్లకు పడిపోయినట్లు సమాచారం. అందుకే గత నెల రోజుల నుంచి అంతర్జాతీయంగా మార్కెట్లో కూడా క్రూడాయిల్ ధరలు తగ్గుతూ వస్తున్నాయట. దీంతో ఇండియాలో కూడా డీజిల్, పెట్రోలు పైన రూ 3 రూపాయల వరకు తగ్గించే అవకాశం ఉన్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు పెట్రోల్ ,డీజిల్ పైన కూడా రేటు తగ్గించే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది. అంతర్జాతీయ రేటుతో పోలిస్తే.. పెట్రోల్ పైన రూ.15 రూపాయలు డీజిల్ పైన రూ .12 రూపాయలు వ్యత్యాసం ఉంటుంది అంటూ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ గిరీష్ కుమార్ తెలియజేశారు. అంతర్జాతీయ రేట్లను ఉద్దేశించి దేశవ్యాప్తంగా ఇంధన ధరలను సవరించాలని విషయం పైన 2021 నుంచి పోరాడుతూనే ఉన్న చమురు సంస్థలు ఏమాత్రం సహకరించడం లేదట. ఇప్పటికే రెండు తెలుగు రాష్ట్రాలలో 100 రూపాయలకు పైగా రేట్లు ఎక్కువగా ఉన్నాయి. కొన్ని ప్రాంతాలలో వంద రూపాయలని కూడా దాటేశాయి. మరి దీపావళి రోజున కేంద్రం ఏదైనా గుడ్ న్యూస్ ఉంటుందో లేదో చూడాలి మరి.

# అవినీతి చేసిన వారిపై చర్యలు..

## మహేష్ కుమార్ గౌడ్ షాకింగ్ కామెంట్స్




ఢిల్లీ: మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అవినీతిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారని తెలంగాణ కాంగ్రెస్ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ షాకింగ్ కామెంట్స్ చేశారు. వారు చేసిన తప్పులకు కేసీఆర్, కేటీఆర్‌లను రెండు, మూడేళ్లుకాదని.. పదేళ్ల జైలు శిక్ష కూడా తక్కువేనని సంచలన వ్యాఖ్యలు చేశారు. కాళేశ్వరం మతలబు ఏంటి? అని ప్రశ్నించారు. అంత వ్యయం ఖర్చు చేసి ఆ ప్రాజెక్ట్ కట్టాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. విద్యుత్ కొనుగోళ్లలో అవకతవకలు జరిగాయని ఆరోపించారు. ఇప్పుడు చాలా తక్కువధరకే కరెంట్ దొరుకుతుందని మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. విద్యుత్ చార్జీల పెంపు ఆలోచన తమ ప్రభుత్వానికి లేదని స్పష్టం చేశారు. కేసీఆర్‌కు ఉన్న ఆర్థిక వెసులుబాటు తమ ప్రభుత్వానికి లేదని చెప్పారు. తెలంగాణ ఏర్పడ్డప్పుడు మిగులు బడ్జెట్‌తో ఉంది, కానీ తెలంగాణపై పదేళ్లలో రూ. 8లక్షల కోట్లు కేసీఆర్ అప్పు చేశారని విమర్శించారు. ఏ పథకాన్ని తమ ప్రభుత్వం ఆపలేదు. త్వరలోనే పథకాలను గ్రౌండ్ చేస్తామని హామీ ఇచ్చారు. పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం విడతాల వారిగా చేసిన దానికంటే.. తమ ప్రభుత్వం రుణమాఫీ ఎక్కువ చేసిందని తేల్చిచెప్పారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు, కేసీఆర్ చేసిన అప్పులను ప్రజలు అర్థం చేసుకోవాలని అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చుతాం, పథకాలను ఎగ్గొట్టాలనే ఆలోచన తమ ప్రభుత్వానికి అసలు లేదని స్పష్టం చేశారు. హైడ్రాలో ఒక్కటే పేదల ఇల్లు కూలిందని మహేష్ కుమార్ గౌడ్ తేల్చిచెప్పారు.

**సోషల్ మీడియాలో కాంగ్రెస్ ప్రభుత్వంపై విష ప్రచారం...** "సోషల్ మీడియాలో అనైతికంగా మా ప్రభుత్వంపై విష ప్రచారం చేస్తున్నారు. విచ్చలవిడిగా డబ్బు ఖర్చు పెడుతున్నారు. వారిని పట్టుకుందామంటే.. పట్టుకునే వీలు లేకుండా విదేశాల్లో ఉంటూ అకౌంట్లు నడుపుతున్నారు. బీఆర్ఎస్ పదేళ్లలో యథేచ్ఛగా చెరువుల కబ్జా జరిగింది. వయనాడులో జరిగిన విధ్వంసం తెలంగాణలో జరగకూడదనే యుద్ధప్రాతిపదికన మూసీ ప్రక్షాళన చేపట్టాం. విడతల వారిగానే మూసీ ప్రక్షాళన చేస్తున్నాం. హైడ్రాతో పేదవారికి నష్టం కలగకుండా చర్యలు తీసుకుంటాం. హైడ్రా, మూసీపై రివ్యూ చేస్తున్నాం. పేద, మధ్యతరగతి వారికి అన్యాయం కలగకుండా చర్యలు ఉంటాయి. అనుమతులు ఉన్నవాటిని వదిలేయాలి. మూసీలో మాత్రం స్వచ్ఛందంగానే కొందరు ముందుకు వచ్చారు. వారికి ఉపాధి కల్పన, మిగతా అంశాలపై మా ప్రభుత్వం కట్టుబడి ఉంది. జీవో నెంబర్ 29పై ఎవరికి నష్టం జరగదని అధికారులు చెప్పారు. మెరిట్ లిస్ట్‌లో ఎవరికి అన్యాయం జరగడం లేదు. జీవో నెంబర్ 29పై ఎవరు ఆందోళన చేశారో, ఎందుకు చేశారో తెలియడం లేదు" అని మహేష్ కుమార్ గౌడ్ అన్నారు .

**కేసీఆర్ ఎక్కడికి పోయారు...** "తొమ్మిది నెలలుగా, ప్రతిపక్ష నేత ఎక్కడికి పోయారు. ప్రజల సమస్యలపై కేసీఆర్ ఎందుకు బయటకు రావడం లేదు. ఆయనకు ప్రజలు ప్రతిపక్ష నేత హోదా ఇస్తే చేస్తున్నది ఏంటి. సీఎం రేవంత్‌రెడ్డి తమ్ముడు తిరుపతి రెడ్డి ఆయన ఇంటిని కూల్చమనే అధికారులకు చెప్పారు, కానీ కోర్టు డైరెక్షన్ వల్లే కూల్చలేదు. ప్రభుత్వానికి ఎవరైనా విరాళాలు ఇవ్వొచ్చు, అదాని ఇచ్చారు అంతే. ప్రతిపక్షాల రాద్దాంతం చేయడంతో ప్రజలు ఆందోళనలో ఉన్నారు. అంతే తప్ప భవిష్యత్ తరాల కోసమే హైడ్రా, మూసీ ప్రక్షాళన. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో ఈ ప్రభావం ఉండదు. ఫిరాయింపులపై కోర్టుదే తుది నిర్ణయం. చేరికల విషయంలో జీవన్ రెడ్డికి వివరించిన తర్వాతే కాంగ్రెస్ పార్టలో చేర్చుకున్నాం. జీవన్ రెడ్డికి మేము, పార్టీ అండగా ఉంటుంది. పారిశ్రామికంగా అభివృద్ధి చేయాలని అనుకున్నప్పుడు స్థానికంగా కొన్ని ఇబ్బందులు తప్పవు, వాటిని సర్దుబాటు చేసుకోని ముందుకు వెళ్తాం. బీఅర్ఎస్‌లో ఏముందని చేరతారు" అని మహేష్ కుమార్ గౌడ్ ప్రశ్నించారు.

**బీఆర్ఎస్‌లో ఎందుకు చేరతారు...** "కేసీఆర్ ప్రజలకు అసలు కనబడటం లేదు, ఎవరిని చూసి బీఆర్ఎస్‌లో చేరతారు. ఏ కేసును నీరుగార్చే ప్రయత్నం చేయడం లేదు. ఫోన్ ట్యాపింగ్, డ్రగ్స్, భూ ఆక్రమణలు ఇలా అన్ని కేసుల విచారణ ఉంటుంది, ఫోన్ ట్యాపింగ్ పెద్ద వ్యవహారం. కేంద్రాచట్టలు వర్తిస్తాయి. పార్టీ మెన్ అనే నాకు అందరూ మద్దతుగా నిలుస్తున్నారు.

పార్టీకి, ప్రభుత్వానికి అనుసంధానకర్తగా గాంధీ భవన్ ఉంటుంది. కేసీఆర్ చేసినట్లు మేము మోసం చేయమనే క్లారిటీతో ప్రజలున్నారు. 6 గ్యారెంటీలను తూచా తప్పకుండా అమలుచేస్తాం. డబ్బుల వెసులుబాటు లేకపోవడంతోనే కొంత ఆలస్యం జరుగుతుంది. పట్టురానిదే పథకాలు అమలు చేస్తున్నమా. మంత్రులకు స్వేచ్ఛ ఉంది" అని మహేష్ కుమార్ గౌడ్ వెల్లడించారు.

**చేరికలు ఆగలేదు...** "చేరికలు ఆగలేదు. రాష్ట్ర ఆదాయం తగ్గలేదు. గతంలో ఉన్నట్లే ఇప్పుడు ఉంది. కొత్త పాత కలయికతో పార్టీలో కొత్త ఇబ్బందులు వచ్చాయి, వాటిని సర్దుబాటు చేస్తున్నాం. పార్టీలో ఉన్న నేతలను కాపాడుకునేందుకే కాంగ్రెస్ ఎమ్మెల్యేలు మాతో టచ్‌లో ఉన్నారని చెప్పుకుంటున్నారు. త్వరలోనే మరిన్ని చేరికలు ఉంటాయి. కేటీఆర్‌తో సన్నిహితంగా ఇన్ అండ్ ఔట్ ఉన్నవాళ్లే కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధంగా ఉన్నారు. జీవన్ రెడ్డి అనుచరుడి హత్యపై విచారణ చేయాలని సీఎం కార్యాలయం నుంచి ఆదేశాలు ఇచ్చారు. మంత్రివర్గ విస్తరణ అధిష్ఠానం, సీఎం చేతుల్లో ఉంది. టెక్నీకల్ ఇష్యూస్ ఉన్నాయి, అందుకే చేరినట్లు అధికారికంగా ప్రకటించడం లేదు" అని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

## ఆర్టీసీ గుడ్ న్యూస్.. ఇంటి వద్దకే కార్గో సేవలు




హైదరాబాద్: ఇంటికే ఆర్టీసీ పార్శిళ్లు పార్శిళ్ల డెలివరీని మెరుగుపరిచేందుకు ఆర్టీసీ కీలక నిర్ణయం తీసుకుంది. రేపటి నుంచి ఇంటివద్దకే కార్గో సేవలు అందించనున్నట్లు ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ముందుగా హైదరాబాద్లో పైలట్ ప్రాజెక్టుగా రేపటి నుంచి చేపట్టనున్నట్లు తెలిపారు. త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా ఈ సేవలను అందుబాటులోకి తీసుకురానున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు డెలివరీ ఛార్జీలను వెల్లడించారు. ఇంతకు ముందు కార్గో డెలివరీ ఐటెమ్స్ తీసుకోవాలంటే.. బస్టాండ్‌కి వెళ్లాల్సి వచ్చేది. ఆదివారం నుంచి ఆ సరకులు డైరెక్టుగా ఇంటికే వస్తాయి. హోం డెలివరీ చేస్తారు. ఈ కార్గో సేవల్ని ముందుగా హైదరాబాద్‌లో పైలట్ ప్రాజెక్ట్‌గా ప్రారంభిస్తూ.. పార్శిళ్లను హోం డెలివరీ చేయనున్నారు. త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా హోం డెలివరీ సేవలు ప్రారంభిస్తామని ఎండీ సజ్జనర్ తెలిపారు. **హోం డెలివరీ చార్జీలను కూడా ఎక్స్ అకౌంట్లో పోస్ట్ చేశారు.** 0 నుంచి 1 కేజీ పార్శిల్‌కు రూ.50, 1.01నుంచి 5 కేజీలకు రూ.60, 5.01 నుంచి 10 కేజీలకు రూ.65, 10.1 నుంచి 20 కేజీలకు రూ.70, 20.1 నుంచి 30 కేజీలకు రూ.75, 30.1 కేజీలు దాటితే.. రూ.75పైన ఈ సర్వీసులు వద్దు అనుకునేవారు బస్టాండ్‌కే వెళ్లి డెలివరీ తీసుకోవచ్చు. హైదరాబాద్‌లో ప్రజల నుంచి వచ్చే స్పందన బట్టి, మార్పులు చూస్తూ సేవల్ని రాష్ట్రవ్యాప్తంగా విస్తరించేందుకు ఆర్టీసీ ప్రణాళికలు సిద్ధం చేస్తోంది.

## సీఎం రేవంత్‌రెడ్డి దుర్బుద్ధి.. ఆరునెలల్లోనే బయటపడింది : ఎంపీ ఈటల

హైదరాబాద్: సీఎం రేవంత్ రెడ్డి మూసీ బ్యూటిఫికేషన్ చేస్తాననేది కేవలం డబ్బు సంచులు నింపుకోవడానికేనని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ ఆరోపించారు. ఇప్పటివరకు నిర్మించిన మురుగు శుద్ధి కేంద్రాలు(ఎస్టీపీ)లను ప్రారంభించే తెలివి సీఎంకు లేదని దుయ్యబట్టారు. రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలోని టీకేఆర్ కాలనీలో మూసీ పరివాహక ప్రాంతాన్ని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్‌తో కలిసి పరిశీలించారు. ప్రజలను కలిసి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందన్న ఈటల.. ప్రజల దృష్టి మళ్లించేందుకే హైడ్రా, మూసీ పేరుతో కొత్త నాటకాలకు తెర లేపారన్నారు. పేదలకు అన్యాయం చేసి పెట్టుబడిదారులకు వత్తాసు పలకడం సీఎం రేవంత్ రెడ్డికే చెల్లిందని ఎద్దేవా చేశారు. గత ముఖ్యమంత్రి కేసీఆర్ నిజస్వరూపం తెలిసేందుకు ఆరేళు పడితే.., రేవంత్ దుర్బుద్ధి ఆరు నెలల్లోనే బయటపడిందన్నారు. ఇష్టారీతిన వ్యవహరిస్తున్న కాంగ్రెస్ పాలనకు మంచి రోజులు ముగిశాయన్నారు. మూసీ ప్రక్షాళనకు తాము వ్యతిరేకం కాదన్నారు. మూసీలో విషపదార్థాలు, రసాయనాలు చేరకుండా చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# ప్రభుత్వ ఉద్యోగులకు సర్కార్ గుడ్ న్యూస్..




హైదరాబాద్: దీపావళి పండుగ వేళ గవర్నమెంట్ ఉద్యోగులకు తెలంగాణ ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. పెండింగ్?లో ఉన్న రెండు డీఏల (కరువు భత్యం) విడుదలకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన శనివారం (అక్టోబర్ 26) సచివాలయంలో జరిగిన మంత్రి వర్గ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు రెండు డీఏలు ఇచ్చేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఒక డీఏ వచ్చే నెల వేతనంతో.. మరో డీఏ మార్చిలో ఇవ్వాలని ప్రభుత్వ నిర్ణయించింది. పండుగ వేళ పెండింగ్?లో ఉన్న రెండు డీఏ విడుదలకు ప్రభుత్వం పచ్చజెండా ఊపడంతో ఉద్యోగులు హార్షం వ్యక్తం చేస్తున్నారు. డీఏల విడుదలతో పాటు ఈ భేటీలో కేబినెట్ మరికొన్ని కీలక నిర్ణయాలకు ఆమోద ముద్ర వేసింది. ములుగులో సెంట్రల్ ట్రైబల్ యూనివర్శిటీకి ఎకరా రూ.250 చొప్పున 211 ఎకరాల భూమి కేటాయింపు, ఉస్మానియా ఆస్పత్రి నిర్మాణానికి గోషామహల్ పోలీస్ గ్రౌండ్స్ భూమి బదలాయింపుకు మంత్రి మండలి ఒకే చెప్పింది. దీంతో పాటుగా.. ఏటూరు నాగారాన్ని రెవెన్యూ డివిజన్ చేస్తూ క్యాబినెట్ తీర్మానం చేసింది. దీంతో ఏటూర్ నాగారం కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, ప్రజలు బాణా సంచాలు కాల్చుతూ సంబరాలు చేసుకున్నారు.

**కేబినెట్ నిర్ణయాలివే...** ఏటూరు నాగారంను రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేస్తూ కేబినెట్ తీర్మానం. సమ్మక్క సారలమ్మ ట్రైబర్ వర్సిటీకి 211 ఎకరాలు అప్పగిస్తూ తీర్మానం.

మెట్రో రైలు మార్గాల విస్తరణకు కేబినెట్ ఆమోదం. నాగోల్ - ఎల్బీనగర్ - హయత్‌నగర్, ఎల్బీనగర్ - శంషాబాద్ విమానాశ్రయం వరకు మెట్రో విస్తరణకు ఆమోదం తెలిపింది.

# సంపాదకీయం

## టీడీపీ ఎమ్మెల్యేలను... ఆ కళ్ళు కనిపెడుతూంటాయ్ !

తెలుగుదేశం పార్టీ ఈసారి బంపర్ విక్టరీ కొట్టింది. 135 మంది ఎమ్మెల్యేలు టీడీపీకి సొంతంగా ఉన్నారు. ప్రతీ జిల్లాలో నూటికి తొంభై అయిదు శాతం మంది టీడీపీ ఎమ్మెల్యేలే ఉన్నారు. ఇక అయిదేళ్ల తరువాత దక్కిన అధికారం కాబట్టి ఎమ్మెల్యేలు కొంత చొరవ తీసుకుంటున్నారు. అంతే కాదు ఇసుక లిక్కర్ వంటి వాటి ఇషయంలో వారు తమదైన వాటం చూపిస్తున్నారు అన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయంలో అధినాయకత్వం పలు మార్లు హెచ్చరించినా కొందరి తీరు అయితే మారడం లేదు అని అంటున్నారు. గ్రౌండ్ లెవెల్ లో ప్రజలతో నేరుగా కనెక్షన్ ఉండే ఎమ్మెల్యేలతో కనుక ఇబ్బంది వస్తే అది పార్టీకి ప్రభుత్వానికి కూడా చివరికి చెడ్డ పేరు తెస్తుందని కూడా భయపడుతున్నారు. అందుకే అధినేత ముఖ్యమంత్రి చంద్రబాబు అనేక సార్లు ఇదే విషయం చెప్పుకొచ్చారు. పార్టీ పరంగా తగిన జాగ్రత్తలు తీసుకోండి ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయండి, ఆరోపణలకు విమర్శలకు దూరంగా ఉండండి అని కూడా ఆయన పేర్కొంటూ వచ్చారు. అయితే ఎంత చెప్పినా ఎన్నిసార్లు మీటింగులు పెట్టినా క్లోజ్ గా మోనిటరింగ్ చేయడం అన్నది కుదరదు కాబట్టి చంద్రబాబు ఒక కీలకమైన నిర్ణయం తీసుకున్నారు. అదేంటి అంటే ఎమ్మెల్యేల పనితీరు తో పాటు వారి వ్యవహార శైలిని కూడా మరింత దగ్గరగా గమనించడానికి అయిదుగురు సభ్యులతో ఒక కమిటీని నియమిస్తున్నారు లోకల్ గా దందాలు చేస్తే కనుక ఈ కమిటీ అసలు ఊరుకోదు ఉపేక్షించదని అంటున్నారు. ఈ కమిటీ మొదట ఆరోపణలు వచ్చిన ఎమ్మెల్యేలను పిలిచి మాట్లాడుతుందని అప్పటికి వారు తీరు మార్చుకోకపోతే అపుడు నేరుగా ముఖ్యమంత్రి పార్టీ అధినేత అయిన చంద్రబాబుకే చెబుతూ ఆయన ముందుకే విషయాన్ని చేరవేస్తుందని అంటున్నారు. అంటే మ్యాటర్ వెరీ సీరియస్ అన్న సందర్భాలలో చంద్రబాబు ముందుకు సదరు నేతల వివరాల చిట్టా టేబిల్ మీద ఉంటుంది అన్న మాట. ఇక చంద్రబాబు దగ్గరకు ఆ వ్యవహారం కనుక చేరితే ఆయా ఆరోపణలు తీరుని బట్టి సీఐడీ, విజిలెన్స్ ఇతర ఎన్ ఫోర్స్ మెంట్ విభాగాలకు దానిని రిఫర్ చేసి యాక్షన్ దిశగానే అడుగులు వేస్తారు అని అంటున్నారు. ఇది నిజంగా ఏపీలోనే కాదు రాజకీయాల్లోనే కొత్త ప్రయోగం అని అంటున్నారు. సొంత పార్టీ ఎమ్మెల్యేల మీద కనుక ఎన్ ఫోర్స్ మెంట్ ఏజెన్సీలకు రిఫర్ చేస్తే కనుక ప్రభుత్వం పారదర్శకత రుజువు అవుతుందని అంటున్నారు. ఒక విధంగా అవినీతి అక్రమాలకు అడ్డుకట్ట పడుతుందని అంటున్నారు. దాని వల్ల కచ్చితంగా భారీ మార్పు అయితే వస్తుందని అంటున్నారు. మరి అంతవరకూ ఏ ఎమ్మెల్యే అయినా తెచ్చుకోరు కదా అని అంటున్నారు. అందుకే ఫైవ్ మెన్ కమిటీ తోనే వారికి సీరియస్ రిమార్కులతో ఏ రకమైన ఆరోపణలు వచ్చినా ఇక వెనక్కి తగ్గాల్సిందే అని అంటున్నారు. ఈసారి టీడీపీ భారీ మెజారిటీతో గెలిచింది. పైగా ప్రతీ నియోజకవర్గంలో టీడీపీలో ఎమ్మెల్యే స్థాయి నాయకులు నలుగురైదుగురు ఉన్నారు. సో ఎవరినీ ఉపేక్షించేది లేదని తప్పు చేసిన వారికి శిక్షలు ఉంటాయని ప్రభుత్వం హెచ్చరిస్తోంది. ఎమ్మెల్యేల మీద సీరియస్ గా ఆరోపణలు వస్తే వారి ప్లేస్ లో కొత్త వారిని ఇంచార్జిగా నియమించేందుకు కూడా చంద్రబాబు వెనకాడబోరని పార్టీ వర్గాలు అంటున్నారు. బాబు కనుక ఈ విషయంలో చండశాసనుడిగా వ్యవహరిస్తే మాత్రం టీడీపీకి అది మంచి పేరు తెచ్చిపెడుతుందని అంటున్నారు. చూడాలి మరి ఏమి జరుగుతుందో.

## క్రాకర్స్ దుకాణదారులకు అగ్ని ప్రమాదాలు తలెత్తకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు సూచించిన శామీర్పేట సీఐ శ్రీనాథ్




శామీర్ పేట, (గరుడ వార్త): దీపావళి పండగ సందర్భంగా ఏర్పాటు చేసుకునే క్రాకర్స్ దుకానుదారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి, అగ్ని ప్రమాదాలు తలెత్తకుండా ఉండేందుకుగాను, దుకాన్ దారులకు తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలను శామీర్ పేట సిఐ శ్రీనాథ్ వారికి వివరించారు. క్రాకర్స్ సందర్భంగా క్రాకర్స్ దుకాణాలు ఏర్పాటు చేసే నిర్వాహకులు తగు జాగ్రత్తలు తీసుకుంటూ క్రాకర్స్ ను విక్రయించాలని శామీర్ పేట పోలీస్ ఇన్స్పెక్టర్ శ్రీనాథ్ సూచించారు. శనివారం శామీర్ పేట పోలీస్ స్టేషన్లో క్రాకర్స్ దుకాణాల నిర్వాహకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ శ్రీనాథ్ మాట్లాడుతూ దీపావళి పండుగ సందర్భంగా ఏర్పాటు చేసుకునే క్రాకర్స్ దుకాణ నిర్వాహకులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు.

క్రాకర్ దుకాణం వద్ద ప్రమాదం జరగకుండా ముందు జాగ్రత్తగా నీటిని, ఇసుకని, ఫైర్ ఎక్స్టిన్గ్విషర్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. క్రాకర్స అమ్మే సమయంలో ట్రాఫిక్ కు అంతరాయం కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. ప్రతి క్రాకర్స్ నిర్వాహకుని తో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎస్సైలు, క్రాకర్స్ దుకాణాల నిర్వహకులు పాల్గొన్నారు.

## ఎల్ఆర్'ఎస్' అంటారో.. లేదో..?



హైదరాబాద్:శంషాబాద్, మణికొండ, నార్సింగి, పెద్దఅంబర్‌పేట, తుర్కయాంజాల్, ఇబ్రహీంపట్నం, తుక్కుగూడ మున్సిపాలిటీలు, మేడ్చల్ జిల్లాలో తూంకుంట, మేడ్చల్, గుండ్లపోచంపల్లి, పోచారం, ఘట్‌కేసర్ మున్సిపాలిటీలు, పీర్జాదిగూడ, బోడుప్పల్ కార్పొరేషన్ల పరిధుల్లోని దరఖాస్తుల్లో పదిశాతం నుంచి 15 శాతం ఇలాంటివి ఉన్నట్టు గుర్తించారు. భూముల క్రమబద్ధీకరణ దరఖాస్తులపై హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల రెవెన్యూ, మున్సిపాలిటీల అధికారులు కొత్త నిర్ణయం తీసుకున్నారు. దరఖాస్తుల్లో కొన్ని చెరువుల బఫర్ జోన్లు ఉన్నాయన్న అనుమానాలు రావడంతో రెవెన్యూ, మున్సిపల్, ఇరిగేషన్ అధికారులు క్షేత్రస్థాయిలో భూములను పరిశీలించనున్నారు. జియో మ్యాపింగ్ సరిహద్దులు, హెచ్ఎండీఏ వెబ్‌సైట్‌లోని చెరువుల ప్రాథమిక నోటిఫికేషన్, తుది నోటిఫికేషన్లను పరిగణలోకి తీసుకుంటున్నారు. ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లు ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల్లో ఉంటే వాటిని వెంటనే తిరస్కరించనున్నారు.

హైడ్రా ప్రభావం..

క్రమబద్ధీకరణ దరఖాస్తుల పరిష్కార బాధ్యతను ప్రభుత్వం స్థానిక సంస్థలను పర్యవేక్షించే అదనపు కలెక్టర్లకు అప్పగించింది. వీటిని మూడంచెల్లో(ఎల్-1, ఎల్-2, ఎల్-3) పరిష్కరించాలంటూ ప్రభుత్వం మార్గదర్శకాలను జారీ చేసింది. దరఖాస్తులను పరిశీలించాక అధికారులు ఆమోదించేలా ఒక యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. గతంలో దరఖాస్తులను ఇరిగేషన్, రెవెన్యూ అధికారుల సూచనల అధారంగా మున్సిపల్ అధికారులు పరిష్కరించారు. హైడ్రా ఏర్పాటుతో క్షేత్రస్థాయిలో పరిశీలించి చెరువుల సరిహద్దులు, బఫర్ జోన్లను నిర్ధరించి దరఖాస్తుదారు పేర్కొన్న సర్వే నంబరు విస్తీర్ణం బఫర్ జోన్‌లోకి వస్తుందా? ఎంత ఆ జోన్‌లో కొంత స్థలాన్ని ఆక్రమించారా? అన్న అంశాలను తేల్చనున్నారు. గ్రామ పరిధిలోని నక్ష, సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన జీడీపీఎస్‌లతో సర్వే నిర్వహించనున్నారు.

కొత్తగా చేసుకున్నాకే...

ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ పరిధుల్లో క్రమబద్ధీకరణ దరఖాస్తులుంటే ప్రాథమిక దశ(ఎల్-1)లోనే అధికారులు తిరస్కరిస్తారు. దరఖాస్తుదారులకు సంక్షిప్త సందేశాలు, ఫోన్లు, ఈ-మెయిల్ ద్వారా తెలపనున్నారు.

బఫర్ జోన్‌లో ఉంటే.. ఆ పరిధి తొలగించి సర్వే చేయించుకుని కొత్త దరఖాస్తు చేసుకున్నాకే క్షేత్రస్థాయిలో రెండోసారి పరిశీలించి ఆమోద ముద్ర వేయనున్నారు.

ఎల్-2 దశలో మున్సిపల్, రెవెన్యూ అధికారులు అభ్యంతరం చేసినా తిరస్కరిస్తారు.

రంగారెడ్డి జిల్లాలో మున్సిపాలిటీలు, గ్రామాల్లో 2.16లక్షల క్రమబద్ధీకరణ దరఖాస్తులు పరిశీలనలో ఉండగా... మేడ్చల్ జిల్లాలో 40వేలకు పైగా దరఖాస్తులను పరిశీలిస్తున్నారు.

క్రమబద్ధీకరణ ప్రక్రియ పారదర్శకంగా జరిగేందుకు ముగ్గురు అధికారులను నియమించామని, దరఖాస్తుల ప్రక్రియ నిర్ణీత వ్యవధిలో పూర్తిచేసేందుకు కార్యచరణ రూపొందించామని రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) ప్రతిమాసింగ్ తెలిపారు.

## యువతపై షుగర్, హైబీపీ దాడి




హైదరాబాద్: మహానగర పరిధిలోని అర్బన్, పెరి అర్బన్, శివార్లలోని గ్రామీణ ప్రాంతాల్లో మధుమేహం, అధిక రక్తపోటు దాడి చేస్తున్నట్లు తాజా అధ్యయనంలో వెల్లడైంది. 40 శాతం మందిలో మధుమేహం నియంత్రణలో లేనట్లు గుర్తించారు. ఈ ఏడాది జనవరి నుంచి రంగారెడ్డి గ్రామీణ ప్రాంతాల్లో 10,400 మందిపై నగరానికి చెందిన హెల్పింగ్ హ్యాండ్ ఫౌండేషన్ వాలంటీర్లు ఇపరీక్షలు చేయగా.. గ్రామీణంలో 2,649 మంది మధుమేహం, అధిక రక్తపోటుతో.. నగరంలో 10 అర్బన్, పెరి అర్బన్ ప్రాంతాల్లో పరీక్షలు చేయగా.. 2570 మంది ఈ రెండు సమస్యలు ఎదుర్కొంటున్నట్లు హెచ్‌హెచ్ఎఫ్ తెలిపింది.

ఎక్కడెక్కడ సేకరణ చేశారంటే..

నగరంలో హకీంపేట్, వాది-ఇ-మహమూద్, కిషన్‌బాగ్, కాలాపత్తర్, హసన్‌నగర్, జల్‌పల్లి, బాలాపూర్, షహీన్‌నగర్, పహాడీషరీఫ్, వెంకటాపురంతోపాటు మహేశ్వరం, నాగారం, కందుకూరు, ముచ్చెర్ల తదితర శివారు గ్రామాల్లో శాంపిళ్లు సేకరించారు.

30-50 వయసు వారిలో..

గ్రామీణ యువతతో పోల్చితే అర్బన్‌లో 50 శాతం మంది ఎక్కువగా బీపీ, షుగర్ సమస్యలు ఎదుర్కొంటున్నట్లు అధ్యయనంలో గుర్తించారు. మూత్రపిండాలు, మెదడు, హృద్రోగ సమస్యలకు అధిక రక్తపోటు, మధుమేహమే కారణమవుతాయని వైద్యులు పేర్కొంటున్నారు.

మందులు కొనలేక..

ఆసుపత్రుల్లో సరిపడా మందులు ఇవ్వపోవడంతో డబ్బులు పెట్టి కొనలేక కొందరు చికిత్సలు మధ్యలోనే ఆపేస్తున్నారు. దీంతో కొన్నాళ్లకు తీవ్ర అనారోగ్య సమస్యలకు కారణమవుతున్నాయి.

జీవనశైలి మారడంతో..

గ్రామీణ ప్రాంతాల్లో జీవనశైలి మారడం, మద్యపానం, పొగతాగడం తదితర అలవాట్లతో మధుమేహం, అధిక రక్తపోటు సకాలంలో గుర్తించకలేకపోతున్నారు. దాదాపు 40 శాతం మంది మధుమేహ రోగుల్లో హెచ్‌బీఏ1సీ 7.5 ఎంజీ/డీఎల్‌గా ఉండటం ఆందోళన కలిగించే అంశం. సాధారణంగా ఈ స్థాయిలు 4-6 మధ్య ఉండాలని నిపుణులు పేర్కొంటున్నారు.

## జ్వరమొచ్చింది..

కరీంనగర్ : ఉమ్మడి జిల్లాలో ఏ ఇంటి తలుపు తట్టినా ఒక్కరైనా జ్వరం బారిన పడిన వారుంటున్నారు.. ప్రభుత్వ.. ప్రైవేటు ఆస్పత్రులు ఏవి చూసినా జ్వరం, డెంగీ బాధితులతో కిటకిటలాడుతున్నాయి.. సరైన సమయంలో చికిత్స అందక మరణాలూ చోటుచేసుకుంటున్నాయి.. జ్వరమే కదా అని కొందరు సొంత వైద్యం చేసుకోవడం.. ఆర్ఎంపీల వద్ద చికిత్సలు చేయించుకోవడం.. పరిస్థితి విషమించిన తరవాత పెద్దాసుపత్రులకు వెళ్లడంతో ప్రాణాల మీదికి తెచ్చుకుంటున్నారుజాగ్రత్తలతో జ్వరాలు, డెంగీ రాకుండా చూసుకోవచ్చని.. వచ్చినా సరైన వైద్యం, విశ్రాంతితో కోలుకోవచ్చని వైద్యులు చెబుతున్నారు.

జాగ్రత్తలతో నివారణ

డా.విజయ మోహన్‌రెడ్డి.ఫిజిషియన్

ప్రశ్న : జ్వరం రాగానే వైద్యుడి వద్దకు వెళ్లాలా? ప్రాథమిక చికిత్స ఏమైనా ఉందా?

జవాబు : ప్రస్తుతం జ్వరాల తీవ్రత పెరిగింది. జ్వరం రాగానే వారి వయసు, బరువు ప్రకారం పారాసిటమాల్ మాత్ర వేసుకోవడం ప్రాథమిక అవసరం. దీంతో పాటు విశ్రాంతి తీసుకోవాలి. ఒకరోజు కన్నా ఎక్కువ ఉంటే వైద్యుడి వద్దకు వెళ్లాలి.

ప్ర : జ్వరం వచ్చిన తర్వాత ఎన్ని రోజులకు ఏఏ పరీక్షలు చేయడం వల్ల ఫలితాలు పూర్తి స్థాయిలో తెలుసుకునే అవకాశం ఉంటుంది.

జ : రెండు రోజుల వరకు తగ్గకుండా ఒళ్లు నొప్పులు, శరీరంపై దద్దుర్లు రావడం, మూత్రం, మలంలో రక్తం రావడం, పళ్ల చిగుళ్ల నుంచి రక్తం వంటివి వచ్చినట్లైతే కచ్చితంగా వైద్యుడి వద్దకు వెళ్లి సీబీపీ రక్త పరీక్ష చేయించాలి. అందులో తెల్ల రక్తకణాలు, ప్లేట్‌లెట్స్ తగ్గితే మందులు వాడాలి. డెంగీకి సంబంధించి ఎలీసా పరీక్ష చేయిస్తేనే డెంగీ నిర్ధారణ అవుతుంది. అలా నిర్ధారణ కాగానే వైద్యుడి సలహా మేరకు మందులు వాడాలి. 20 వేల లోపు ప్లేట్‌లెట్స్ తగ్గిపోతే తీవ్రంగా భావించాలి. లక్షలోపు ఉన్నా వైద్యుడి పర్యవేక్షణలో ఉండాలి. జ్వరం తీవ్రంగా ఉన్నపుడు రక్తపోటు తగ్గే అవకాశం ఉంటుంది. వాంతులు అవుతాయి. ఇతర కారణాలు కూడా ఉంటాయి. వైద్యుడి పర్యవేక్షణ అవసరం.

ప్ర : ఔషధాల వాడకం ఎలా ఉండాలి?

జ : జ్వరంతో ఉన్నవారు మొదట్లో పారాసిటమాల్ మాత్ర వాడుకుంటూ పళ్ల రసాలు తీసుకోవాలి. యాంటీబయాటిక్స్ వైద్యుడి సూచన మేరకు ఉపయోగించాలి. డెంగీతో బాధ పడేవారు నొప్పి నివారణ మాత్రలు, సూదిమందు వాడొద్దు. లక్షణాలు తీవ్రంగా ఉన్నపుడు అసలు తీసుకోవద్దు. బాగా నొప్పులు ఉన్నాయని వెళ్తే కొందరు ఆర్ఎంపీలు ఇవి ఇస్తున్నారు. ఇది ప్రమాదకరం. అర్హులైన వైద్యుల సూచనలు మాత్రమే పాటించాలి.

ప్ర : వృద్ధులు, పిల్లలు, గర్భిణులు, బాలింతలు జ్వరం బారిన పడితే..?

జ : వైద్యుల పర్యవేక్షణలోనే మందులు వాడాలి. జ్వరం వచ్చిన పిల్లలను బడికి పంపించవద్దు. అతడిని కుట్టిన దోమ ఇతర పిల్లలకు కూడా కుడితే జ్వరాలు వస్తాయి. దోమ వల్ల జ్వరం వచ్చిన వారు ఇతరులకు, ముఖ్యంగా పిల్లలకు దూరంగా ఉండాలి.

ప్ర : వ్యక్తిగత, ఇంటి పరిశుభ్రత ఎలా ఉండాలి. జ్వరం బారిన పడకుండా తీసుకోవాల్సిన చర్యలు ఏమిటి?

జ : దోమలు లేకుండా అన్ని జాగ్రత్తలు పాటించాలి. జ్వరం బారిన పడ్డవారు తప్పనిసరిగా దోమ తెరలు వాడాలి. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి. పరిసరాలన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలి. జ్వరం బారిన పడ్డవారు పళ్ల రసాలతోపాటు అన్నం మెత్తగా వండి ద్రవ రూపంలో తీసుకోవాలి. మాంసాహారం, వేపుళు తినొద్దు. పూర్తిగా విశ్రాంతి తీసుకోవాలి.

ప్ర : జ్వరం తగ్గిన తర్వాత తీసుకోవాల్సిన జాగ్రత్తలు

జ : జ్వరం తగ్గిన తర్వాత వారం రోజుల పాటు విశ్రాంతి అవసరం. తేలికగా జీర్ణమయ్యే ఆహారం తీసుకోవాలి.

ఎలీసా పరీక్షతోనే డెంగీ నిర్ధారణ

జ్వరాల విజృంభణ నేపథ్యంలో అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నాం. ప్రతి మంగళ, శుక్రవారాలలో డ్రైడే నిర్వహించడంతోపాటు ఎక్కువ మంది జ్వరాల బారిన పడిన ప్రాంతంలో వైద్య శిబిరం నిర్వహిస్తున్నాం. అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పల్లె, బస్తీ దవాఖానాల్లోనూ జ్వర నివారణకు వైద్యం అందుబాటులో ఉంది. డెంగీ పాజిటివ్ వచ్చిన వారిని కరీంనగర్ జనరల్ ఆస్పత్రికి తరలించి వైద్యం అందిస్తున్నాం. జ్వరం వచ్చి ప్లేట్‌లెట్లు తగ్గాయని అనగానే డెంగీ అని భయపడొద్దు. ఎలీసా పరీక్షలో నిర్ధారణ అయితేనే డెంగీగా భావించాలి. డాక్టర్ సుజాత, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి

## కూల్చేస్తే సరి..!

సూర్యాపేట : పట్టణాలు, గ్రామాల్లో పాత భవనాలు ప్రమాదకరంగా మారుతున్నాయి. ఏళ్ల కిందట నిర్మించినవి కావటంతో శిథిలావస్థకు చేరాయి. ముసురులకు, వర్షాలకు నాని కూలిపోతున్నాయి. వాటిని కూల్చకుండా ఇంటి యజమానులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. గతేడాది నాగారం మండల కేంద్రంలో వర్షానికి మట్టి గోడలు కూలి తల్లిదండ్రులతో సహా కుమారుడు మృతిచెందారు. ఆ ఘటన మరవక ముందే ఆత్మకూర్(ఎస్) మండలం నెమ్మికల్‌లో ఇద్దరు అన్నదమ్ముళ్లపై ఇంటి పక్కన గోడ కూలింది. ప్రమాదంలో ఒకరు మృతిచెందగా.. మరొకరి పరిస్థితి విషమంగా మారింది.

ఇదీ పరిస్థితి..సూర్యాపేట, నల్గొండ, యాదాద్రి జిల్లాల్లో 19 పురపాలికలు, 1740 గ్రామ పంచాయతీలున్నాయి. పట్టణాల్లో ఏళ్ల నాటి పాత భవనాలున్నాయి. శిథిల భవనాల యజమానులకు పుర అధికారులు నోటీసులు జారీ చేస్తున్నారే తప్ప పూరిస్థాయిలో చర్యలు చేపట్టడం లేదు.

ఇటీవల కురిసిన వర్షాలకు సూర్యాపేట పట్టణంలోని రాజీవ్‌నగర్‌లో ఏళ్ల నాటి పాత ఇల్లు కూలిపోయింది. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ఇలాంటి ఇళ్లు ఉమ్మడి నల్గొండ జిల్లాలోని అన్ని పురపాలికల్లో, గ్రామాల్లో ఉన్నాయి. భారీ వర్షాలకు గోడలు నాని కూలే ప్రమాదం ఉంది. ఈ ఇళ్ల యజమానులకు సంబంధిత అధికారులు నోటీసులు జారీ చేసి కూల్చివేసే చర్యలు చేపట్టాల్సి ఉన్నా తమకేమిపట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

గుర్తించినా.. పట్టించుకోవటం లేదు


వానాకాలం ముందు ఉమ్మడి జిల్లాలో పాత భవనాల ఇళ్లను గుర్తించేందుకు అధికారులు ఇంటింటి సర్వే చేపట్టారు. పట్టణాలు, గ్రామాల్లో అప్రమత్తం చేసినా ఇంటి యజమానుల్లో అవగాహన కలగటం లేదు. జూన్‌లో పురలు, పట్టణాల్లో పాత భవనాలున్న వారి ఇంటింటికీ వెళ్లి నోటీసులు జారీ చేశారు. కానీ కొందరు ఇళ్ల యజమానులు మాత్రం తమకేమి పట్టనట్లు ఉండిపోయారు.

చర్యలు తీసుకుంటాం..

శ్రీనివాస్, పుర కమిషనర్, సూర్యాపేట

పురపాలికల్లో పాత ఇళ్లపై చర్యలు తీసుకుంటాం. మరోసారి యజమానులకు నోటీసులు జారీ చేస్తాం. ప్రమాదకరంగా ఉంటే ఖాళీ చేయించి కూల్చివేయిస్తాం. ఇప్పటికే జూన్‌లో సర్వే చేపట్టి ఇలాంటివి గుర్తించి అప్రమత్తం చేశాం. మరోసారి చర్యలు చేపడతాం.

# దేవుడి భూమినీ వదలడం లే!



కరీంనగర్ : ఇది.. రాజీవ్ రహదారికి ఆనుకొని కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం నుస్తులాపూర్‌లో ఉన్న అనంత పద్మనాభ స్వామి ఆలయానికి చెందిన భూమి. ఈ స్థలాన్ని కబ్జా చేసేందుకు కొన్నేళ్లుగా కుట్రలు జరిగాయి. స్థానికంగా ఉన్న యువత, గ్రామస్థులు ఈ భూమిని కాపాడేందుకు ఏళ్ల తరబడి పోరాటం చేశారు. న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఎట్టకేలకు భూమికి హద్దులు నిర్ణయించాలని కోర్టు ఆదేశించింది. ఈ స్థలం విలువ బహిరంగ మార్కెట్లో గుంటకు రూ.30 లక్షల దాకా ఉంటుంది. దేవుడి పేరిట రెండు వేర్వేరు సర్వే నెంబర్లలో ఇక్కడ 10.10 ఎకరాల భూమి ఉంది. ఈ భూమికి ఇప్పటికైనా దేవాదాయ శాఖ అధికారులు హద్దులు నిర్ణయించి ప్రహరీ నిర్మిస్తే దేవుడి మాన్యానికి రక్షణ ఉంటుంది.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆలయాలకు సంబంధించిన భూములు కాలక్రమేణా ఆక్రమణకు గురవుతున్నాయి. 1955-56 కాస్రా పహాణితో పోలిస్తే ఇప్పుడు రికార్డుల్లో ఉన్న విస్తీర్ణం తగ్గింది. దేవాదాయ శాఖ అధికారులు చెప్పిన వివరాల మేరకే 818 ఎకరాలు ఆక్రమణదారుల చేతుల్లోకి వెళ్లాయి. ఇది ధరణి పోర్టల్‌లో ఉన్న ప్రస్తుత లెక్కల ప్రకారం. కాని అనధికారికం సుమారుగా 1500 ఎకరాల వరకు ఆలయాల భూమి కబ్జా చెరలో చిక్కుకున్నట్లు సమాచారం. ఆలయ భూములను ఆనుకుని ఉన్న వారు హద్దులు చెరిపేస్తూ ఆక్రమించడం, ఆ తరువాత కోర్టులను ఆశ్రయించడంతో ఏటా కొంత భూమిని దేవాదాయ శాఖ కోల్పోతూ వస్తోంది. అధికారులు మారుతుండటం, గ్రామాల్లో ఆలయ భూములెక్కడ ఉన్నాయో స్పష్టత లేకపోవడంతో సంరక్షణ కష్టసాధ్యమవుతోంది.

ఊరూరా ఇదే తీరు..!

హుజూరాబాద్ హనుమాన్ ఆలయానికి చెందినవి 1.14 ఎకరాలు, సిరిసిల్ల వేంకటేశ్వర స్వామి ఆలయ పరిధిలో 1.15 ఎకరాలు, పెద్దపల్లి గోశాలలో 1.13 ఎకరాలు, పెద్దపల్లి సీతారామస్వామి ఆలయ పరిధిలో 8.32 ఎకరాలు, జగిత్యాల రాజరాజేశ్వర స్వామి ఆలయ పరిధిలో 2.04 ఎకరాలు, కోరుట్ల వేంకటేశ్వరస్వామి ఆలయానివి.. 20 గుంటలు, జగిత్యాల రాంమందిర్ భూమి 19 గుంటలు, పెద్దపల్లి నర్సింహాస్వామి భూమి 13.20 ఎకరాలు, కొండగట్టు ఆలయ భూములు రెండెకరాలు.. ఇలా అన్ని గ్రామాలు, పట్టణాల్లోని ఆలయ భూములు ఆక్రమణల్లో చిక్కుకున్నాయి. ఇందులో చాలామంది ఆక్రమణదారులు న్యాయస్థానాలను ఆశ్రయించడంతో తిరిగి స్వాధీనం చేసుకోవడం యంత్రాంగానికి సవాలుగా మారుతోంది. కొన్ని కేసుల్లో దేవాదాయశాఖకు అనుకూలంగా తీర్పులు రావడంతో.. వీటిని సెక్షన్-84 ప్రకారం పోలీసులు, రెవెన్యూ సహకారంతో స్వాధీనపర్చుకుంటున్నారు.

స్వాధీనం చేసుకుంటాం - సుప్రియ, దేవాదాయశాఖ సహాయ కమిషనర్, ఉమ్మడి కరీంనగర్ జిల్లా

ఎట్టి పరిస్థితుల్లో దేవుడికి సంబంధించిన గుంట భూమిని కూడా ఆక్రమణదారులకు వదిలిపెట్టం. కచ్చితంగా స్వాధీనపర్చుకుంటాం. చాలా కేసుల్లో మా శాఖకు అనుకూలంగా తీర్పులు వస్తున్నాయి. త్వరలోనే రెవెన్యూ అధికారుల సహకారంతో సర్వేలు నిర్వహించి హద్దులు ఏర్పాటు చేస్తాం. ఇదే సమయంలో ధరణి పోర్టల్‌లో ఉన్న రికార్డుల ఆధారంగా ప్రతి జాగాను కాపాడే ప్రయత్నం చేస్తున్నాం. ఇందుకు సంబంధించి ఉన్నతాధికారులకు లేఖ రాశాం.

## పదోన్నతికీ ఓ లెక్కుంది

హైదరాబాద్ : దేవాదాయ శాఖలో ఈఓల పదోన్నతుల అంశం వివాదాస్పదంగా మారింది. ప్రభుత్వ ఉత్తర్వులకు విరుద్ధంగా అర్హత లేనివారికి పదోన్నతులు కల్పించారని, ఇందులో ఓ ఉన్నతాధికారి, సహాయాధికారి చేతివాటాన్ని ప్రదర్శించారన్న ఆరోపణలున్నాయి. అందుకు రూ.2.5 లక్షల-రూ.5 లక్షలు వసూలు చేశారని సమాచారం. పదోన్నతి పద్ధతిలో కాకుండా ట్రాన్స్‌ఫర్ ఆఫ్ సర్వీస్ కింద పదోన్నతులు కల్పించారని ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. పదోన్నతుల అంశంలో అర్హులకు న్యాయం జరగాలంటే విచారణకు ఆదేశించాలని ఉద్యోగులు కోరుతున్నారు.

గ్రేటర్‌లో దేవాదాయశాఖలో 650 మంది ఉద్యోగులు ఉండగా 150 మంది ప్రభుత్వ ఉద్యోగులు, మిగిలిన 500 మంది ప్రయివేటు ఉద్యోగులున్నారు. ఫౌండర్ ట్రస్టీలు, ఛైర్మన్లు దేవాలయ ఉద్యోగులను (జూనియర్ అసిస్టెంట్, సీనియర్ అసిస్టెంట్, సూపరింటెండెంట్) నియమిస్తున్నారు. ప్రయివేటు ఉద్యోగుల్లో ఎక్కువ కాలం పనిచేసిన వారిని సీనియార్టీ ప్రకారం ఈఓగా (ప్రభుత్వ ఉద్యోగంలోకి) తీసుకోవచ్చనే నిబంధనలున్నాయి. దీని ఆధారంగా కొందరు అక్రమాలకు పాల్పడుతున్నారు. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం దేవాలయ ఉద్యోగుల్లో 33 మందికి ఈవోలుగా పదోన్నతులు కల్పించగా అందులో



15 మంది రాజధానిలో పనిచేసేవారే. పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా అర్హులను గుర్తించకుండా అనుయాయులకు పదోన్నతులు కల్పించారన్నది ప్రధాన ఆరోపణ. 2002లో వెలువడిన 261 జీవో ప్రకారం ఈఓలను నియమించాలి. దేవాలయాల్లో పనిచేసే జూనియర్ అసిస్టెంట్లను గ్రేడ్-3 ఈఓలుగా, సీనియర్ అసిస్టెంట్లను గ్రేడ్-2 ఈఓలుగా, సూపరింటెండెంట్లను గ్రేడ్-1 ఈఓలుగా ట్రాన్స్‌ఫర్ ఆఫ్ సర్వీస్ కింద నియమాకాలు చేపట్టాలి. కానీ తాజాగా ఇచ్చిన పదోన్నతులను ట్రాన్స్‌ఫర్ ఆఫ్ ఆర్డర్స్‌గా కాకుండా ప్రమోషన్ ఇస్తూ పదోన్నతి కల్పించారన్నది ఆరోపణ.

## మరమ్మతుపై పట్టింపేదీ?

మెట్‌పల్లి : పట్టణ పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని బల్దియా అధికారులు నిత్యం వార్డుల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. చెత్తసేకరణ వాహనాలకు నెలలు గడుస్తున్నా మరమ్మతు చేయించకపోవడంతో స్వచ్ఛ పట్టణం ఎలా సాధ్యమని ప్రజలు విమర్శిస్తున్నారు. మెట్‌పల్లి పట్టణ పరిధిలో 28 ఆటోలు, 2 టిప్పర్లు, 2 డోజర్లు, 4 ట్రాక్టర్లు, 3 ట్యాంకర్లు, 1 లాడర్ జేసీబీ ఉన్నాయి. ఇందులో ప్రస్తుతం రెండు టిప్పర్లు, ఒక స్వీపింగ్ యంత్రం, ఒక ఆటో, ఒక ట్యాంకర్, ఒక డోజర్ వాహనాలు చెడిపోయి తుప్పుపడుతున్నాయి. ఈ విషయంపై బల్దియా కమిషనర్ మోహన్‌ను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా వాహనాల మరమ్మతు కోసం సంబంధిత కంపెనీల వారికి సమాచారం ఇచ్చామన్నారు. 10 రోజుల్లో అన్ని వాహనాలను వినియోగంలోకి తీసుకువస్తామని తెలిపారు.

ఇంజిన్ సమస్యతో డోజర్.. రూ.12 లక్షలతో కొనుగోలు చేసిన డోజర్ వాహనాన్ని ఇంజిన్ సమస్యతో మూలనపడేశారు. వాహనాన్ని



పాతబల్దియా కార్యాలయ ఆవరణలో నిలిపి రెండేళ్లు గడుస్తుండగా టైర్లు, ఇతర పరికరాలు తుప్పుపడుతున్నాయి.

మూలనపడి ఆరు నెలలు.. పట్టణంలోని ప్రధాన రహదారితో పాటు వార్డులలో రోడ్లను శుభ్రం చేసే స్వీపింగ్ యంత్రంతో వారానికి రెండు రోజులు రహదారులను శుభ్రం చేయిస్తున్నారు. చిన్నపాటి సమస్యతో మూలనపడి 6 నెలలు గడుస్తున్నా పట్టించుకోవడం లేదు.

రెండు టిప్పర్లు.. పట్టణంలోని ప్రధాన రహదారితో పాటు కూరగాయల మార్కెట్లో నిత్యం చెత్తను సేకరించేందుకు రెండు టిప్పర్లను కొనుగోలు చేశారు. రెండు టిప్పర్లు చెడిపోయి అయిదు నెలలు గడుస్తున్నా పట్టించుకునేవారు కరవయ్యారు. వేరే వాహనానికి టైర్ల బిగింపు.. చెత్తసేకరణ కోసం ఏర్పాటు చేసిన ఆటో క్లచ్‌ప్లేట్లు చెడిపోయి నెల రోజులు గడుస్తోంది. ఆటో టైర్లను తొలగించి మరో దానికి బిగించడంతో ప్రస్తుతం మూలనపడి ఉంది.

## ఉచిత బియ్యం మరో నాలుగేళ్లు పొడిగింపు

ఇబ్రహీంపట్నం: పేదలకు అందిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని మరో నాలుగేళ్ల పాటు కేంద్ర ప్రభుత్వం ఉచితంగా అందించనుంది. కరోనా విపత్తుకు ముందు రేషన్ కార్డు దారులకు ఒక్క రూపాయికి కిలో బియ్యాన్ని అందజేశారు. కరోనా సమయంలో కేంద్రం పేదలకు ఉచితంగా రేషన్ బియ్యాన్ని పంపిణీ చేయడం ప్రారంభించగా ప్రస్తుతం మరో నాలుగేళ్ల పాటు ఇవ్వాలని నిర్ణయించింది.

జిల్లాలో 6 లక్షల మంది లబ్ధిదారులు ప్రధాన మంత్రి గరీబ్ కల్యాణ అన్న యోజనలో భాగంగా రేషన్ కార్డుదారులకు కేంద్రం బియ్యాన్ని పంపిణీ చేస్తుంది. జిల్లాలో సుమారు 3 లక్షల వరకు రేషన్ కార్డులుండగా సుమారు 6 లక్షల మంది లబ్ధిదారులున్నారు. నెలకు ఒక్కొక్కరికి 6 కిలోల చొప్పున బియ్యాన్ని అందజేస్తున్నారు. గతంలో ఒక్క రూపాయి కిలో బియ్యాన్ని అందజేయగా కరోనా నుంచి ఉచిత పంపిణీ చేస్తున్నారు. తాజాగా కేంద్రప్రభుత్వం ఉచిత బియ్యం పంపిణీని మరో నాలుగేళ్ల పాటు అమలు చేయాలని నిర్ణయించింది. దీంతో జిల్లాలో 6 లక్షల మందికి లబ్ధి కలగనుంది. ఉచితంగా బియ్యాన్ని పంపిణీ చేయడం ద్వారా పేదలకు మేలు జరుగుతుందని పలువురు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రజలు పోషకాహార లోప నివారణకు కేంద్ర ప్రభుత్వం చౌకధరల దుకాణాల్లో అందించే బియ్యంలో ఫోర్టిఫైడ్ బియ్యాన్ని కలుపుతున్నారు. ఈ బియ్యం అనేక పోషకాల మిలితం. ఒక క్వింటాల్ బియ్యంలో ఒక కిలో ఫోర్టిఫైడ్ బియ్యాన్ని కలుపుతున్నారు.

## వందల్లో కార్మికులు.. విధుల్లో కనిపించరు



| | |
|---|---|
| నగర జనాభా : | 3.50 లక్షలు |
| డివిజన్లు : | 60 |
| ఇళ్ల సంఖ్య : | 89 వేలు |
| ఇన్‌స్పెక్టర్లు : | 7 |
| జవాన్లు : | 9 |
| సహాయకులు : | 34 |
| పనిచేసే కార్మికులు : | 898 |

కరీంనగర్ : నగరంలోని టెలిఫోన్ క్వార్టర్స్ రోడ్డు, సప్తగిరి కాలనీ ప్రాంతాల్లో రహదారులు శుభ్రంగా ఉండటంలేదు. ఎక్కడి చెత్త అక్కడే ఉంటుంది. ఫిర్యాదు చేస్తే తప్ప కార్మికులు కనిపించడం లేదు. గణేశ్‌నగర్ బైపాసు రోడ్డుకు ఇరువైపులా కొద్ది రోజులుగా ఊడవటం లేదు. ఎక్కడ పడితే అక్కడ చెత్త కుప్పలు కనిపిస్తున్నాయి. గతంలో మాదిరిగా శుభ్రతను పట్టించుకోవడం లేదు.

కూడళ్ల చుట్టూ చెత్తా చెదారం లేకుండా శుభ్రంగా ఉంచేవారు. ఎప్పటికప్పుడు పిచ్చి మొక్కలు తొలగించేవారు. ప్రస్తుతం హరితహారం కార్మికులు తొలగించకపోగా, డివిజన్ కార్మికులు సైతం ఆవైపు చూడటం లేదు. పై ఉదాహరణలు చాలు కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలో పారిశుద్ధ్య పనుల నిర్వహణ గాడి తప్పుతుంది అనడానికి. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో అవార్డులు, ర్యాంకులు సాధించిన నగరంలో.. కొద్ది నెలలుగా అపరిశుభ్రత ఎక్కడ పడితే అక్కడ దర్శనమిస్తోంది. పండగల సమయంలో అయితే రహదారులు అధ్వానంగా మారుతున్నాయి.

ప్రైవేటు పనులకే పరిమితం..

నగరంలో పారిశుద్ధ్య కార్మికులు డివిజన్‌కు కనీసం 10 నుంచి 12 మంది పని చేయాల్సి ఉంటుంది. ఈ లెక్కన పరిశీలిస్తే ఒక్కోచోట 8 మంది కూడా క్షేత్రస్థాయిలో ఉండటం లేదు. కొందరు ప్రజాప్రతినిధులు, అధికారుల ఇళ్లలో పనిచేస్తుండగా, మరికొందరు డివిజన్‌లలో ప్రైవేటు పనులలో నిమగ్నమవుతున్నారు.

గాంధీరోడ్డులో రాత్రిపూట పనిచేసే కార్మికులే లేరు. డ్రైవర్లు, లోడర్లు లేకపోవడంతో రోజంతా పనిచేసేవారితోనే చెత్తను ఎత్తిస్తున్నారు.

భూగర్భ డ్రైనేజీలు ఉన్నచోట పూడికతీసే కార్మికులు కనిపించడంలేదు.

అటకెక్కిన పర్యవేక్షణ

నగరంలో పారిశుద్ధ్య విభాగానికి పర్యవేక్షకులు లేకపోవడంతో ఇన్‌ఛార్జిలతో నెట్టుకొస్తున్నారు. దీంతో పనులలో నిర్లక్ష్యం కనిపిస్తోంది. రోజూ ఉదయం, మధ్యాహ్నం తనిఖీలు లేకపోవడంతో పనులు సక్రమంగా జరగడం లేదనే ఫిర్యాదులు అధికమయ్యాయి.

నగరపాలిక పనులు వదిలేసి..

డివిజన్‌లలో రహదారులకు ఇరువైపులా శుభ్రంగా ఊడవటం, ప్రతీ వీధిలోని బహిరంగ మురుగునీటి కాలువల్లో పూడిక తొలగించడం, ప్రభుత్వ కార్యాలయాల దగ్గర పిచ్చిమొక్కలు లేకుండా చూడటంవంటి పనులు చేయాల్సి ఉండగా పట్టించుకోవడంలేదు. నగరపాలిక పనులు చేయకుండా కార్మికులను ప్రైవేటు ప్లాట్ల వద్ద శుభ్రం చేసేందుకు, అక్కడున్న చెత్తను తరలించేందుకు ట్రాక్టర్లను వినియోగిస్తుండటంతో దీని ప్రభావం పారిశుద్ధ్య పనులపై పడుతోంది. ప్రైవేటు ప్లాట్లకు జరిమానా వేసి శుభ్రం చేయాల్సి ఉండగా ఎక్కడ కూడా అలా జరగడంలేదు.

చర్యలు తీసుకుంటాం- జె.సువార్త, అదనపు కమిషనర్, కరీంనగర్ నగరపాలిక

డివిజన్‌లలోని అంతర్గత వీధులలో పారిశుద్ధ్య పనులు సక్రమంగా జరిగేలా జవాన్లతో పర్యవేక్షణ పెంచడం జరుగుతుంది. తనిఖీల సందర్భంగా నిర్లక్ష్యం కనిపిస్తే చర్యలు తీసుకుంటాం.

## ఈఎస్ఐ మందులు పక్కదారి!



కరీంనగర్ : ఈఎస్ఐ ఆస్పత్రిలో రోగులకు ఇవ్వాల్సిన మందులను అక్రమంగా కరీంనగర్‌లోని ఓ మెడికల్ దుకాణంలో విక్రయిస్తుండగా అధికారులు పట్టుకున్న సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఆసిఫాబాద్ కుమురం భీం జిల్లాలోని సిర్పూర్ కాగజ్‌నగర్‌లో ఉన్న ఈఎస్ఐ ఆస్పత్రి ఉద్యోగి ఈ అక్రమానికి పాల్పడ్డారు. ఈయన వాహనంలో రూ.4.87లక్షల విలువైన అయిదు రకాల మందులను మూడు రోజుల కిందట కరీంనగర్‌కు తీసుకొచ్చారు. రహస్యంగా కరీంనగర్ ఉస్మాన్‌పురలో ఉన్న ఓ మెడికల్ దుకాణంలో విక్రయిస్తుండగా ఔషధ నియంత్రణాధికారులు పట్టుకున్నారు. కొనుగోలు చేస్తున్న వ్యాపారిపై కేసు నమోదు చేశారు. వాహనంతోపాటు దొడ్డిదారిన విక్రయిస్తున్న ఔషధాలను స్వాధీనం చేసుకుని న్యాయస్థానానికి అప్పగించారు. వీటిని విక్రయిస్తున్న ఉద్యోగిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఈఎస్ఐ సంయుక్త సంచాలకుడికి ఔషధ నియంత్రణ శాఖ డీజీ లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఉన్నతాధికారుల నుంచి వచ్చిన ఆదేశాలతో ఆయనపై చర్యలు ఉండే అవకాశముంది. ఇంత పెద్ద మొత్తంలో ఔషధాలు పట్టుపడిన తీరుని అధికారులు సవాలుగా తీసుకుంటున్నారు. గతంలోనూ ఇదే విధంగా పలుచోట్ల విక్రయించి ఉంటారనే అనుమానంతో ఈ సంఘటనపై మరింత లోతుగా విచారణ చేస్తున్నారు. పట్టుబడిన వ్యక్తుల నుంచి వాంగ్మూలాలు తీసుకోవడంతోపాటు వీరికి వచ్చిన సమాచారం ఆధారంగా పలు దుకాణాలపై కూడా నిఘా పెట్టినట్లు తెలుస్తోంది. కరీంనగర్ ఔషధ నియంత్రణశాఖ సహాయ సంచాలకులు ఎం.శ్రీనివాసులు నేతృత్వంలోని సిబ్బంది ఈ అక్రమ రవాణాపై కొన్ని రోజులుగా నిఘా పెట్టినట్లు తెలుస్తోంది. విశ్వసనీయ వ్యక్తులు ఇచ్చిన సమాచారంతో సిర్పూర్ కాగజ్‌నగర్ నుంచి కరీంనగర్ వరకు వాహనాన్ని రహస్యంగా అనుసరిస్తూ ఫార్మసిస్టు సహా కొనుగోలుదారును పట్టుకున్నారు. ఈ ఆపరేషన్‌లో కరీంనగర్, పెద్దపల్లి, మంచిర్యాల డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు కార్తిక్ భరద్వాజ్, శ్రవణ్, చందనతోపాటు సిబ్బంది పాల్గొన్నారు. ఈ కేసును ఔషధ నియంత్రణ శాఖ డీజీ కమలాసన్‌రెడ్డి ప్రత్యేకంగా పర్యవేక్షిస్తున్నారు.

## అక్రమాలకు 'వే'

బోయినపల్లి : మాన్వాడలోని మానేరు వాగు నుంచి ఇసుక తరలించడానికి బోయినపల్లి తహసీల్దారు కార్యాలయం నుంచి ఈ నెల 21న వే బిల్లులు జారీ చేశారు. ఇసుక రవాణా తేదీ వేయలేదు. పోలీసులు వాహనాల తనిఖీ సమయంలో కార్యాలయం నుంచి వే బిల్లు జారీ తేది 21 ఉండగా, తరలింపు తేదీ ఈ నెల 22 ఉండటాన్ని గుర్తించారు. అక్రమ రవాణాకు వే'బిల్లు' ఉపయోగించారని మూడు ఇసుక ట్రాక్టర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు. ఒక రోజు ముందు తేదీతో ఎలా వే బిల్లు జారీ చేస్తారన్న అనుమానాన్ని పోలీసులు వ్యక్తం చేశారు. గ్రామాల్లో అభివృద్ధి పనులు, స్థానిక అవసరాల కోసం ఇసుక రవాణాలో ఇబ్బందులు తలెత్తకుండా ఉండటానికి జిల్లా యంత్రాంగం ఇసుక తరలించడానికి అనుమతులు ఇస్తుంది. ఇదే అదనుగా కొందరి అధికారుల అండతో అక్రమ రవాణాకు పాల్పడుతున్నారు. నిబంధనలు అతిక్రమించి ఇష్టారీతిన ఇసుక రవాణా చేయడంతోపాటు మధ్యమానేరు జలాశయం కట్ట కింద, రైతుల వ్యవసాయ మోటార్ల సమీపంలో ఇసుక తవ్వకాలు చేస్తున్నారు. బోయినపల్లి మండలం మాన్వాడ, మల్లాపూర్‌లో మానేరు వాగు ఉంది. మాన్వాడ వద్ద ఉన్న మధ్యమానేరు జలాశయం కట్ట కింద వాగు ఉండటంతో ఇక్కడ ఇసుక తవ్వకాలు చేపట్టడం సరికాదని గతంలో ఇంజినీరింగ్ అధికారులు స్పష్టం చేశారు. అయితే అభివృద్ధి పనులు, స్థానిక అవసరాల కోసం ఇసుక లభ్యత లేకపోవడం వల్ల నిబంధనలు పాటించి ఇసుక తరలించడానికి మాన్వాడ నుంచి



అనుమతులు ఇవ్వాలని అధికారులు కోరారు. ఇదే అదనుగా కొందరు ఇసుకాసురులతో చేతులు కలిపి అక్రమ రవాణాకు తెరలేపారు. జలాశయం కట్ట కింద, రైతుల వ్యవసాయ మోటార్లు, బోర్లు, బావుల సమీపంలోనే తవ్వకాలు చేపడుతున్నారు.

పోలీసులకు సమాచారం ఏది?

ఇసుక రవాణాకు సంబంధించి వే బిల్లులు ఇస్తున్న క్రమంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండటానికి, పోలీసులు వాహన తనిఖీల సమయంలో సమాచారం కోసం ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ల నంబర్లతో గతంలో పోలీసులకు సమాచారం ఇచ్చేవారు. ప్రస్తుతం ఇతర మండలాల్లో పోలీసులకు సమాచారం అందిస్తున్నారు. అయితే ఇక్కడ మాత్రం వే బిల్లులు మంజూరు చేసే సమయంలో పోలీసులకు ఎలాంటి సమాచారం ఇవ్వడం లేదు.

ఇలా చేయాలి.. ఇసుక అవసరం ఉన్న వారు సంబంధిత అధికారి ధ్రువీకరణతో రెవెన్యూ కార్యాలయంలో దరఖాస్తు చేసుకొని చలానా చెల్లించాల్సి ఉంటుంది. ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టరు నంబరు, ఎక్కడికి రవాణా చేస్తున్నారో తెలపాలి. అయితే ఇక్కడ ఇసుక అవసరం ఉన్న వారి కంటే అధికంగా ట్రాక్టరు యజమానులే వారికి సంబంధించిన పేర్లతో చలానాలు కట్టి వే బిల్లులు పొందుతున్నారు. వాగు వద్ద రెవెన్యూ కార్యాలయానికి చెందిన ఓ అధికారి విధుల్లో ఉండి వే బిల్లులు జారీ చేస్తున్నారు. అయితే సదరు అధికారి చూసీచూడనట్లు వ్యవహరించడంతో ఒకే వే బిల్లుపై నాలుగు ట్రిప్పులు రవాణా చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. దీంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతుంది.

నిబంధనలు పాటించాలి- నారాయణరెడ్డి, తహసీల్దారు

ఇసుక రవాణా విషయంలో నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి. ఈ రోజే బాధ్యతలు స్వీకరించడం వల్ల రెండు రోజులు క్రితం జారీ చేసిన వే బిల్లుల విషయం నాకు తెలియదు. అక్రమ రవాణా చేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటాం.

## సన్నాల కొనుగోళ్లలో సాంకేతికత

రాజపేట : ఉమ్మడి నల్గొండ జిల్లా వ్యాప్తంగా దశలవారీగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభమవుతున్నాయి. ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా గతంలో కంటే భిన్నంగా రాష్ట్ర సర్కారు ఈ సారి సన్నరకం ధాన్యానికి రూ.500 బోనస్ ప్రకటించింది. ఇందుకు ప్రత్యేక కేంద్రాలను ప్రారంభించడమే కాకుండా సాంకేతికత ఆధారంగా ధాన్యం కొనుగోళ్లకు చర్యలు తీసుకుంటోంది. ఈ విషయమై ఇప్పటికే సంబంధిత కేంద్రాలకు ఆయా సాంకేతిక పరికరాలు వచ్చిచేరాయి. వీటి ద్వారా సన్నరకం ధాన్యం తేమ, తాలు, గింజల పరిమాణం తదితర అంశాలను సులువుగా తెలుసుకునే వీలు కలుగుతుంది.

గింజలు తీయడానికి 'ప్యాడి హస్కల్'..

శాఖాపరంగా ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రానికి రెండు ప్యాడి హస్కల్ యంత్రాలను అందజేయనున్నారు. గుప్పెడు వడ్లు తీసుకుని ఈ యంత్రంతో పోసి తిప్పితే పొట్టు ఊడిపోయి బియ్యం గింజలు బయటకు వస్తాయి. ఈవిధంగా బయటకు వచ్చిన బియ్యం గింజలను గ్రెయిన్ కాలిపర్ యంత్రంలో పోసి సన్నరకం బియ్యం అవునో.. కాదో.. తెలుసుకునే వీలు కలుగుతుంది.

'గ్రెయిన్ కాలిపర్'తో గుర్తింపు..

సన్నధాన్యం గుర్తించేందుకు ప్రతి కొనుగోలు కేంద్రానికి గ్రెయిన్ కాలిపర్ (డయల్ మైక్రో మీటర్) యంత్రం అందజేస్తున్నారు. ఈ యంత్రం సాయంతో సన్నబియ్యం గింజ పొడవు, వెడల్పు కొలుస్తారు. పొడవు 6 మిల్లీమీటర్ల కంటే తక్కువ, వెడల్పు 2 మి.మీ కంటే తక్కువ ఉండాలని ప్రమాణాలు నిర్దేశించారు. ఈ యంత్రం వినియోగంపై కేంద్రాల నిర్వాహకులకు ఇప్పటికే అవగాహన కల్పించినట్లుగా సంబంధిత అధికారవర్గాలు వెల్లడించాయి.

**సంచులపై కోడ్..**

ధాన్యం సంచులపై కొనుగోలు కేంద్రం కోడ్, ధాన్యం రకం వివరాలు నమోదు చేస్తారు. సన్న రకమైతే ఎరుపు రంగుతో కొనుగోలు కేంద్రం నంబరు, ధాన్యం రకం వద్ద 'ఎస్' అని రాస్తారు. దొడ్డు రకం సంచులపై ఆకుపచ్చ రంగుతో కొనుగోలు కేంద్రం నెంబరు, ధాన్యం రకం వద్ద 'డీ' అని రాస్తారు. సన్న రకాన్ని సంబంధిత ఏఈవోలు ధ్రువీకరించాల్సి ఉంటుంది.

**సంబంధిత రైతుల ఐరిస్..**

రైతుల నుంచి దళారులు తక్కువ ధరకు ధాన్యాన్ని కొని, వాటిని కొనుగోలు కేంద్రాల్లో భారీగా విక్రయిస్తుంటారు. దీన్ని నిలువరించేందుకు ప్రభుత్వం ఐరిస్ విధానం అందుబాటులోకి తెచ్చింది. ఇదివరకు కేంద్రానికి వచ్చే వారి వివరాలను నిర్వాహకులు నమోదు చేసి, చరవాణికి ఓటీపీ పంపించేవారు. ధాన్యం విక్రయ సమయంలో మరోసారి ఓటీపీ పంపి ట్రక్‌షీట్‌ను కేటాయించిన మిల్లులకు పంపేవారు. ఈసారి ముందుగా రైతు వివరాలు నమోదు చేసుకుని ఓటీపీ పంపి, విక్రయ సమయంలో సంబంధిత రైతు ఐరిస్ తీసుకోనున్నారు.

# జియాగూడ మండీ.. అధ్వానమండి

హైదరాబాద్ : ప్రపంచమంతా కాలానికి తగ్గట్టుగా పరిశుభ్రత, నాణ్యత వైపు నడుస్తోంది. జియాగూడ కబేళా మాత్రం అపరిశుభ్రత వైపు పరుగు తీస్తోంది. ఏటికేడు కబేళాలోని పరిస్థితులు దారుణంగా దిగజారుతున్నాయి. ఒకప్పుడు పొడి వాతావరణంలో నేలపై మేకలు, గొర్రెలు, పొట్టేళ్లను వధించేవారు. వెదురు తడికెలపై మాంసాన్ని ముక్కలు చేసి సంచుల్లోకి ఎత్తేవారు. ఇప్పుడు రక్తపు మడుగులో, బురద పరుపుపై తతంగాన్ని నడిపిస్తున్నారు. చెప్పడానికి కూడా వీల్లేని వాతావరణంలో కళేబరాలను మాంసపు ముక్కలుగా మార్చుతున్నారు. చెంగిచెర్లలో ఆధునిక కబేళా నిర్మాణమైనప్పటికీ.. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో అక్కడి పరిస్థితి కూడా దిగజారింది. దాంతో నగరంలో మాంసం ఉత్పత్తి ప్రమాణాలు పడిపో యినట్లనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

జియాగూడ కబేళాను ఆధునికీకరించేందుకు జీహెచ్ఎంసీ కొన్నేళ్లుగా ప్రయత్నం చేస్తోంది. పీపీపీ పద్ధతిలో చేపట్టే ప్రాజెక్టుకు స్థానికులు అంగీకరించలేదు. దాంతో సొంతంగా జీహెచ్ఎంసీ నిధులతో ఆధునిక



జంతు వధశాలను నిర్మించాలని సర్కారుకు ప్రతిపాదన పంపించాం. ప్రభుత్వం అనుమతి ఇస్తే పనులు చేపడతాం” అని బల్దియా ఇంజినీరింగ్ విభాగం తెలిపింది. అశాస్త్రీయ వధతో ప్రజారోగ్యం దెబ్బతినదా? అనే ప్రశ్నకు పశువైద్య విభాగం జవాబు ఇవ్వలేదు. నెల మామూళ్లు తీసుకుంటూ, అటువైపు కన్నెత్తి కూడా చూడట్లేదని విమర్శలొస్తున్నాయి.పలు చోట్ల నుంచి..జియాగూడ కబేళాకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక, ఉత్తరప్రదేశ్, హరియాణా, గుజరాత్, తమిళనాడు, కశ్మీర్ రాష్ట్రాలతోపాటు పాకిస్థాన్ నుంచి కూడా మేకలు, గొర్రెలు వేలాదిగా వస్తుంటాయి.

కాలుష్య కోరల్లో మూసీ..ప్రతినెలా జియాగూడ, చెంగిచెర్ల, తదితర కబేళాల్లో టన్నుల కొద్దీ జంతు వ్యర్థాలు ఉత్పత్తి అవుతుంటాయి. వాటిని శాస్త్రీయ పద్ధతిలో భస్మం చేయాలి. లేదా వేర్వేరు విధానాల్లో కోళ్లు, చేపల ఆహారంగా మార్చవచ్చు. జియాగూడ జంతు వ్యర్థాలు రీసైక్లింగ్ కేంద్రాలకు వెళ్లట్లేదు. కార్మికులు వాటిని ఊడ్చి పక్కనున్న మూసీ నదిలో పడేస్తున్నారు.

# కాలుష్య పరిశ్రమలపై పీసీబీ కొరడా

హైదరాబాద్: రాజధానిలో కాలుష్య కారక పరిశ్రమలను మూసివేయాలని పీసీబీ (కాలుష్య నియంత్రణ మండలి) ఆదేశించింది. అనుమతులు లేకుండా నిర్వహిస్తూ, విపరీతమైన వాయు, శబ్దకాలుష్యానికి కారణమవుతున్న భాస్కర్ పాలిమర్స్, ఎస్ఎస్ఎం రాజ్ పాలిమర్స్ సంస్థలపై చర్యలు చేపట్టింది. స్థానికులు, స్వచ్ఛంద సంస్థల నుంచి వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా ఆయా పరిశ్రమల్లో పీసీబీ టాస్క్‌ఫోర్స్ బృందం తనిఖీలు నిర్వహించి నివేదిక ఇచ్చింది. దీని ఆధారంగా పీసీబీ చర్యలకు ఉపక్రమించింది.

అనుమతుల్లేకుండా గుట్టుగా నిర్వహణ..అనుమతులు లేకుండా కార్వాన్‌లో నడుపుతున్న భాస్కర్ పాలిమర్స్‌కు 2019 మే నెలలోనే కాలుష్య నియంత్రణ మండలి మూసివేత ఆదేశాలిచ్చింది. అనంతరం ఆ పరిశ్రమ నిర్వాహకులు జులైలో అనుమతులు తీసుకున్నారు. ఆ అనుమతులకు 2022 డిసెంబరు వరకే గడువు ఉండగా అనంతరం కన్‌సెంట్ ఫర్ ఆపరేషన్ (సీఎఫ్‌వో) అనుమతులు తీసుకోలేదు. గుట్టుగా కార్యకలాపాలు నిర్వహిస్తూ ప్రతిరోజూ 495 కేజీల ఎల్‌డీపీఈ బ్యాగ్‌లను (ప్లాస్టిక్ కవర్ బ్యాగ్‌లు) ఉత్పత్తి చేస్తోంది. విపరీతమైన శబ్ద, వాయు కాలుష్యం నమోదవుతోందంటూ స్థానికుల నుంచి పీసీబీకి ఫిర్యాదులు అందడంతో పీసీబీ టాస్క్‌ఫోర్స్ బృందం అధికారులు



కార్వాన్‌లోని పరిశ్రమలో తనిఖీలు నిర్వహించారు. ఎయిర్ పొల్యూషన్ కంట్రోల్ ఎక్విప్‌మెంట్ (ఏపీసీఈ) ఎక్కడా ఏర్పాటు చేయలేదని తనిఖీల్లో అధికారులు గుర్తించారు. పైగా ప్లాస్టిక్ రీసైక్లింగ్‌కు సంబంధించిన రిజిస్ట్రేషన్ చేయించుకోలేదని నివేదికలో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో పరిశ్రమకు తక్షణమే విద్యుత్తు సరఫరాను నిలిపివేయాలని టీఎస్ఎస్పీడీసీఎల్‌కు పీసీబీ లేఖ రాసింది. ఆదేశాలకు విరుద్ధంగా పరిశ్రమను నడిపితే చట్ట ప్రకారం చర్యలుంటాయని హెచ్చరించింది.

ఎస్ఎస్ఎం రాజ్ పాలిమర్స్ మూసివేత ఎస్ఎస్ఎం రాజ్‌పాలిమర్స్ మూసివేతకు పీసీబీ ఆదేశాలిచ్చింది. అనుమతులు లేనిచోట కాలుష్యమయం చేశారంటూ పీసీబీ టాస్క్‌ఫోర్స్ బృందం నివేదిక ఇచ్చింది. హానికర వ్యర్థాలు, దహనం కాని కార్బన్ నిత్యం 50 కేజీల మేర ఉత్పత్తి అవుతోందని, వాయు కాలుష్య నియంత్రణ పరికరాల ఏర్పాటు చేయలేదని పేర్కొంది. పరిశ్రమల్లో యంత్రాలు పాడైపోవడంతో కాలుష్యం పెరగడంతో మూసివేయాలంది.

# వ్యాధి నిర్ధారణే ‘పరీక్ష’



హైదరాబాద్ : బస్తీ దవాఖానాల్లో రోగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నప్పటికీ.. చాలాచోట్ల ఆ రిపోర్టులు రోగుల సెల్ నంబరుకు చేరడం లేదు. రెండు, మూడు రోజులు దాటినా సరే.. నివేదికలు రాకపోవటంతో రోగులకు తిరిగి బస్తీ దవాఖానాలకు వచ్చి ఆరా తీస్తున్నారు. అక్కడ సిబ్బందిని ప్రశ్నిస్తే.. తమ కంప్యూటర్‌లో నివేదికలు చూపించి ఫొటోలు తీసుకోవాలని చెబుతున్నారని వాపోతున్నారు.

గ్రేటర్ వ్యాప్తంగా 250 వరకు బస్తీ దవాఖానాలు ఉన్నాయి. నిత్యం తొమ్మిది వేల పైనే ఇక్కడ ఓపీ ఉంటోంది. పట్టణ ఆరోగ్య కేంద్రాలకు మరో ఎనిమిది వేల మంది చికిత్సల కోసం వస్తున్నారు.

గ్రేటర్ వ్యాప్తంగా నిత్యం పట్టణ ఆరోగ్య కేంద్రాల నుంచి 1441, బస్తీ దవాఖానాల నుంచి మరో 1087 రకాల ఆరోగ్య పరీక్షలకు సంబంధించి శాంపిళ్లను సేకరించి తెలంగాణ డయాగ్నోస్టిక్ హబ్‌కు పంపుతున్నారు. గతంలో శాంపిళ్లు సేకరించి సెంట్రల్ ల్యాబ్‌కు పంపిన 24 గంటల లోపు రోగుల సెల్‌ఫోన్‌కు నివేదికలు అందేవి. ప్రస్తుతం చాలా కేంద్రాల్లో తమ సెల్‌ఫోన్లకు సమాచారం అందడం లేదని రోగులు వాపోతున్నారు. రెండు, మూడు రోజుల పాటు చూసిన తర్వాత ఆయా కేంద్రాలకు వస్తున్నాయి.

**చికిత్సపై ప్రభావం**

అవసరమైన వారి నుంచి శాంపిళ్లు సేకరించి ల్యాబ్‌కు పంపుతుంటారు. నివేదికలు సెల్‌ఫోన్‌కు అందిన తర్వాత తిరిగి వైద్యులను సంప్రదిస్తుంటారు. ల్యాబ్‌ల నుంచి నివేదికలు రాకపోవడంతో చికిత్సలో జాప్యం జరుగుతోంది. ఇంతలో రోగం ముదిరిపోయి ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్తున్నారు. వనస్థలిపురం పరిధిలోని బస్తీ దవాఖానాల్లో చాలా రోజుల నుంచి రోగుల సెల్‌ఫోన్‌కు నివేదికలు రావడం లేదని రోగులు చెబుతున్నారు. ఎల్‌బీనగర్, నగరంలోని చాలా ప్రాంతాల్లో ఇదే తీరు ఉంది. డెంగీ లాంటి జ్వరం నిర్ధారణ అయి న వెంటనే చికిత్స అందించకపోతే కొన్నిసార్లు ప్లేట్‌లెట్లు తగ్గిపోయి రోగుల పరిస్థితి ప్రమాదకరంగా మారే ఆస్కారం ఉంది.

**టెక్నీషియన్ల కొరత..**

కొన్ని కేంద్రాల్లో టెక్నీషియన్లు అందుబాటులో ఉండటం లేదు. రెండు, మూడు కేంద్రాలకు ఒక్కరే ఇన్‌ఛార్జి కావడంతో ఒక్కో కేంద్రాన్ని తిరిగి శాంపిళ్లు తీసుకోవాల్సి వస్తోంది. కొన్నిసార్లు వైద్యులు, ల్యాబ్ టెక్నీషియన్ రాకపోవడంతో పరీక్షలు జరగడం లేదు. ఎప్పటికప్పుడు ఆయా కేంద్రాలపై పర్యవేక్షణ లేకపోవడం తో సరైన చికిత్స అందడం లేదని రోగులు అంటున్నారు. నగర వ్యాప్తంగా శాంపిళ్లు తీసి నారాయణగూడలోని డయాగ్నోస్టిక్ హబ్‌కు తరలించేసరికి సాయంత్రం అవుతోంది. దీంతో రోగులకు నివేదికలు అందడంలో జాప్యం చోటుచేసుకుంటోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టిసారించాలని రోగులు కోరుతున్నారు.

**శాంపిళ్ల సేకరణలోనూ జాప్యం**

చాలా దవాఖానాల్లో రక్త శాంపిళ్ల సేకరణలో జాప్యం జరుగుతోంది. రాజేంద్రనగర్ పరిధిలోని పలు బస్తీ దవాఖానాలకు ఉదయం 11 తర్వాతే సిబ్బంది వస్తున్నారు. మిగతా చోట్ల కూడా దీనికి భిన్నంగా లేదు. రోగులను చూసి టెస్టులు రాసే సరికి మధ్యాహ్నం దాటుతోంది. షుగర్, బీపీ, కొలెస్ట్రాల్, థైరాయిడ్ లాంటి పరీక్షలకు ఆహారం తీసుకోకుండా వస్తుంటారు. 11 గంటలవుతున్నా శాంపిళ్ల సేకరణ లేక వృద్ధులు, మహిళలు ఇబ్బంది పడుతున్నారు. కొన్నిసార్లు నిరీక్షించలేక వెనుదిరుగుతున్నారు..

# మూసీ పునరుజ్జీవం ముందు కొంతే.. ఆ తరవాతే పూర్తి



హైదరాబాద్ : మూసీ పునరుజ్జీవం కోసం రాష్ట్ర ప్రభుత్వం సరికొత్త ప్రణాళికను అమలు చేయాలని తాజాగా నిర్ణయించింది. ఒకేసారి ఈ పెద్ద ప్రాజెక్టు నిర్మాణాన్ని మొదలపెడితే అనేక సమస్యలు ఎదురవుతాయన్న ఉద్దేశంతో మొదటిదశలో 2.5 కి.మీ.ల మేర పునరుజ్జీవం పోయాలని సీఎం రేవంత్‌రెడ్డి భావిస్తున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. పూర్తిస్థాయి సుందరీకరణను ప్రజలకు చూపించిన తరువాతే మిగిలిన ప్రాజెక్టును చేపట్టాలని అనుకుంటున్నారు. దీనికి అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. ముందుకు ఇలా..నగర పరిధిలో నార్సింగి నుంచి నాగోలు వరకు ఉన్న 55 కి.మీ.ల మూసీ సుందరీకరణతోపాటు ఇతర పునరుజ్జీవ చర్యల కోసం రూ.50 వేల కోట్లు ఖర్చవుతుందని అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు.

మూసీ గర్భంలో 1600 ఇళ్లలో ఉంటున్న వారిని తరలించాలి. బఫర్‌జోన్‌లోని 13 వేల మంది నిర్వాసితులను తరలించడం అంత సులభం కాదు. దీంతో ముందుగా కొంతభాగం అభివృద్ధి చేయాలనే నిర్ణయానికి సీఎం వచ్చారు.

నార్సింగి నుంచి బాపూఘాట్ వరకు నది వెంట పెద్దగా నిర్మాణాలు లేవు. ఇక్కడ సుందరీకరణ పనులు చేపట్టవచ్చని అధికారులు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ఆయన కూడా పరిశీలించినట్లు తెలిసింది. నార్సింగి నుంచి బాహ్యవలయ రహదారి (ఓఆర్ఆర్) వరకు 2.5 కి.మీ.ల మూసీ పరిధిలో నిర్మాణాలు లేవు. ఇక్కడ పనులు చేయొచ్చనే నిర్ణయానికి ప్రభుత్వం వచ్చింది.

రెండ్రోజుల కిందట సీఎం రేవంత్‌రెడ్డి గచ్చిబౌలి ప్రాంతంలో ఒక కార్యక్రమంలో పాల్గొన్న తరువాత దీనిపై రంగారెడ్డి జిల్లా అధికారి ఒకరితో మాట్లాడినట్లు తెలిసింది. ‘మీ జిల్లా పరిధిలో మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టును ప్రయోగాత్మకంగా మొదలుపెడదాం.. సిద్ధంగా ఉండండి’ అన్నట్లు సమాచారం.

నివేదిక ఆధారం..మూసీ పూర్తిస్థాయి నివేదికను తయారు చేసే పనిని సలహాదారు సంస్థకు ఇప్పటికే అప్పగించింది. మూడు నెలల్లో ప్రాథమిక నివేదికను ఇవ్వాలని ఈ సంస్థను ప్రభుత్వం కోరింది. ఇందులో 2.5 కి.మీ.ల మూసీ సుందరీకరణ ప్రాజెక్టు కూడా ఉండనుందని చెబుతున్నారు. దీని ఆధారంగా ప్రభుత్వమే ఈ ప్రయోగాత్మక ప్రాజెక్టును మొదలుపెడతారని తెలిసింది. పునరుజ్జీవంలో అనేక సవాళ్లు ఎదురవుతాయని నిపుణులు చెబుతున్నారు. కొన్నిచోట్ల నదిలో పెద్ద పెద్ద బండరాళ్లు ఉండగా.. మరికొన్నిచోట్ల లక్షల టన్నుల డంపింగ్‌తో నిండిపోయింది. వీటన్నింటిని తొలగించడం కత్తిమీద సామేనని అంటున్నారు. ప్రయోగాత్మక ప్రాజెక్టుతో వీటన్నింటికీ సమాధానం లభిస్తుందని చెబుతున్నారు.

# పైసా రాదు.. పనులు సాగవు!



హుజూరాబాద్ : హుజూరాబాద్, జమ్మికుంట పురపాలికల్లో సమీకృత మార్కెట్ల నిర్మాణంపై నీలినీడలు కమ్ముకున్నాయి. రెండున్నరేళ్లుగా ప్రభుత్వం పైసా విడుదల చేయకపోవడంతో ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయి. నిధుల విడుదలకు అనేకసార్లు ఉన్నతాధికారులకు మొరపెట్టుకున్నా ఫలితం లేకపోవడంతో తన వల్ల కాదంటూ గుత్తేదారు చేతులెత్తేశాడు. దీంతో అమ్మకందారులు, వినియోగదారులు రోడ్లపై, మైదానాల్లో క్రయావిక్రయాలు జరుపుతున్నారు. ఎండకు.. వానకు ఇబ్బందులు ఎదుర్కొవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ప్రభుత్వం దృష్టి సారిస్తేనే..సమీకృత మార్కెట్ల నిర్మాణాలపై ప్రభుత్వం దృష్టి సారిస్తే తప్ప పనులు ముందుకు సాగేలా లేవు. రాష్ట్ర వ్యాప్తంగా సమీకృత మార్కెట్లు, వైకుంఠదామాల నిర్మాణ పనులు చేపట్టిన గుత్తేదారులంతా కలిసి అయిదు నెలల క్రితం బిల్లులు విడుదల చేయాల్సిందిగా సీడీఎంఏను కలిసి విన్నవించారు. పెండింగ్ బిల్లులు చెల్లించాలని ఆయన పురపాలక ముఖ్య కార్యదర్శికి లేఖ రాసినట్లు సమాచారం. అయితే లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో నిధులు విడుదల చేయలేదు. ప్రస్తుతం ఎన్నికలు ముగిసి అయిదు నెలలు గడిచినా విడుదల చేయకపోవడంతో గుత్తేదారులు నిర్మాణ పనులను నిలిపివేశారు. ఈ విషయంపై హుజూరాబాద్ మున్సిపల్ ఇంజినీర్ సాంబరాజును సంప్రదించగా నిధుల విడుదలలో జాప్యం వల్లే పనులు పూర్తి కాలేదన్నారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు.రెండున్నరేళ్లుగా..తెలంగాణ పట్టణ ఆర్థిక, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ, పట్టణ ప్రగతి ప్రత్యేక నిధులతో కూరగాయలు, మాంసం, పూలు, పండ్లు వంటివి ఒకే చోట విక్రయించటానికి వేర్వేరు భవనాలు నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. మే 14న 2022లో హుజూరాబాద్ పురపాలికలో రూ.4.50 కోట్ల అంచనా వ్యయంతో సమీకృత మార్కెట్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. విక్రయదారులు, కొనుగోలుదారులు వాహనాలు నిలిపే ప్రదేశం, సరకులు దించడానికి, ఎత్తడానికి వేదిక, మూత్రశాలలు, మరుగుదొడ్లు, మార్కెట్ నిర్వహణ, పర్యవేక్షణ కార్యాలయం, విద్యుత్తు దీపాలు, ప్రహరీ చుట్టూ మొక్కలు పెంపకం తదితర సౌకర్యాలతో భవనం నిర్మించాలనుకున్నారు. హుజూరాబాద్‌లో 108 మడిగెలకు రెండంతస్తుల వరకు నిర్మించి స్లాబ్ వేశారు. సివిల్ పనులతో పాటు విద్యుత్తు, నీటి సరఫరా, ఫ్లోరింగ్, ప్రవేశ ద్వారాలు, పార్కింగ్, మరుగుదొడ్లు పనులు చేయాల్సి ఉండగా అదనంగా మరో రూ.4.75 కోట్లు కేటాయించాలని ప్రతిపాదనలు పంపించగా ప్రభుత్వం కూడా అనుమతిచ్చింది. మొదట ప్రతిపాదించిన రూ.4.50 కోట్లకు గాను రూ.4 కోట్ల మేర 60 శాతం పనులను గుత్తేదారు పూర్తి చేశారు. జమ్మికుంటలో రూ.3 కోట్ల అంచనా వ్యయంతో 2021 జులైలో హడావుడిగా సమీకృత మార్కెట్ నిర్మాణాన్ని ప్రారంభించారు. స్లాబ్ వరకు నిర్మించి ఆపివేశారు. ఈ రెండు మార్కెట్ల నిర్మాణాలను ఒకే గుత్తేదారు చేపడుతుండగా.. రెండున్నరేళ్లుగా ప్రభుత్వం ఒక్కపైసా విడుదల చేయకపోవడంతో గుత్తేదారు చేతులెత్తేశాడు. ఇప్పటికే అప్పులు చేసి పనులు చేశానని, ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోతే తన పరిస్థితి ఏమిటని? గుత్తేదారు వాపోయాడు. అధికారులు కూడా ఏమీ చేయలేని నిస్సహా స్థితిలో ఉన్నారు.

# జలమండలిలో మేనేజర్లేరీ?

హైదరాబాద్ : జలమండలిలో క్షేత్రస్థాయిలో కీలకమైన మేనేజర్ల పోస్టులు భారీగా ఖాళీగా ఉండటంతో ఆ ప్రభావం తాగునీటి సరఫరా, మురుగు నీటి నిర్వహణపై పడుతోంది. ప్రస్తుతం జలమండలి సేవలు అవుటర్ రింగ్ రోడ్డు వరకు దాదాపు 1,450 చదరపు కిలోమీటర్ల మేర విస్తరించాయి. 80 లక్షల జనాభా దాటిన మహానగరంలో నిత్యం తాగునీటి సరఫరా, మురుగు నీటి పారుదల పెద్ద సవాలే. స్థానిక సమస్యల పరిష్కారంలో, కొత్త నల్లాల మంజూరులో మేనేజర్ల పాత్ర కీలకం. అయితే.. జలమండలి పరిధి పెరుగుతున్నా సరిపడా మేనేజర్లు అందుబాటులో లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రస్తుతం 320 పోస్టులకు గాను...186 మంది మాత్రమే ఉన్నారు. దీంతో రెండు, మూడు సెక్షన్లకు ఒక్కరే ఇన్‌ఛార్జిగా కొనసాగుతున్నారు. మరికొందరి సిబ్బందిని సీనియారిటీ ప్రాతిపదికన ఎఫ్ఏసీగా బాధ్యతలు అప్పగించి నడిపిస్తున్నారు. తగినంతమంది లేక క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ లోపిస్తోంది. అక్రమ మురుగు, నల్లా కనెక్షన్లు పెరిగిపోతున్నాయి. కిందిస్థాయిలోని పలువురు లైన్‌మేన్‌లతో ప్రైవేటు ప్లంబర్లు కుమ్మక్కై రాత్రికి రాత్రి అక్రమ నల్లాలు పెడుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. వాటిని ప్రధాన పైపులైన్లకు అనుసంధానించడంతో కొన్ని రోజులకు అక్కడ లీకేజీలు ఏర్పడుతున్నాయి. లీకేజీల ద్వారా మురుగు నీరు తాగునీటిలో కలిసి కలుషిత జలాలు సరఫరా



అవుతున్నాయి. అక్రమ నల్లాలతో బోర్డు ఆదాయానికి భారీగా గండి కొడుతున్నారు. గ్రేటర్ వ్యాప్తంగా 2–3 లక్షల అక్రమ నల్లాలు ఉన్నట్లు అంచనా.

కీలక ఫైనాన్స్ డైరెక్టర్ పోస్టు సైతం..

జలమండలిలో కీలక ఫైనాన్స్ డైరెక్టర్ పోస్టు సైతం నెలన్నరగా ఖాళీగా ఉంది. ఇటీవలే ఆ పోస్టులో ఉన్న వాసుదేవనాయుడు స్వచ్ఛంద పదవీ విరమణ చేశారు. ప్రస్తుతం ఎండీ ఆ బాధ్యతలు చూస్తున్నారు. ఇంజినీరింగ్ విభాగంలో 5 డైరెక్టర్ పోస్టులు, డైరెక్టర్ పర్సనల్ ఖాళీగా ఉన్నాయి. త్వరలో కొత్తగా 31 మురుగు శుద్ధి కేంద్రాలతోపాటు గోదావరి ఫేజ్–2 ప్రాజెక్టు పనులు ప్రారంభం కానున్నాయి. ప్రాజెక్టు విభాగంలో ఒకే డైరెక్టర్ ఉండటంతో ఇబ్బందులున్నాయి.

# ఇందిరా శక్తి.. మహిళా ఉన్నతి

కోరుట్ల : మహిళా సంఘాల సభ్యులు స్వయం ఉపాధి సాధించడంతోపాటు వ్యాపార రంగంలో రాణించి ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ప్రభుత్వం ‘ఇందిరా మహిళా శక్తి’ పథకం ప్రవేశపెట్టింది. జిల్లాలోని 18 మండలాల్లో మొత్తం 18 మండల మహిళా సమాఖ్య సంఘాలు ఉన్నాయి. ఇందులో మొత్తం 13,818 మహిళా సంఘాలున్నాయి. డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో మండల మహిళా సమాఖ్య ద్వారా ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. జగిత్యాల, కోరుట్ల, మల్యాలలో–2, మల్లాపూర్ ఇలా అయిదు మండల కేంద్రాల్లో ఇటీవల క్యాంటీన్లు ఏర్పాటు చేసి మహిళలు స్వయంగా నిర్వహిస్తున్నారు. దీనికితోడూ ఏడాది కిందట కలెక్టరేట్‌లో జిల్లా సమాఖ్య ఆధ్వర్యంలోనూ క్యాంటీన్‌ను ఏర్పాటు చేశారు. ఈక్యాంటీన్లలో నాణ్యమైన పిండి వంటకాలు, తినుబండారాలతోపాటు ఆహారం, టీ, అల్పాహారం, భోజనం ఇళ్లలో వినియోగించే పరికరాలు, జ్యూట్‌బ్యాగ్‌లు, ఫ్లోర్‌క్లీనర్లు, డోర్‌కర్టెన్లు, ఇతర వస్తువులను విక్రయిస్తూ లాభాలు ఆర్జిస్తున్నారు. వీటి ఏర్పాటు కోసం మండల మహిళా సమాఖ్య నుంచి నిధులు కేటాయించారు.

శుభకార్యాలకు సరఫరా



మహిళా శక్తి క్యాంటీన్‌లో టీ, కాఫీతోపాటు సంఘాల మహిళలు స్వయంగా తయారు చేసిన పిండి వంటకాలు, తినుబండారాలు, ఆహారం విక్రయిస్తున్నారు. ఆర్డర్లపై నాణ్యమైన పిండి వంటలు, అల్పాహారం, భోజనం ఇలా 10–15 రకాలను తయారు చేసి సరఫరా చేస్తున్నారు. కోరుట్లలోని మహిళా క్యాంటీన్‌లో గానుగ నూనెతో తయారు చేసిన నాణ్యమైన పచ్చళ్లు అమ్ముతున్నారు. మామిడి, ఉసిరి, నిమ్మకాయ, టమాట, అల్లం, కాకరకాయ, గరుగ్గాయ, గొంగూర, పుదీన, మటన్, చికెన్, చేపల పచ్చళ్ల తయారీ ప్రత్యేకత. శుభకార్యాలయాలకు ఆహారం సరఫరా చేస్తున్నారు.

స్వయం ఉపాధి– భారతి, ఉజ్వల మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు ఇందిరా మహిళా శక్తి ఆధ్వర్యంలో కోరుట్లలో క్యాటీన్‌ను ఏర్పాటు చేశాం. ఇక్కడ మహిళలు స్వయంగా తయారు చేసిన పండి వంటకాలు, తినుబండరాలు, పచ్చళ్లను, ఇళ్లలో వినియోగించే పరికరాలను విక్రయిస్తున్నాం. ఈ క్యాంటీన్ నిర్వహణ బాధ్యతను మహిళా సంఘాల సభ్యులం ముగ్గురు చూసుకుంటున్నాం. ఆర్డర్లపై సరఫరా చేస్తుండటంతో గిరాకీ బాగానే ఉంది. స్వయం ఉపాధి పొందుతున్నాం.

నాణ్యమైన తినుబండారాలు– శంకర్, ఏపీఎం

కోరుట్ల ఉజ్వల మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో మహిళా క్యాంటీన్‌ను ఏర్పాటు చేయించాం. ఇందులో మహిళలు నాణ్యమైన ఆయిల్, సరకులు వాడి పిండి వంటకాలు, తినుబండారాలు విక్రయిస్తున్నారు. మహిళల స్వయంగా తయారు చేసిన వాటిని క్యాంటీన్‌లో విక్రయించడంతో ఉపాధి లభిస్తుంది. ఇక్కడ తయారు చేసిన పచ్చళ్లను గల్ఫ్ దేశాలకు సైతం తీసుకెళ్తున్నారు.

# వంట నూనెలు భగభగ

వేములవాడ : కేంద్ర ప్రభుత్వం వంట నూనెలపై 20 శాతం సుంకం విధిస్తూ నిర్ణయం తీసుకోవడంతో విపణిలో ధరలు మండిపోయాయి. ఇప్పటికే నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటడంతో ఇబ్బందిపడుతున్న సామాన్యులు కేంద్ర నిర్ణయంతో మూలిగే నక్కపై తాటిపండు పడ్డ చందంగా మారింది. ఇదే అదనుగా భావించిన నూనె హోల్‌సేల్ వ్యాపారులు తమ దగ్గర ఉన్న నిల్వలను బ్లాక్ చేశారని ఆరోపణలున్నాయి. ఉదయం దుకాణాలను తెరిచి మధ్యాహ్నానికే మూసేయడమే ఇందుకు నిదర్శనం.

విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్న పొద్దుతిరుగుడు, పామాయిల్ నూనెలపై కేంద్రం సుంకం పెంచుతూ నిర్ణయం తీసుకొంది. ఇప్పటి వరకు బహిరంగ మార్కెట్‌లో లీటరుకు రూ.110 అమ్మిన పొద్దుతిరుగుడు పువ్వు నూనెను ఒక్కసారిగా రూ.140కు పెంచేశారు. రూ.90 ఉన్న పామాయిల్‌ను రూ.120కు పెంచి విక్రయించారు. ఇదే సమయంలో తగిన నిల్వలు లేవంటూ వినియోగదారులకు మొండిచెయ్యి చూపడంతో వారు ఎక్కువ ధరపెట్టి కొనుగోలు చేయాల్సి వచ్చింది.



ప్రజలపై భారం..

జిల్లా కేంద్రంలోని ప్రకాశంగంజ్ కేంద్రంగా నిత్యం పొద్దు తిరుగుడు పువ్వు 2000 కాటన్లు, పామాయిలు 3000 కాటన్లు, 500 గ్రాముల ప్యాకెట్లు 500 కాటన్లు, 15 కిలోల బరువున్న నూనె డబ్బాలు 1000 వరకు విక్రయిస్తారు. ఒక్కో కాటన్‌లో లీటర్ బరువున్న 16 ప్యాకెట్లు ఉంటాయి. ఈ లెక్కన ఒక్కో ప్యాకెట్‌పై రూ.30 పెంచినా.. పొద్దుతిరుగుడు నూనెపై రూ.9,60,000, పామాయిల్‌పై రూ.14,40,000 అదనపు భారం పడుతోంది.

కృత్రిమ కొరతను అరికట్టేది ఎవరు?సుంకం పెంచడంతోనే ధరలను పెంచుతున్న వ్యాపారులపై పర్యవేక్షణ చేసే అధికారం జిల్లాలో కరవైంది. గతంలో పౌరసరఫరాల శాఖాధికారు లు అత్యవసర సరకుల చట్టం కింద వ్యాపారులు అడ్డగోలుగా ధరలు పెంచకుండా నియంత్రించేవారు. దాని స్థానంలో స్వేచ్ఛ వాణిజ్యం రావడంతో వారిపై అజామాయిషి కరవైంది. వారి వద్ద ఉన్న నిల్వలను దాచి.. కృత్రిమ కొరత సృష్టిస్తున్నారు. కనీసం వారి వద్ద ఉన్న నిల్వలను పాత ధరల్లో విక్రయించేలా చూడాల్సిన బాధ్యత జిల్లా యంత్రాంగంపై ఉంది.

# అమ్ముకుంటూ.. సొమ్ము చేసుకుంటూ..

ఉట్నూరు :బియ్యం, ఇతర సరకుల సరఫరాలో గోనె సంచి కీలక పాత్ర పోషిస్తోంది. దీని విలువ రూ. 20 మాత్రమే. లక్షల సంచులను కలిపితే ధర రూ.లక్షల్లో ఉంటుంది. కొందరు వీటిని స్వాహా చేస్తున్నారు. వేలం వేసి విక్రయించాల్సి ఉన్నా.. అవేమీ పట్టించుకోకుండా ఇష్టమొచ్చినట్లుగా అమ్ముకుంటూ.. సొమ్ము చేసుకుంటున్నారు. ఐటీడీఏ పాఠశాలల్లో అవినీతికి తావిస్తున్న ఈ వ్యవహారంపై కథనం. సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ(ఐటీడీఏ) ఉట్నూరు ఆధ్వర్యంలో ఆదిలాబాద్, కుమురం భీం, మంచిర్యాల, నిర్మల్ జిల్లాల్లో మొత్తం 168 గిరిజన సంక్షేమ ఆశ్రమ, గురుకుల పాఠశాలలు, వసతి గృహాలు, పోస్టు మెట్రిక్ హాస్టళ్లు, కళాశాలలు ఉన్నాయి. వీటిలో 60 వేలకుపైగా విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. వారందరికీ గిరిజన సంక్షేమ శాఖ ఉచిత విద్యతోపాటు భోజన, వసతిని కల్పిస్తోంది.

ఇలా కాజేస్తూ..

ఐటీడీఏ విద్యాలయాల్లో చదివే విద్యార్థుల కోసం పౌర సరఫరాల విభాగం 76,428 క్వింటాళ్ల బియ్యాన్ని కేటాయిస్తోంది. వాటిని గిరిజన సహకార సంస్థ(జీసీసీ) విద్యా సంస్థలకు సరఫరా చేస్తోంది. బియ్యం సరఫరా కోసం ఉపయోగిస్తున్న గోనె సంచులను ఒక్క చోటకు చేర్చి సంవత్సరానికి ఒకసారి వేలం నిర్వహించి గోనె సంచులు విక్రయించి వచ్చిన డబ్బులను గన్నీ బ్యాగ్స్ అకౌంట్‌లో జమ చేయాల్సి ఉంది. గోనె సంచుల విక్రయంతో వచ్చిన ఆదాయాన్ని ఐటీడీఏ పాఠశాలల్లో కనీస సౌకర్యాల కల్పనకు ఉపయోగించాల్సి ఉంది. ఏటా రూ.లక్షలు డబ్బులు వస్తాయని తెలిసినా ఆ దిశగా చర్యలు కొరవడ్డాయి. అధికారుల ఉదాసీనత కారణంగా వేలం అటకెక్కింది. గన్నీ బ్యాగ్ అకౌంట్‌లో పాఠశాలల వసతి గృహ సంక్షేమాధికారులు(వార్డెన్లు) డబ్బులు జమ చేయడం విస్మరించారు. ఎవరికి వారే గోనె సంచులను విక్రయించుకుంటున్నారు.

ఆదాయానికి గండి

ఉమ్మడి జిల్లాలో గిరిజన సంక్షేమ శాఖ విద్యా సంస్థలకు కేటాయిస్తున్న 76,428 క్వింటాళ్ల బియ్యం కోసం 50 కిలోల సామర్థ్యం కలిగిన గోనె సంచులను ఉపయోగిస్తున్నారు. ఈ లెక్కన 1,52,856 గోనె సంచులను వినియోగిస్తున్నారు. మార్కెట్ విలువ ప్రకారం ఒక గోనె సంచి ధర రూ.20 పలుకుతోంది. వాటిని విక్రయిస్తే రూ.30,57,120 వరకు ఆదాయం వచ్చే అవకాశం ఉంది. ఒకవేళ కొంచెం ధర తగ్గించి అమ్మినా రూ.20 లక్షల వరకు ఆదాయం సమకూరే అవకాశం ఉంది. అధికారుల పర్యవేక్షణ లోపంతో వేలం నిర్వహించక గిరిజన సంక్షేమ శాఖ పాఠశాలల, హాస్టళ్లు రూ.లక్షల ఆదాయాన్ని కోల్పోతున్నాయి. సంచులను కొన్ని చోట్ల వార్డెన్లు, ఇంకొన్ని చోట్ల సిబ్బంది, మరికొన్ని చోట్ల కొందరు హెచ్‌ఎంలు తమకు తోచిన ధరలకు విక్రయించుకుంటూ.. డబ్బులు మాయం చేస్తున్నారు.

పరిశీలించి చర్యలు తీసుకుంటా

– ఖుష్బూగుప్తా, ఐటీడీఏ పీవో

ఈ విషయం ఇప్పటి వరకు నా దృష్టికి రాలేదు. తప్పకుండా వీటిని పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటాను.

# ఆహార శుద్ధి.. ఉపాధి వృద్ధి

నల్గొండ: ఉమ్మడి నల్గొండ జిల్లా వ్యాప్తంగా వరి, పత్తి పంటలే కాకుండా వేరుసెనగ, మిర్చి, కంది, మొక్కజొన్న లాంటి ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసే విధంగా రైతులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఇందులో భాగంగా అన్నదాతల ఆదాయం రెట్టింపు చేయడంతో పాటు మార్కెట్‌లో ధరలను బట్టి పంటల సాగుకు ప్రోత్సాహం, ఉపాధి కల్పనే లక్ష్యాలుగా పెద్ద ఎత్తున జిల్లాల్లో ఆహారశుద్ధి పరిశ్రమలను నెలకొల్పాలని నిర్ణయించింది. ఈ పరిశ్రమల బాధ్యతను స్వయం సహాయక సంఘాలకు అప్పగించాలని భావిస్తున్న సర్కారు...అందుకు అవసరమైన భూములను అన్వేషించాలని మూడు జిల్లాల అధికారులను ఆదేశించినట్లు తెలిసింది. తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక మౌలిక వసతుల అభివృద్ధి కార్పొరేషన్ (టీజీఐఐసీ) ఆధ్వర్యంలోనే ఈ క్రతువు కొనసాగనుంది. సుమారు 300 ఎకరాల నుంచి 400 ఎకరాల వరకు ఒకే చోట ఈ పరిశ్రమలను నెలకొల్పాలని అధికారులు భావిస్తున్నారు. అందుకోసం నల్గొండతో పాటు సూర్యాపేట, యాదాద్రి జిల్లాల్లో అంత పెద్ద మొత్తంలో ప్రభుత్వ భూములు ఎక్కడున్నాయో ఉన్నతాధికారులు రికార్డులు పరిశీలిస్తున్నట్లు తెలిసింది. తొలి దశలో 200 ఎకరాల వరకు భూములను సేకరించి పలు జాతీయ, అంతర్జాతీయ సంస్థలను ఆహ్వానించి పరిశ్రమలను ఏర్పాటు చేసి, అనంతరం దశల వారీగా వాటిని విస్తరించనున్నారు. ప్రకృతి వైపరీత్యాలతో పాటు అతివృష్టి, అనావృష్టిల వల్ల రైతులకు కలుగుతున్న నష్టాన్ని ఈ ఆహారశుద్ధి రంగం ద్వారా భర్తీ చేసేలా చర్యలు తీసుకోవాలని ఇప్పటికే ఉన్నతాధికారులు సంబంధిత వ్యవసాయ శాఖకు సూచించారు. దీంతో ఏఏ ప్రాంతంలో ఏ పరిశ్రమలను పెట్టాలనేది ఇప్పటికే క్షేత్రస్థాయిలో నిర్వహించిన సర్వేలతో నిర్ణయించారు. ఈ నెలాఖరులోగా భూముల అన్వేషణను ఓ కొలిక్కి తీసుకురావాలని భావిస్తున్నారు.నల్గొండలో బత్తాయి, సూర్యాపేటలో కూరగాయలు, యాదాద్రి జిల్లాలో పాడి ఉత్పత్తులు

స్థానిక పరిస్థితులు, పంటల సాగును బట్టి నల్గొండలో బత్తాయి, సూర్యాపేటలో కూరగాయలు, యాదాద్రిలో పాడి ఉత్పత్తులకు సంబంధించిన పరిశ్రమలను ఏర్పాటు చేస్తే రైతులతో పాటు పరిశ్రమల ఏర్పాటు బాధ్యత చూసే మహిళా స్వయం సహాయక సంఘాలకు మేలు కలుగుతుందని వ్యవసాయ, ఉద్యానశాఖలు ఇప్పటికే ప్రభుత్వానికి ఓ నివేదిక సమర్పించాయి. దీనిని బట్టి పరిశ్రమల ఏర్పాటుకు పలు ఆయా రంగాల్లో పేరుపొందిన సంస్థలను ఆహ్వానిస్తారు. మరోవైపు మహిళా సంఘాలకు సైతం మండల కేంద్రాల్లో శిక్షణ ఇచ్చి... పరిశ్రమల ఏర్పాటుకు వారే ముందుకు వస్తే అందుకు తగిన రుణ సదుపాయం బ్యాంకుల ద్వారా ప్రభుత్వమే కల్పించనుంది. ఒకప్పుడు రాష్ట్రంలోనే అత్యధికంగా సుమారు లక్షన్నర ఎకరాల్లో బత్తాయి తోటలను సాగు చేసిన రైతులు రానురానూ ఆ తోటల సాగుకు ఆసక్తి చూపడం లేదు. సాగునీటి సౌకర్యం రావడం, తోటలకు చీడపీడలు సోకడం, మార్కెటింగ్ ఇబ్బందులు, తదితర కారణాలతో ప్రస్తుతం అది 30 వేల ఎకరాలకు పడిపోయింది. పెట్టుబడీ ఎక్కువ పెడుతుండటం, గతంలో వచ్చిన లాభాలు ప్రస్తుతం రాకపోవడంతో అన్నదాతలు బత్తాయి తోటల సాగువైపు కాకుండా వరి సాగుకే మొగ్గు చూపుతున్నారు. దేవరకొండ లాంటి ఏజెన్సీ ప్రాంతాల్లోనూ గతంలో భారీగా సాగైన వేరుసెనగ ఇప్పుడు సగానికి సగం పడిపోతోంది. తుంగతుర్తి, నకిరేకల్, ఆలేరు లాంటి ప్రాంతాల్లో సాగయ్యే పెసర, మినుములు మునుగోడులో సాగయ్యే కందులు ఇప్పుడు కనుమరుగవుతున్నాయి.

# శునకం.. నియంత్రణ కనం



నల్గొండ : ఉమ్మడి నల్గొండ జిల్లాలోని పురపాలికల్లో కుక్కల సంతతి నియంత్రణ చర్యలపై అధికారులు దృష్టిసారించడం లేదు. దీంతో శునకాల సంతతి పెరిగి.. వీధుల్లో ఆహారాన్వేషణకు వెళ్తూ ఎదురుపడిన ఒంటరి మహిళలు, వృద్ధులు, చిన్నారులపై దాడులు చేస్తున్నాయి. ఓ వైపు శునకాల దాడులు పెరుగుతున్నా.. పాలకులు, అధికారులు మాత్రం జీవాల నియంత్రణ శస్త్రచికిత్సలు మాత్రం జరిపించడం లేదు.నార్కట్‌పల్లిలో పదిహేను రోజుల క్రితం పెంపుడు కుక్క ఓ వ్యక్తిపై దాడిచేసి ఎడమకాలిపై తీవ్రంగా కరిచింది. వీధి శునకాల్టే కాదు.. పెంపుడు శునకాలు కూడా ఇలా దాడులు చేస్తుండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

పురపాలికల్లో ఇదీ పరిస్థితి

సూర్యాపేట పురపాలికలోని కుక్కల సంతతి నియంత్రణ కేంద్రంలో శస్త్రచికిత్సలు చేస్తున్నారు. సూర్యాపేటలో 1624 కుక్కలుండగా వాటిలో 943 శునకాలను పట్టుకొని చికిత్స చేయించారు. జిల్లాలోని ఇతర పురపాలికల్లో కుక్కలను పట్టుకొని సూర్యాపేటకు తీసుకురావాల్సి ఉంది. ఒక్క శునకం చికిత్సకు రూ.2వేల వరకు ఖర్చు అవుతుండటం, రవాణా భారం ఇబ్బందిగా మారిందని పుర అధికారులు చెబుతున్నారు. భువనగిరిలోని కుక్కల నియంత్రణ కేంద్రం ఉంది. ఆలేరులో కలెక్టరేట్ ఆదేశాల మేరకు వారంలో ఓ సంస్థతో ఒప్పందం చేసుకోనున్నారు. యాదగిరిగుట్టలో ఓ సంస్థతో చేసుకున్న ఒప్పందం ప్రకారం చర్యలు చేపట్టనున్నట్లు పుర అధికారులు తెలిపారు.

నల్గొండలోని కేంద్రంలో ఇప్పటి వరకు 3000 శునకాలకు శస్త్రచికిత్సలు చేశారు. మిర్యాలగూడలో చికిత్స ప్రక్రియ ప్రారంభించలేదు. హాలియాలో శస్త్రచికిత్స చేయించేందుకు ఓ సంస్థతో ఒప్పందం చేసుకున్నారు. త్వరలో చర్యలు చేపట్టనున్నారు. చిట్యాలలో స్వతంత్ర యానియల్ వెల్ఫేర్ సొసైటీతో వారంలో ఎంవోయూ కుదుర్చుకునే అవకాశం ఉంది.

చర్యలు తీసుకుంటున్నాం

శ్రీనివాస్, పుర కమిషనర్, సూర్యాపేట: శునకాలు ఎక్కువగా ఉన్న వార్డుల్లో సిబ్బందితో పట్టించి జమునానగర్‌లోని నియంత్రణ కేంద్రంలో పశువైద్యాధికారితో చికిత్సలు చేయిస్తున్నాం.ఇప్పటి వరకు 943 కుక్కలకు చికిత్సలు చేయించాం. మళ్లీ వార్డుల్లోని శునకాలను పట్టించి కేంద్రానికి తరలిస్తాం.

గత జులై 26న సూర్యాపేటలోని శ్రీరాంనగర్ బ్రాహ్మణ కల్యాణ మండపం పరిధిలో బయటకు వెళ్లిన బాలుడిపై కుక్కలు దాడిచేసి ఎడమ చేయిని తీవ్రంగా గాయపరిచాయి.

# పల్లెపాలనకు అప్పులు!

కౌటాల : జిల్లాలోని ఓ మేజర్ గ్రామ పంచాయతీలో నాలుగు వేల పైచిలుకు జనాభా ఉంది. సర్పంచుల పదవీకాలం ముగిసిన తరువాత ఫిబ్రవరి 2వ తేదీ నుంచి అన్ని పంచాయతీల్లో ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతోంది. అప్పటి నుంచి ఇప్పటి వరకు గ్రామంలో మోటార్ల మరమ్మతులు, బ్లీచింగ్ కొనుగోలు, వీధి దీపాల ఏర్పాట్లు, గ్రామంలో చెత్త సేకరణ ఇలా.. వివిధ పనుల కోసం ఆరు నెలల వ్యవధిలో రూ.3 లక్షల పైచిలుకు ఖర్చయింది. ఈ మొత్తంలో ఒక్క రూపాయి కూడా ప్రభుత్వం నుంచి రాలేదు. పంచాయతీలో పనిచేసే పంచాయతీ కార్యదర్శి సొంతంగా సదరు మొత్తం అప్పుచేసి గ్రామంలో పనులు చేపట్టారు. ఇదీ జిల్లాలోని పంచాయతీ కార్యదర్శుల పరిస్థితి..దేశానికి పట్టుకొమ్మలు.. అన్న గాంధీజీ మాటలను ఆయా ప్రభుత్వాలు విస్మరిస్తున్నాయనే విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. ఏటా పంచాయతీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్థిక సంఘం, ఫైనాన్స్ కమిషన్ నుంచి నిధులు విడుదల చేస్తుంటాయి. దీంతోపాటు గ్రామాలే సొంతంగా ఇంటి పన్నులు, ఇతర వసూళ్లతో నిధులు సమకూర్చుకుంటుంటాయి. అయితే పెద్ద పంచాయతీల్లో ఒకరకంగా, చిన్నవాటిల్లో పూర్తిభిన్నంగా ఉంటుంటాయి. 500 జనాభా ఉన్న తండాలను గత ప్రభుత్వం పంచాయతీలుగా మార్చిన నేపథ్యంలో.. అవి నిధుల కోసం తండ్లాడుతున్నాయి. గతేడాది చివరలో జరిగిన శాసనసభ ఎన్నికల ముందునుంచే రాష్ట్ర నిధులు ఆగిపోవడం, కేంద్ర నిధులు కూడా వెనుకా ముందు వస్తుండటంతో.. పంచాయతీల్లో పాలకవర్గాలు చివరలో అత్యవసర పనులకు సర్పంచులు అప్పులు తెచ్చి మరీ పనులు చేపట్టారు. ఫిబ్రవరి 2వ తేదీతో సర్పంచుల పదవీకాలం ముగిసింది. దీంతో ప్రభుత్వం ప్రత్యేకాధికారుల పాలనను అమలులోకి తెచ్చింది. అధికారంలోకి వచ్చిన కొత్త ప్రభుత్వం ఇప్పటి వరకు పైసా నిధులు విడుదల చేయలేదు. గతంలో సర్పంచులు ఉండటంతో.. వారే అన్నీ చూసుకునే వారు. ప్రస్తుతం కార్యదర్శుల పైనే ఆ భారం పడింది.

జిల్లాలోని పలువురు పంచాయతీ కార్యదర్శులు పాలన నిర్వహించేందుకు అప్పుల ఊబిలో కూరుకుపోవాల్సిన పరిస్థితి నెలకొంది. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి నిధులు మంజూరు కాకపోవడంతో వారే సొంతంగా గ్రామాల్లోని ఆయా పనులకు డబ్బులు ఖర్చు చేస్తున్నారు. పంచాయతీల నిర్వహణ, మరమ్మతులు, ట్రాక్టర్ డీజిల్, బ్లీచింగ్, వీధి దీపాల ఏర్పాట్లు, తదితర వాటికి అప్పులు చేసి కొనసాగిస్తున్నారు. దీంతో కార్యదర్శులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

రూ.15 కోట్ల వరకు

జిల్లాలోని చిన్న గ్రామ పంచాయతీల్లో ఒక్కో పంచాయతీ కార్యదర్శి ఆరు నెలల వ్యవధిలో రూ.50 వేల వరకు ఖర్చుచేయగా.. మేజర్ పంచాయతీలలో కార్యదర్శులు రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల పైచిలుకు అప్పులు చేసి పంచాయతీల పనులకు ఖర్చుచేశారు. మొత్తంగా చూస్తే 335 పంచాయతీల్లో దాదాపుగా రూ.15 కోట్ల వరకు నిర్వహణకు ఖర్చు చేసినట్లు తెలుస్తోంది.

నిధుల కొరతపై నివేదించాం

భిక్షపతిగౌడ్, జిల్లా పంచాయతీ అధికారి

గ్రామ పంచాయతీలకు నిధుల కొరత ఉన్న మాట వాస్తవమే. అత్యవసర పరిస్థితుల్లో కార్యదర్శులే సొంతంగా డబ్బులు పెట్టుకోవాల్సిన పరిస్థితి ఉంది. ఈ విషయంపై జిల్లా యంత్రాంగానికి నివేదించాం. నిధులు మంజూరైతే ఇబ్బందులు తొలగుతాయి.

గ్రామ పంచాయతీలు – 335

పంచాయతీ కార్యదర్శులు – 240

ఔట్‌సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులు – 63

# మహిళా ఓటర్లే అధికం

ఆలేరు : స్థానిక సంస్థల ఎన్నికలకు ఓటరు ముసాయిదా జాబితా విడుదలైంది. జిల్లాలో మొత్తం 5,20,297 మంది ఓటర్లు ఉన్నారు. 17 మండలాలు ఉండగా 12 మండలాల్లో మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. జిల్లాలో 421 పంచాయతీలు ఉండగా కొత్తగా ఏర్పడిన ఏడు పంచాయతీలతో మొత్తం పంచాయతీల సంఖ్య 428కి చేరింది. ఇందులో 426 పంచాయతీలకు సంబంధించి ఓటరు జాబితా ముసాయిదాను శుక్రవారం జిల్లా పాలనాధికారి హన్మంతు కే.జెండగే విడుదల చేయగా.. మరో కొత్త పంచాయతీలుగా ఏర్పడిన గుర్జవానికుంట, ఇందిరానగర్ పంచాయతీలకు సంబంధించి సాంకేతిక కారణాలతో ముసాయిదా జాబితా విడుదల చేయలేదు. ఒకటి, రెండు రోజుల్లో ఈ రెండు పంచాయతీల ముసాయిదా జాబితాలను ప్రకటించడం జగుగుతుందని అధికారులు చెబుతున్నారు.

అయిదు మండలాల్లోజిల్లాలో మొత్తం 5,20,297 మంది ఓటర్లు ఉండగా.. పురుషులు 2,59,167, మహిళలు 2,61,127 మంది, ఇతరులు ముగ్గురు ఉన్నారు. ఆలేరు మండలంలో 442, అడ్డగూడూరులో 316, మోత్కూరు 141 భువనగిరి 460, బీబీనగర్ 229, బొమ్మలరామారం 182, వలిగొండ 202, యాదగిరిగుట్ట 213, చౌటుప్పల్ 262, మోటకొండూరు 34, రాజపేట 215, తుర్కపల్లి మండలంలో 203 చొప్పున మహిళా ఓటర్లు పురుష ఓటర్ల కన్నా అధికంగా ఉన్నారు. మిగతా రామన్నపేట, ఆత్మకూరు, పోచంపల్లి, గుండాల, నారాయణపురం మండలాల్లో మాత్రం పురుష ఓటర్లు అధికంగా ఉన్నారు.

# ఏటా ముంపు.. మిగిలిపోతున్న అప్పు

బెజ్జూరు : రైతులు కోటి ఆశలు పెట్టుకుని ఆరుగాలం కష్టపడి పంటలు సాగు చేస్తుండగా లాభాలు రాకపోగా ఏటా అప్పులే మిగులుతున్నాయి. బెజ్జూరు మండలం సోమిని, పాపన్‌పేట్, తలాయి, తిక్కపల్లి, మొగవెల్లి, తిక్కపల్లి, పాతసోమిని తదితర గ్రామాల సరిహద్దులోని సాగు చేసిన పంటలు ఏటా పెద్దవాగు, ప్రాణహిత నది ముంపునకు గురవుతున్నాయి. మహారాష్ట్ర ఎగువ ప్రాంతంలో ప్రాజెక్టుల గేట్లను ఎత్తడంతో ప్రాణహిత, పెద్దవాగు పొంగి ఆ వరదకు పంటలు నీట మునుగుతున్నాయి. జులైలో కురిసిన భారీ వర్షాలు, వరదలు, వాగులు, ఒర్రెలు పొంగడంతో వివిధ పంటలు నీట మునగ్గా పత్తి మాత్రం పూర్తిస్థాయిలో తుడుచుకుపోయింది. మరోసారి తాజాగా ప్రాణహిత తీరంలోని పంటలు నీటి మునిగాయి. దీంతో రైతులకు రూ.లక్షల చొప్పున నష్టం వాటిల్లింది. వ్యాపారుల నుంచి ఎరువులు, విత్తనాలు, క్రిమిసంహారక మందులు అరువు తీసుకొచ్చి వ్యవసాయానికి పెట్టుబడులు పెడితే.. ఏటా వరద పాలు కావడంతో అప్పులే మిగులుతున్నాయని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జులై, సెప్టెంబర్‌లో నష్టం..

ప్రాణహిత, పెద్దవాగు పరివాహక ప్రాంతంలో సాగు చేసిన పంటలకు తీవ్రస్థాయిలో నష్టం వాటిల్లింది. వానాకాలం ప్రారంభంలో సాగు చేసిన పత్తి జులైలో వచ్చిన వరదకు తుడిచిపెట్టుకుపోయింది. కనీసం



సాగు చేసుకుంటే ఖర్చులైనా చేతికి వస్తాయని ఆశతో మళ్లీ దుక్కిదున్ని విత్తనాలు విత్తి సాగు చేసుకోగా శుక్రవారం ఎగువ ప్రాంతంలో ప్రాజెక్టుల గేట్లు ఎత్తడంతో రెండోసారి వరదకు ప్రాణహిత తీరంలో పంటలు నీట మునిగాయి. జులైలో 1500ల ఎకరాల్లో నష్టపోయినట్లు అధికారులు అంచనా వేశారు. ఈ సారి 300 ఎకరాలకు పైగా వరదకు ముంపునకు గురైందని స్థానికులు అంచనా వేస్తున్నారు.

సర్వేలకే పరిమితం ఏటా ప్రాణహిత వరదకు పంటలు నష్టపోతున్నాయి. అధికారులు సర్వేలు చేసి అంచనాలు వేస్తున్నారే తప్ప పరిహారం ఇచ్చిన దాఖలాలు లేవు. వరద ముంచేయడంతో రైతులకు అప్పులే మిగులుతున్నాయి. అధికారులు స్పందించి పంటలకు నష్టపరిహారం చెల్లించి రైతాంగాన్ని ఆదుకోవాలి.

ఆత్రం సాయి, సోమిని అయిదు ఎకరాల్లో పత్తి పంట సాగు చేశా. జులైలో భారీ వరదలకు పత్తి మొక్కలపై బురద వేసింది. రూ.50 వేలకు పైగా నష్టం వాటిల్లింది. మళ్లీ దున్ని పత్తి పంటను సాగు చేశాం. వరద ముంచడంతో 2 ఎకరాల వరకు నష్టపోయా.

– గావుడు బిచ్చు, తలాయి

ప్రతిపాదనలు పంపించాం

ప్రాణహితనది, పెద్దవాగు పరీవాహకంలో నష్టపోయిన పంటలపై ప్రాథమిక అంచనాలు తయారు చేసి ప్రతిపాదనలు పంపించాం. త్వరలోనే నష్టపరిహారం మంజూరు అవుతంది.


– శ్రీనివాస్, జిల్లా వ్యవసాయాధికారి

రెండు సార్లు వరద ముంచింది

నాకున్న 5 ఎకరాల్లో పత్తి సాగు చేయగా జులైలో భారీ వర్షాలు, వరదల కారణంగా మొత్తం పంట నష్టపోయా. మళ్లీ దున్ని సాగు చేశాం. ఈసారి మహారాష్ట్రలో ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో మూడు ఎకరాలకు పంట నష్టం వాటిల్లింది. నష్ట పరిహారం చెల్లించి ఆదుకోవాలి. పోర్తేటి ప్రేమ్‌సాగర్, సోమిని

# సిరిపురానికి 'సౌర'భం

మధిర: మధిర మండలంలోని సిరిపురం గ్రామమంతా సౌర కాంతులు విరజిమ్మనున్నాయి. మధిర ఎమ్మెల్యే, ఉపముఖ్యమంత్రి, విద్యుత్తుశాఖ మంత్రి మల్లు భట్టివిక్రమార్క చొరవతో గ్రామానికి తొలి అవకాశం దక్కనుంది. ఈ మేరకు హైదరాబాద్‌లోని ఎస్పీడీసీఎల్ కార్యాలయంలో హరిత ఇంధన ఉత్పత్తి పెంపుదల వివిధ వర్గాలకు ఆదాయం సమకూర్చడంపై రెడ్కో, ఎస్పీడీసీఎల్ అధికారులతో భట్టి శుక్రవారం సమీక్ష నిర్వహించారు. రైతులకు పంటల ద్వారానే కాకుండా సోలార్ విద్యుత్తు నుంచి ఆదాయం సమకూరేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. రాష్ట్రంలో 22గ్రామాలను తొలిదశలో పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసుకుని రైతుల వ్యవసాయ పంపుసెట్లతోపాటు



అన్ని ఇళ్లకు సంపూర్ణంగా ప్రభుత్వ ఖర్చులతో సౌరవిద్యుత్తు ఫలకాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు మధిర నియోజకవర్గంలోని సిరిపురం గ్రామాన్ని ఎంపిక చేసింది.

విద్యుత్తు సంస్థ సర్వే పూర్తి

వారం రోజుల కిందట విద్యుత్తు సంస్థ అధికారులు సిరిపురం గ్రామంలో ఇంటింటికీ తిరిగి ఏడీఈ అనురాధ ఆధ్వర్యంలో సర్వే నిర్వహించారు. కిలో వాట్ సౌర విద్యుత్తు ఏర్పాటుకు అనువైన ఇళ్లను గుర్తించారు. ఇదే విధంగా 5కిలో వాట్ సౌరవిద్యుత్తు ఏర్పాటుకు అనువైన వ్యవసాయ కనెక్షన్లు సర్వే చేశారు. సర్వే నివేదికను వరంగల్‌లోని సీఎండీ కార్యాలయానికి పంపారు. ఇళ్లు, వ్యవసాయ మోటార్ల వద్ద తయారైన విద్యుత్తును గ్రిడ్‌కు అనుసంధానిస్తారు. అక్కడి నుంచి విద్యుత్తు సబ్‌స్టేషన్ల ద్వారా ఇళ్లకు, వ్యవసాయ మోటార్లకు బైడైరక్షన్ మీటర్లు అమర్చి విద్యుత్తు సరఫరా చేస్తారు. ఆరు నెలలకోసారి విద్యుత్తు రీడింగ్‌లను సరిచూసి తయారైన సౌరవిద్యుత్తు మిగులుబడి ఉంటే ఆ సొమ్మును సంబంధిత యజమాని బ్యాంకు ఖాతాలో జమచేస్తారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు సిరిపురంలో సర్వే నిర్వహించి నివేదికను పంపినట్లు ఏడీఈ అనురాధ తెలిపారు.



# హైదరాబాద్-విశాఖపట్టణం నాలుగు గంటల్లో

హైదరాబాద్ నుంచి విశాఖపట్టణం రైలులో వెళ్లాలంటే ఎన్ని గంటలు పడుతుంది.. కనీసం వందే భారత్‌లో వెళ్లినా 8 గంటలు పడుతుంది. ఎక్స్‌ప్రెస్, సూపర్ ఫాస్ట్ రైళ్లలో అయితే మరో మూడు నుంచి నాలుగు గంటలు అదనం. కానీ కేవలం నాలుగు గంటల్లోనే హైదరాబాద్ నుంచి విశాఖపట్టణ చేరుకోవచ్చు. దేశంలో సెమీ హైస్పీడ్ రైళ్లను ప్రవేశపెట్టేందుకు భారతీయ రైల్వే ప్రయత్నిస్తోంది. దీనికి సంబంధించి ఇప్పటికే కార్యచరణను ప్రారంభించిన నేపథ్యంలో తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాల మధ్య రైలు ప్రయాణ సమయాన్ని తగ్గించేందుకు ప్రణాళికను సిద్ధం చేసింది. శంషాబాద్-విశాఖపట్టణం (దువ్వాడ) వరకు సెమీ హైస్పీడ్ రైల్ కారిడార్ ఎలైన్‌మెంట్‌ను రైల్వే శాఖ ఖరారు చేసింది. సూర్యాపేట, విజయవాడ మీదుగా ఈ లైన్‌ను ప్రతిపాదించారు. దీనిలో భాగంగా విశాఖపట్టణం నుంచి విజయవాడ, సూర్యాపేట మీదుగా కర్నూలుకు మరో కారిడార్ నిర్మిస్తారు. ఈ రైల్వే కారిడార్ విశాఖపట్టణం నుంచి మొదలై సూర్యాపేట, నల్గొండ, కల్వకుర్తి, నాగర్‌కర్నూల్ మీదుగా కర్నూలు చేరుకుంటుంది. ఈ కారిడార్ నిర్మాణానికి సంబంధించిన ప్రిలిమినరీ ఇంజినీరింగ్ ట్రాఫిక్ (పెట్) సర్వే తుది దశకు చేరుకుంది. ఈ సర్వేకు సంబంధించిన నివేదికను నవంబర్‌లో రైల్వే బోర్డుకు సమర్పించనున్నట్లు తెలుస్తోంది.

**మొదటి సెమీ హైస్పీడ్ కారిడార్..** ఈ కారిడార్ పనులు మొదలైతే.. తెలుగు రాష్ట్రాల్లో మొదటి పెమీ హైస్పీడ్ రైలు కారిడార్ ఇదే కానుంది. ఈ రూట్‌లో శంషాబాద్, రాజమహేంద్రవరం విమానాశ్రయాలను అనుసంధానించేలా ప్రణాళికను రూపొందించారు. ఈ రైలు మార్గం విమానాశ్రయాలకు అతి సమీపం నుంచి వెళ్లనుంది. విమాన ప్రయాణీకులు సెమీ హైస్పీడ్ రైళ్లలో తాము చేరుకోవల్సిన గమ్యానికి త్వరగా చేరుకునేలా రైల్వేశాఖ ప్రణాళిక రూపొందించింది. ఈ సెమీ హైస్పీడ్ రైలు వేగం గంటకు 220 కి.మీ ఉండనుంది. అంటే వెయ్యి కిలోమీటర్ల దూరాన్ని ఐదు గంటలలోపై ఈ ట్రైన్ చేరుకుంటుంది. ఈ రైలు మార్గం పూర్తైతే మాత్రం తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాలకు అతి వేగంగా చేరుకోవచ్చు. ఈ రైలు ప్రాజెక్టు పూర్తయితే శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి విశాఖపట్టణానికి నాలుగు గంటల్లో చేరుకునే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం హైదరాబాద్, విశాఖపట్టణం మధ్య రైలు ప్రయాణానికి 12 గంటల సమయం పడుతోంది. అదే వందే భారత్ రైలులో 8.30 గంటల్లో చేరుకుంటుంది.

**అత్యంత వేగంగా..** ఇప్పటివరకు ఉన్న రైళ్ల గరిష్ట వేగం 110 నుంచి 130 కిలోమీటర్లకు మించి లేదు. గరిష్ట వేగంతో రైళ్లు ప్రయాణించే సందర్భాలు చాలా తక్కువుగా ఉంటాయి. సికింద్రాబాద్ నుంచి విశాఖ కు ప్రస్తుతం రెండు రైలు మార్గాలు ఉన్నాయి. ఒకటి వరంగల్, ఖమ్మం, విజయవాడ కాగా.. రెండోది నల్గొండ, గుంటూరు, విజయవాడ మీదుగా విశాఖ చేరుకోవచ్చు. ప్రస్తుతం ఉన్న రైలు మార్గాల్లో ప్రయాణిస్తే విశాఖకు కనీసం 10 నుంచి 12 గంటలు పడుతుంది. కొత్త రైల్వే కారిడార్ నిర్మాణం పూర్తైతే శంషాబాద్- విశాఖ (దువ్వాడ) మధ్య ప్రయాణ సమయం గణనీయంగా తగ్గనుంది. సాధారణ రైళ్లతో పోలిస్తే సెమీ హైస్పీడ్ రైలు రెట్టింపు వేగంతో నడవనుంది. దీంతో గమ్యస్థానాన్ని త్వరగా చేరుకునే అవకాశం ఉంటుంది.

# ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యం: మంత్రి నిమ్మల..



రాజమహేంద్రవరం: ఆంధ్రప్రదేశ్‌లో జరిగే ఎమ్మెల్సీ ఎన్నికలకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని అధికారులను ఏపీ జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆదేశించారు. నవంబర్ 6వ తేదీ లోగా ఓటర్ల నమోదు ప్రక్రియ పూర్తి చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కూటమి శ్రేణులకు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ.."ఈసారి రాష్ట్రవ్యాప్తంగా 70 నియోజకవర్గాల పరిధిలో ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగుతాయి. ఎన్డీయే అభ్యర్థులను గెలిపించేందుకు కూటమి శ్రేణులు కృషి చేయాలి. ప్రభుత్వం అందించే కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లాలి. పార్టీ నేతలంతా కార్యకర్తలను సమన్వయం చేస్తూ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించాలి. సాగునీటి సంఘాల ఎన్నికల్లోనూ మనదే విజయం కావాలి. ఇందుకు ప్రతి ఒక్కరూ నిర్లక్ష్యం వహించకుండా క్షేత్రస్థాయిలో పని చేయాలి. ఏపీ అసెంబ్లీ ఎన్నికల్లో కష్టపడినట్లే ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ చెమట చిందించాలి. ఏపీలో ఉచిత ఇసుక సరఫరా చేయాలని అధికారులకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేశాం. పదకొండు బోట్స్‌మెన్ సొసైటీల్లో పూర్తిస్థాయిలో ఇసుక అందుబాటులోకి తీసుకువస్తాం. ఉచిత ఇసుక పంపిణీలో స్థానిక నేతలేవరూ జోక్యం చేసుకోవద్దు. ఇసుక సరఫరాలో అక్రమాలకు పాల్పడే నేతలపై కఠిన చర్యలు ఉంటాయని సీఎం చంద్రబాబు హెచ్చరించారు. వైసీపీ పాలనలో ఆ పార్టీ నేతలు కమిషన్ల కోసం కక్కుర్తి పడ్డారు. విద్యుత్‌ను అధిక రేట్లకు కొనుగోలు చేసి ప్రజలపై భారం మెపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నేడు టీడీపీ కార్యకర్తలకు అండగా నిలబడ్డారు. వారి శ్రేయస్సు కోసం మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కేవలం రూ.100 కడితే రూ.2లక్షల నుంచి రూ.5లక్షల వరకూ ప్రమాద బీమా అందిస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని సైతం విజయవంతం చేయాలి. రాష్ట్రవ్యాప్తంగా ఎక్కువ మందితో సభ్యత్వం చేయించే దిశగా కష్టపడాలి" అని చెప్పారు.

# వికసిత్ భారత్, వికసిత్ ఆంధ్రనే వారి లక్ష్యం



విశాఖపట్నం, అక్టోబర్ 26: గత ఐదేళ్ల జగన్ పాలనలో రాష్ట్రం అధ:పాతాళంలోకి వెళ్లిపోయిందని, కొత్త పరిశ్రమల స్థాపన, పెట్టుబడులపై దృష్టి పెట్టలేదని 20 పాయింట్స్ చైర్మన్ లంకా దినకర్ విమర్శలు గుప్పించారు. శనివారం వైజాగ్ డెవలప్మెంట్ కౌన్సిల్, ఏపీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ, ఏపీ టూర్ అండ్ ట్రావెలర్ ఆపరేటర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో లంకా దినకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అభివృద్ధిలో అగ్రగామిగా ఏపీని తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు. అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేస్తామన్నారు. వికసిత్ భారత్, వికసిత్ ఆంధ్ర.. ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యమని అన్నారు. స్వర్ణాంధ్ర 2047 లక్ష్యానికి అనుగుణంగా ముందుకు వెళుతున్నామని తెలిపారు. పెట్టుబడుల ఆకర్షణ, ఉద్యోగ ఉపాధి అవకాశాలను కల్పించడమే తమ లక్ష్యమని వెల్లడించారు. ఆత్మ నిర్భర్ భారత్ కార్యక్రమంతో దేశం అభివృద్ధి చెందుతోందన్నారు. పరిశ్రమల పునరుద్ధరణ కోసం త్వరలోనే ఒక ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. గ్రీన్ ఎనర్జీకి సీఎం చంద్రబాబు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. డబుల్ ఇంజన్ సర్కార్ వలన రాష్ట్రానికి ఎంతో మేలు జరుగుతోందన్నారు. దేశానికి ముంబాయి ఎలాగో.. ఏపీకి ఆర్థిక రాజధాని విశాఖ అని లంకా దినకర్ పేర్కొన్నారు.

**అందరూ సహకరించండి: ఎంపీ భరత్...** వైజాగ్ డెవలప్మెంట్ కౌన్సిల్, ఏపీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ, ఏపీ టూర్ అండ్ ట్రావెలర్ ఆపరేటర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సుకు విశాఖ ఎంపీ భరత్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లో నూతన పెట్టుబడుల పాలసీలు, అవకాశాలపై సమావేశంలో చర్చించనున్నారు. ఈ సందర్భంగా ఎంపీ భరత్ మాట్లాడుతూ.. ఏపీలో అన్ని వర్గాల ప్రజలు కష్టాలు వినే ప్రభుత్వం వచ్చిందన్నారు. రాష్ట్రంలో పెట్టుబడులకు మంచి అవకాశాలు ఉన్నాయని తెలిపారు.

జీవీఎంసీ వద్ద నిధులు లేవని... నగరంలో సీసీ కెమెరా ఏర్పాటుకు సీఎస్ఆర్ నిధులు ఇవ్వడానికి ముందుకు రావాలన్నారు. విశాఖ అభివృద్ధికి అందరూ సహకరించాలని ఎంపీ భరత్ కోరారు. ఈ సదస్సులో ఎమ్ ఎస్ ఎమ్ ఈ చైర్మన్ శివ శంకర్, ఏపీ మారిటైమ్ బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, టూరిజం కార్పొరేషన్ చైర్మన్ బాలాజీ, పలువురు పారిశ్రామిక వేత్తలు పాల్గొన్నారు.

# కార్యకర్తల సంక్షేమానికి రూ.కోట్లు ఖర్చు చేసిన ఘనత తెదేపాది: మంత్రి లోకేశ్



అమరావతి: తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభమైంది. ప్రతి ఒక్కరూ రూ.100తో సభ్యత్వం తీసుకోవాలని 'ఎక్స్' వేదికగా మంత్రి నారా లోకేశ్ కోరారు. దీంతో రూ.5 లక్షల వరకు ప్రమాద బీమా ఉంటుందని చెప్పారు.

కుటుంబ సభ్యులకు విద్యా, ఉద్యోగ, వైద్య సహాయం అందుతుందని పేర్కొన్నారు. కార్యకర్తల సంక్షేమానికి రూ.కోట్లు ఖర్చు చేసిన ఘనత తెదేపాదని తెలిపారు. మొబైల్ ఫోన్, వెబ్‌సైట్, వాట్సాప్ ద్వారా సభ్యత్వం తీసుకోవచ్చని పేర్కొన్నారు. పాత సభ్యత్వాన్ని రెన్యువల్ చేసుకోవచ్చని సూచించారు.



# క్రిప్టోలతో ఆర్థిక స్థిరత్వానికి పెను ముప్పు

క్రిప్టో కరెన్సీపై రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గవర్నర్ శక్తికాంత దాస్ ఆందోళన వ్యక్తంచేశారు. క్రిప్టోలతో ఆర్థిక స్థిరత్వానికి పెను ముప్పు ఉందన్నారు.


'పీటర్సన్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఇంటర్నేషనల్ ఎకనామిక్స్' థింక్ ట్యాంక్‌కు హాజరైన ఆయన క్రిప్టోల గురించి కీలక వ్యాఖ్యలు చేశారు. క్రిప్టోలతో ద్రవ్య లభ్యత, ఆర్థిక స్థిరత్వానికి భారీ ప్రమాదం పొంచిఉందని దాస్ అన్నారు. దీనికారణంగా ఆర్థిక వ్యవస్థలో ద్రవ్య సరఫరాపై కేంద్ర బ్యాంక్ నియంత్రణ కోల్పోయే అవకాశం ఉ ందన్నారు. క్రిప్టోలు ఆర్థిక వ్యవస్థపై ఆధిపత్యాన్ని చెలాయించకూడదని తాను అభిప్రాయపడుతున్నట్లు చెప్పారు. అందుకే క్రిప్టోను ప్రమాదకరంగా భావిస్తున్నట్లు ఆయన వివరించారు. క్రిప్టోతో కలిగే భారీ నష్టాలను దృష్టిలోఉంచుకొని ఈ సమస్యపై అంతర్జాతీయ అవగాహన ఉండాలన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న సెంట్రల్ బ్యాంక్‌లకు ఇది ప్రధాన ఆందోళన అని దాస్ తెలిపారు. క్రిప్టో కరెన్సీల గురించి ప్రశ్నల్ని లేవనెత్తిన మొదటి దేశం భారత్ అని దాస్ పేర్కొన్నారు. భారత్ అధ్యక్షతన జరిగిన జీ20 శిఖరాగ్ర సదస్సులో క్రిప్టోపై ఎలా వ్యవహరించాలనే అంశంపై అంతర్జాతీయ అవగాహనను పెంపొందించేందుకు ఒప్పందం జరిగిందని గుర్తుకుతెచ్చారు. క్రిప్టోపై ఆందోళన వ్యక్తంచేసిన మొదటి సెంట్రల్ బ్యాంకుల్లో తమ బ్యాంకు కూడా ఒకటన్నారు. "ఆర్థికవ్యవస్థలో క్రిప్టో ఆధిపత్యం చెలాయిస్తే సెంట్రల్ బ్యాంక్ ద్రవ్య వ్యవస్థపై నియంత్రణ కోల్పోతుంది. ఇది ద్రవ్య వ్యవస్థలో అస్థిరతకు దారితీస్తుంది. అంతేకాదు ఆర్థికరంగంపై ప్రభావం చూపుతుంది" అని ఆయన అన్నారు. అందుకే ఈవిషయంలో చాలా జాగ్రత్తగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు.

# అనంతపురం జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం.. ఆరుగురి మృతి



శింగనమల: అనంతపురం జిల్లాలో శనివారం మధ్యాహ్నం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. శింగనమల మండలం నాయనపల్లి క్రాస్ వద్ద లారీని కారు ఢీకొంది. టైరు పగిలి అదుపుతప్పిన కారు.. ఎదురుగా వస్తున్న లారీనీ ఢీకొట్టడంతో నుజ్జునుజ్జు అయింది. ఈ ప్రమాదంలో కారులోని ఆరుగురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. వీరంతా తాడిపత్రిలో నగర కీర్తన వేడుకలో పాల్గొని తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. మృతులంతా అనంతపురానికి చెందిన సంతోష్, షణ్ముక్, వెంకన్న, శ్రీధర్, ప్రసన్న, వెంకీగా గుర్తించారు.

# తిరుపతిలోని రాజ్ పార్క్ హోటల్‌కు బాంబు బెదిరింపులు



తిరుపతి: తిరుపతిలోని రాజ్ పార్క్ హోటల్‌కు బాంబు బెదిరింపులు వచ్చాయి. దీంతో హోటల్‌లో పోలీసులు తనిఖీలు చేపట్టారు. మరోవైపు గురువారం కూడా తిరుపతిలోని పలు హోటళ్లకు బాంబు బెదిరింపులు రావడంతో కలకలం రేగింది. లీలామహల్ సమీపంలోని మూడు ప్రైవేటు హోటళ్లు, రామానుజ కూడలిలోని మరో హోటల్‌కు గురువారం మెయిల్‌లో బెదిరింపులు రావడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. డీఎస్పీ వెంకట నారాయణ పర్యవేక్షణలో సిబ్బంది ప్రత్యేక బృందాలతో తనిఖీలు చేపట్టారు. ఎక్కడా పేలుడు పదార్థాలు లేవని నిర్ధారించుకుని ఊపిరి పీల్చుకున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# పవన్ ఆదేశాలతో కదిలిన యంత్రాంగం.. సరస్వతి పవర్ భూముల్లో అధికారుల సర్వే



అమరావతి: సరస్వతి పవర్ సంస్థ భూముల వ్యవహారంపై డిప్యూటీ సీఎం ఆదేశాలతో అధికార యంత్రాంగం కదిలింది. 'పల్నాడు జిల్లా దాచేపల్లి, మాచవరం మండలాల్లో సరస్వతి పవర్ సంస్థకు చెందిన భూముల్లో అటవీశాఖ భూములు ఏమైనా ఉన్నాయా? ఉ ంటే వాటి విస్తీర్ణం ఎంత ఉందో పేర్కొంటూ నివేదిక ఇవ్వాలి' అని ఉ పముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ అటవీ పర్యావరణ శాఖ అధికారులను ఆదేశించారు. ఈ నేపథ్యంలో దాచేపల్లి డీఆర్వో ఆధ్వర్యంలో అటవీశాఖ సిబ్బంది శనివారం దాచేపల్లి, మాచవరం మండలాల్లో సర్వే నిర్వహిస్తున్నారు. సరస్వతి పవర్ సంస్థకు ఉన్న 1,515.93 ఎకరాల్లో ప్రకృతి సంపద, వాగులు, వంకలు, కొండ భూములు ఉన్నాయనే సమాచారం వెలుగుచూసిన నేపథ్యంలో పవన్‌కల్యాణ్ అధికార యంత్రాంగంతో మాట్లాడారు.

ఆ సంస్థకు చెందిన భూముల్లో జలవనరులు, ప్రభుత్వ భూములు ఏ మేరకు ఉన్నాయో తెలియజేయడంతో పాటు అటవీ భూముల అంశాన్ని సమగ్రంగా పరిశీలించాలని ఆదేశించారు. వాగులు, వంకలు, కొండలు ఆ భూముల్లో ఉన్నందున పర్యావరణ అనుమతులు ఎలా పొందారో తెలియజేయాలని కాలుష్య నియంత్రణ మండలి అధికారులనూ ఉపముఖ్యమంత్రి కోరారు.

# ఏఐ అవకాశాల వినియోగంతో ఏపీ అభివృద్ధి: మంత్రి లోకేశ్



శాన్‌ఫ్రాన్సిస్కో: ఏపీ మంత్రి నారా లోకేశ్ అమెరికాలో పర్యటిస్తున్నారు. శాన్‌ఫ్రాన్సిస్కోలో పారిశ్రామికవేత్తల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఏఐ అవకాశాల వినియోగంతో ఏపీ శరవేగంగా అభివృద్ధి చెందుతోందని తెలిపారు. "ప్రతి వంద రోజులకు లక్ష్యాలను నిర్దేశించుకుని పనిచేస్తున్నాం. పి-4 విధానాల అమలుతో పేదరిక నిర్మూలనకు కృషి చేస్తున్నాం. పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా విద్యావ్యవస్థలో మార్పులు చేస్తున్నాం" అని లోకేశ్ తెలిపారు.

# ఒకేరోజు ఆరు పుణ్యక్షేత్రాల దర్శనం.. ఆధ్యాత్మిక బస్సు యాత్ర ప్రారంభం



రాజమహేంద్రవరం: స్థానిక సరస్వతీ ఘాట్‌లో ఆధ్యాత్మిక బస్సు యాత్రను మంత్రి కందుల దుర్గేశ్ ప్రారంభించారు. పర్యటక శాఖ ఆధ్వర్యంలో దీన్ని నిర్వహిస్తున్నారు. ఈ యాత్రలో ఒకేరోజు ఆరు పుణ్యక్షేత్రాల దర్శనం కల్పిస్తున్నారు. తొలుత కోరుకొండ శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో స్వామివారిని భక్తులు దర్శించుకుంటారు. అక్కడినుంచి అన్నవరం సత్యనారాయణస్వామి, పిఠాపురం కుక్కుటేశ్వరస్వామి, సామర్లకోట కుమారరామ భీమేశ్వరస్వామి, ద్రాక్షారామ భీమేశ్వరస్వామి, వాడపల్లి వెంకటేశ్వరస్వామి ఆలయాల సందర్శన ఉంటుంది. రాజమహేంద్రవరం పుష్కర్ ఘాట్‌లో గోదావరి హారతితో బస్సు యాత్ర ముగియనుంది. ప్రతి శనివారం ఈ యాత్ర ఉంటుంది. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి శ్రీనివాస్, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, బత్తుల బలరామకృష్ణ పాల్గొన్నారు.

# నందిగం సురేష్, బోరుగడ్డ అనిల్‌పై హత్యాయత్నం కేసు



అమరావతి: వైకాపా నేత నందిగం సురేష్, రౌడీషీటర్ బోరుగడ్డ అనిల్‌పై తుళ్లూరు పోలీసు స్టేషన్‌లో హత్యాయత్నం కేసు నమోదైంది. భాజపా నేత, ప్రస్తుత మంత్రి సత్యకుమార్‌పై దాడి ఘటనలో వారిపై ఈ కేసు నమోదైంది. ఇందులో ఏ1గా సురేష్, ఏ2గా బోరుగడ్డ అనిల్‌ను చేర్చారు. మూడు రాజధానుల శిబిరం వద్ద 2023లో సత్యకుమార్‌పై దాడి జరిగింది. రాజధాని రైతులకు సంఘీభావం తెలిపి వెళు ్తుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. సత్యకుమార్‌పై దాడికి సంబంధించి భాజపా నేతలు 25 మందిపై ఫిర్యాదు చేశారు.

## ఇతరుల కోసం మొరటు ప్రవర్తన మార్చుకోలేనన్న నటి

ఒక సెలబ్రిటీ ఎలా ప్రవర్తించాలి? ముఖ్యంగా మచ్చలేని ఇమేజ్‌ని మెయింటెయిన్ చేయడం లేదా ఎమోషన్స్‌ని కంట్రోల్ చేసుకోవడం ఎలా? ఇదే విషయాన్ని ప్రశ్నిస్తే బాలీవుడ్ సీనియర్ నటి కాజోల్ చెప్పిన సమాధానం ఆశ్చర్యపరిచింది. అదే సమయంలో తన నిజాయితీ కూడా అందరినీ ఆకర్షించింది. ఇటీవల దుర్గా పూజలో కొందరిపై సీరియస్ అయిన కాజోల్ ఉగ్రరూపంపై మీడియాలో వార్తా కథనాలు వెలువడిన సంగతి తెలిసిందే. అనంతరం జూమ్ ఇంటర్వ్యూలో కాజోల్ ముచ్చటించారు. నిజానికి ఇలాంటి విషయాల్లో ప్రజాభిప్రాయానికి తగినట్లుగా తనను తాను ఎడిట్ చేసుకోవడానికి తాను నిరాకరిస్తానని కాజోల్ స్పష్టం చేసింది. నాకు కోపం వస్తుంది.. నాకు మంచి రోజులు ఉన్నాయి.. చెడ్డ రోజులు ఉన్నాయి.. అది నేనే. ఒక సెలబ్రిటీ గనుక నిగ్రహాన్ని కోల్పోకూడదు అనే ఇతరుల ఆలోచన కోసం నేను మారలేనని.. నన్ను పదే పదే సవరించుకోలేనని చెప్పారు కాజోల్. అంతేకాదు అలాంటి సమయాల్లో తన ప్రవర్తనను తప్పుగా మీడియా ఫోకస్ చేస్తోందని, రియాలిటీకి ఫోటోలు వీడియోలు చూడటానికి తేడా ఉంటుందని కూడా అన్నారు. అంతకుముందు విజయ దశమి రోజున దుర్గా పూజ పండల్(పండుగ)లో స్టిల్



ఫోటోగ్రాఫర్లపై కాజోల్ విరుచుకుపడింది. కొందరు చెప్పులతోనే దేవత వద్దకు విచ్చేయగా వారిని వారిస్తూ కాజోల్ ధుమధుమలాడారు. భక్తులు ఉన్న చోట వారంతా గుంపుగా మీద పడటం కాజోల్‌కు కోపం తెప్పించింది. విసుగు చెంది దర్శనం కోసం వచ్చిన ఫోటోగ్రాఫర్లను పక్కకు తప్పుకోవాలని కాజోల్ గట్టిగా అరిచేస్తూ కోరింది. అంజౌలీ కోసం ప్రజలు మీ వెనుక నిలబడి ఉన్నారు. దయచేసి పక్కకు వెళ్లండి.. దయచేసి సైడ్ హెూ జాయే, పీచే హెూ జైయే. అంజౌలీ దేనే కే లియే లోగో కో ఆనే దీజియే అని సీరియస్ గా హెచ్చరించారు కాజోల్. అదే రోజు దుర్గా పూజ వేడుకలో కాజోల్ రకరకాల ఎమోషన్స్ ని కనబరిచిన ఫోటోలు వీడియోలు ఇంటర్నెట్‌లో వైరల్ అయ్యాయి. వాటిపై ట్రోలింగ్ కూడా తీవ్రంగా నడిచింది. అంతకుముందు వెటరన్ స్టార్ జయ బచ్చన్‌ను ఆప్యాయంగా పలకరించిన కాజోల్ అకస్మాత్తుగా వెనుదిరిగింది. ఆ పరిసరాల్లో గ్యాప్ అన్నదే లేకుండా నిరంతర ఈల శబ్దాలకు విసుగు చెందింది. వీలలు విజిల్స్ వేసేవాళ్లను చూస్తూ ఆందోళనకు గురైన ఆమె, ఎవరు శబ్దం చేస్తున్నారో చూడండని సెక్యూరిటీ గార్డును కోరింది. కొంత సీరియస్ గా కనిపించిన కాజోల్ కౌన్ హై యే, సీతీ కౌన్ బాజా రహా హై? (ఎవరు ఈలలు వేస్తున్నారు?) అతడిని ఆపమని చెప్పండి.. ఇది హాస్యాస్పదంగా ఉంది అంటూ గుస్సాయించింది. ఫోటోగ్రాఫర్లతో పాటు ఇతరులతో కాజోల్ కొంత సీరియస్ గానే స్పందించడంతో అది కాస్తా మీడియా హెడ్ లైన్స్ లో కొచ్చింది. అయితే ఇతరుల ఆలోచన కోసం తాను మారలేనని కాజోల్ సూటిగా చెప్పేయడం ఆశ్చర్యపరుస్తోంది. తాను మారనని కూడా స్పష్టంగా చెప్పారు ఈ భామ.

## జెర్సీ హీరోయిన్.. బిజీగా ఉన్నా సౌండ్ లేదేంటి?

తెలుగులో జెర్సీ సినిమాలో నానికి జోడీగా నటించిన శ్రద్ధా శ్రీనాథ్ ని అంత ఈజీగా ఎవరు మరిచిపోరు. ఈ కన్నడ బ్యూటీ జెర్సీ చిత్రంలో అద్భుతమైన పెర్ఫార్మెన్స్ తో ఆకట్టుకుంది. అమ్మడు కోహినూర్ అనే మలయాళం మూవీతో నటిగా కెరియర్ స్టార్ట్ చేసింది. అయితే కన్నడంలో చేసిన యూటర్న్ శ్రద్ధా శ్రీనాథ్ కి మంచి బ్రేక్ ఇచ్చింది. ఈ సినిమా తర్వాత కన్నడ, మలయాళీ, తమిళ్ భాషలలో వరుస అవకాశాలు అందుకుంది. జెర్సీ సినిమాతో తెలుగులోకి ఈ బ్యూటీ ఎంట్రీ ఇచ్చింది. ఈ సినిమాలో శ్రద్ధా శ్రీనాథ్ తన పెర్ఫార్మెన్స్ తో విమర్శకుల ప్రశంసలు సొంతం చేసుకుంది. ఆ తరువాత తెలుగులో చెప్పుకోదగ్గ స్థాయిలో అవకాశాలు సొంతం చేసుకోలేకపోయింది. ఆది సాయికుమార్ తో జోడీ అనే సినిమాలో నటించింది. తరువాత సిద్ధూ జొన్నలగడ్డ కృష్ణ అండ్ హిస్ లీల సినిమాలో ఒక హీరోయిన్ గా కనిపించింది. తెలుగులో చెప్పుకోదగ్గ అవకాశాలు రాకపోయిన కూడా శ్రద్ధా శ్రీనాథ్ తమిళ్, కన్నడ భాషలలో మాత్రం వరుస సినిమా



లు చేస్తోంది. గత ఏడాది తమిళంలో వచ్చిన ఇరంగపట్రు సినిమా సూపర్ సక్సెస్ అయ్యింది. చిన్న సినిమాగా వచ్చి పెద్ద విజయాన్ని అందుకుంది. ఈ ఏడాది సైంధవ్ మూవీలో వెంకటేష్ కి జోడీగా శ్రద్ధా శ్రీనాథ్ కనిపించింది. అయితే ఈ మూవీ డిజాస్టర్ అయ్యింది. త్వరలో మెకానిక్ రాకీ సినిమాతో ప్రేక్షకుల రాబోతోంది. మంచి టాలెంటెడ్ యాక్టర్ గా పేరున్న కూడా తెలుగులో మాత్రం ఆమె కమర్షియల్ హీరోయిన్ గా మాత్రం సక్సెస్ కాలేకపోయింది. అయితే సౌత్ లో మంచి టాలెంటెడ్ యాక్టర్స్ గా పేరు తెచ్చుకున్న వారిలో శ్రద్ధా శ్రీనాథ్ కూడా ఉంటుందని చెప్పొచ్చు. గ్లామర్ బేస్డ్ రోల్స్ మాత్రం చేయలేదు. కథలు కూడా సెలక్టివ్ గా ఎంపిక చేసుకుంటుంది. కచ్చితంగా తన పాత్రకి ప్రాధాన్యత ఉంది అనుకుంటేనే ఆమె ఒప్పుకుంటుంది. మేగ్జిమమ్ ఆమె నటించిన సినిమాలలో చాలావరకు డీసెంట్ రోల్స్ ఉంటాయి. అయితే ఆమె ఏదో ఒక సినిమాతో బిజీగా ఉన్నప్పటికీ బిగ్ సక్సెస్ అయితే ఇంతవరకు రాలేదు. చేసిన సినిమాలు తక్కువే అయిన కూడా నటిగా మాత్రం శ్రద్ధా శ్రీనాథ్ బలమైన ముద్ర వేసుకుంది. సినిమాలో చేసే పాత్రలకి పూర్తి భిన్నంగా బయట ఈ బ్యూటీ గ్లామర్ అవుట్ ఫిట్ లతో ఇన్ స్టాగ్రామ్ లో సందడి చేస్తూ ఉంటుంది. ఇక ప్రస్తుతం అమ్మడి హెూప్స్ అన్ని కూడా విశ్వక్ సేన్ మేకనిక్ రాఖీ సినిమాపైనే ఉన్నాయి. ట్రయాంగిల్ లవ్ స్టోరీగా రానున్న ఈ సినిమాపై ఆడియెన్స్ లో మంచి బజ్ ఉంది. కాబట్టి కమర్షియల్ గా క్లిక్కయ్యే అవకాశం ఉంది. మరి ఈ సినిమాతో అయినా జెర్సీ బ్యూటీ రాత మారుతుందేమో చూడాలి.




## చరణ్ కి జోడీగా జాన్వీ కపూర్... మరొకరు ఎవరూ లేరు!



రామ్ చరణ్ హీరోగా ఉప్పెన దర్శకుడు బుచ్చిబాబు దర్శకత్వంలో రూపొందబోతున్న స్పోర్ట్స్ డ్రామా షూటింగ్‌ను నవంబర్ నుంచి ప్రారంభించబోతున్నారు. ఈ గ్యాప్ లో గేమ్ ఛేంజర్‌ను ముగించాలని రామ్ చరణ్ ప్రయత్నిస్తున్నారు. గేమ్ ఛేంజర్ తో సంబంధం లేకుండా వచ్చే నెల నుంచి బుచ్చిబాబు తన సినిమాను మొదలు పెట్టే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికే హీరోయిన్ గా అతిలోక సుందరి శ్రీదేవి తనయ జాన్వీ కపూర్‌ని ఎంపిక చేయడం జరిగింది. భారీ అంచనాల నడుమ రూపొందుతున్న ఈ సినిమాలో జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటించడం అనేది మంచి ఆలోచన అనే అభిప్రాయంను చాలా మంది వ్యక్తం చేస్తున్నారు.

జాన్వీ కపూర్ తో పాటు ఈ సినిమాలో మరో బాలీవుడ్ హీరోయిన్ ఉంటుందని, ఆమె పాత్రకు సంబంధించిన పలువురు పలు రకాలుగా ప్రచారం చేయడం జరిగింది. కానీ ఇప్పటి వరకు సెకండ్ హీరోయిన్ గురించి ఎలాంటి క్లారిటీ ఇవ్వలేదు. తాజాగా బుచ్చిబాబు సన్నిహితులు రామ్ చరణ్ కి జోడీగా కేవలం జాన్వీ కపూర్ మాత్రమే నటించనుంది. మరో హీరోయిన్ ప్రస్తావనే లేదు. ఇప్పటి వరకు సెకండ్ హీరోయిన్ గురించిన చర్చలు జరపలేదని, అసలు కథలో ఆ అవసరం లేదు అనే అభిప్రాయంను వారు వ్యక్తం చేయడం జరిగింది. దాంతో ఈ సినిమాలో సింగిల్ హీరోయిన్ అని తేలిపోయింది. బాలీవుడ్ లో హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చి చాలా కాలం అయినా ఇప్పటి వరకు జాన్వీ కపూర్ అక్కడ కమర్షియల్ హిట్స్ ను దక్కించుకోలేక పోయింది. అయినా సోషల్ మీడియాలో మాత్రం వరుసగా అందమైన ఫోటో షూట్స్ ను షేర్ చేయడం ద్వారా పాపులారిటీని సొంతం చేసుకుంది. ఆకట్టుకునే అందంతో పాటు ఈమె షేర్ చేసే ఫోటోలు వైరల్ అవ్వడంతో వరుసగా ఆఫర్లు వస్తున్నాయి. ఈ మధ్య కాలంలో జాన్వీ కపూర్ దేవర సినిమాతో మొదటి సక్సెస్ ను అందుకుంది. ఎన్టీఆర్ తో జాన్వీ కపూర్ జోడీ అదిరింది అంటూ చాలామంది కామెంట్స్ చేశారు. తెలుగు లో మొదటి హిట్ ను సొంతం చేసుకున్న జాన్వీ కపూర్ ముందు ముందు టాలీవుడ్ లో మరిన్ని హిట్స్ ను సొంతం చేసుకుంటుంది అనే నమ్మకంను ఇండస్ట్రీ వర్గాల వారు వ్యక్తం చేస్తున్నారు. ఈ మధ్య కాలంలో జాన్వీ కపూర్ కి టాలీవుడ్ నుంచి మరిన్ని ఆఫర్లు వచ్చాయట. కానీ చరణ్ తో బుచ్చిబాబు చేస్తున్న సినిమా పూర్తి అయిన తర్వాత మాత్రమే కొత్త సినిమా షూటింగ్ ను చేయాలని నిర్ణయించుకున్నట్లుగా తెలుస్తోంది. అందుకే చరణ్ సినిమాలో నటించేందుకు జాన్వీ కపూర్ ఆసక్తిగా ఎదురు చూస్తోంది. జాన్వీ కపూర్ దేవర సినిమాలో పల్లెటూరు అమ్మాయి పాత్రలో కనిపించింది. అలాగే చరణ్, బుచ్చిబాబు సినిమాలోనూ పల్లెటూరు అమ్మాయి పాత్రలో కనిపించబోతుంది.

## సంక్రాంతి క్లాష్.. ఆ కుర్ర హీరోకు లక్కీ ఛాన్స్



సంక్రాంతి సీజన్.. సినిమా వాళ్లకు చాలా స్పెషల్ అనే చెప్పాలి. కచ్చితంగా ఏటా పొంగల్ కు అనేక చిత్రాలు ప్రేక్షకుల ముందుకు వస్తుంటాయి. టాక్ తో సంబంధం లేకుండా భారీ వసూళ్లను అందుకుంటాయి. దీంతో మేకర్స్.. పొంగల్ సీజన్ పై ఎక్కువ ఫోకస్ చేస్తుంటారు. సంక్రాంతికే తమ చిత్రాలను రిలీజ్ చేయాలని భావిస్తుంటారు. అయితే వచ్చే ఏడాది పొంగల్ కు మొత్తం ఎన్ని సినిమాలు ప్రేక్షకుల ముందుకు వస్తాయనేది ఇప్పటికీ ఇంకా ఫిక్స్ అవ్వలేదు. అందరి కన్నా ముందు మెగాస్టార్ చిరంజీవి విశ్వంభర.. కర్చీఫ్ వేసుకోగా రీసెంట్ గా వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. అదే తేదీన స్టార్ హీరో రామ్ చరణ్ గేమ్ ఛేంజర్.. రిలీజ్ కానుంది. సీనియర్ బాలకృష్ణ %చీదీఖ% 109 మూవీ కూడా సంక్రాంతికే విడుదల కానుంది. వెంకటేష్, అనిల్ రావిపూడి ప్రాజెక్ట్ మాత్రం వాయిదా పడేలా కనిపిస్తోంది. ఇప్పటి వరకు ఎలాంటి ప్రకటన రాకపోయినప్పటికీ.. పోస్ట్ పోన్ అవ్వడం నిజమేనని టాక్ వినిపిస్తోంది. అదే సమయంలో నాగచైతన్య.. తండేల్ మూవీ కూడా సంక్రాంతికి వస్తుందని కొద్దిరోజులుగా వార్తలు వస్తున్నాయి. కానీ మేకర్స్ రీసెంట్ గా తమ నిర్ణయాన్ని మార్చుకున్నారని ప్రచారం జరుగుతోంది. రిపబ్లిక్ డే కానుకగా రిలీజ్ చేయనున్నారని తెలుస్తోంది. దీంతో ఇప్పుడు యంగ్ హీరో సందీప్ కిషన్ మంచి ఛాన్స్ కొట్టేశారని సినీ వర్గాలు అంటున్నాయి. తండేల్ తప్పుకోవడంతో.. సందీప్ కిషన్ మజాకాకు థియేటర్లు బాగా దొరుకుతాయని చెబుతున్నాయి. గేమ్ ఛేంజర్ ను తెలుగు రాష్ట్రాల్లోని 50 శాతానికి పైగా థియేటర్ల విడుదల చేయాలని దిల్ రాజు ప్లాన్ చేస్తున్నట్లు కొద్దిరోజులుగా వార్తలు వస్తున్నాయి. స్పెషల్ అండ్ బెనిఫిట్ షోలు వేయనున్నారట. అదే సమయంలో బాలయ్య మూవీకి 25 శాతం థియేటర్లు దక్కనున్నట్లు తెలుస్తోంది. ఇప్పుడు మజాకా.. మిగతా థియేటర్లలో ఎక్కువ భాగం దక్కించుకోనుందన్నమాట. మాస్ ఎంటర్టైనర్ గా త్రినాథరావు నక్కిన ఆ మూవీని తెరకెక్కిస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటికే దాదాపు మొత్తం షూటింగ్ పూర్తి చేసుకున్న మజాకాను ఏకే ఎంటర్టైన్మెంట్స్, హాస్య మూవీస్, జీ స్టూడియోస్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఈ చిత్రంలో రీతూ వర్మ హీరోయిన్ గా నటిస్తుండగా.. రావు రమేశ్, మన్మథుడు ఫేమ్ అన్షు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. త్వరలోనే మేకర్స్ ప్రమోషన్స్ స్టార్ట్ చేయనున్నారు. మరి సంక్రాంతి కానుకగా రిలీజ్ కానున్న మజాకా మూవీ.. సందీప్ కిషన్ కు ఎలాంటి విజయాన్ని అందిస్తుందో వేచి చూడాలి.

## కట్టప్ప కూతురును మీరు ఎప్పుడైనా చూశారా..!

కోలీవుడ్ సీనియర్ నటుడు సత్యరాజ్ గురించి తెలుగు ప్రేక్షకులకు ప్రత్యేకంగా పరిచయం అక్కర్లేదు. సోషల్ మీడియాలో ఎప్పుడూ సత్య రాజ్ గురించి ఏదో ఒక చర్చ జరుగుతూనే ఉంటుంది. ఆయన కేవలం తమిళ్ లో మాత్రమే కాకుండా తెలుగు ఇతర భాషల్లోనూ క్రమం తప్పకుండా కనిపిస్తూనే ఉన్నారు. ఈ మధ్య కాలంలో టాలీవుడ్ లో ఎక్కువ సినిమాలు చేశారు. మిర్చి సినిమాలో ప్రభాస్ కి తండ్రి పాత్రలో కనిపించి మంచి మార్కులు సొంతం చేసుకున్నారు. టాలీవుడ్ లో ఆయన కట్టప్ప పాత్రతో ఒక్కసారిగా స్టార్ డమ్ దక్కించుకున్నారు. ఆ తర్వాత ఎన్నో సినిమాలు చేసిన విషయం తెల్సిందే. బాహుబలి సినిమాలో కట్టప్ప పాత్ర పోషించడం ఆయన కెరీర్ లో అత్యంత కీలకమైన పరిణామంగా చెప్పుకోవచ్చు.




దేశ వ్యాప్తంగా పాపులారిటీని సొంతం చేసుకున్న సత్యరాజ్ అన్ని భాషల్లోనే స్టార్ క్యారెక్టర్ ఆర్టిస్టుగా సినిమాలు చేస్తూ అత్యధిక పారితోషికం అందుకుంటున్నాడు. ఈ మధ్య కాలంలో ఆయన నుంచి వచ్చిన ప్రతి సినిమా విమర్శకుల ప్రశంసలు దక్కించుకోవడంతో పాటు, ఆయన పాత్రలకు మంచి మార్కులు పడుతున్నాయి. స్టార్ హీరోల నుంచి చిన్న హీరోల వరకు ఎంతో మందితో కలిసి నటించిన సత్య రాజ్ కూతురు గురించి గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. సత్యరాజ్ కి కొడుకు సిబిరాజ్, కూతురు దివ్య ఉన్నారు. ఇప్పటికే సత్యరాజ్ తనయుడు సిబిరాజ్ హీరోగా ఇండస్ట్రీకి పరిచయం అయ్యాడు. డోరా, మయోన్ సినిమాల్లో హీరోగా నటించడం ద్వారా తమిళ ప్రేక్షకులకు సుపరిచితుడు అయ్యాడు. హీరోగా సిబిరాజ్ సక్సెస్‌ను దక్కించుకుని తనకంటూ ప్రత్యేక గుర్తింపును సొంతం చేసుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నాడు. ఈ సమయంలోనే ఆయన కూతురు గురించి సైతం చర్చ జరుగుతోంది. కూతురు దివ్య ఇండస్ట్రీకి దూరంగా ఉంటున్నారు. ఆమెకు నటించే అవకాశాలు వచ్చినా సున్నితంగా తిరస్కరించాని తమిళ మీడియా వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. దివ్య మొదటి నుంచి నటనపై ఆసక్తిని కనబరచలేదు. తనకు ఆసక్తి ఉంటే నటించేందుకు నాకు ఎలాంటి ఇబ్బంది లేదు అన్నట్లుగా గతంలో ఒక ఇంటర్వ్యూలో సత్యరాజ్ చెప్పుకొచ్చాడు. ఇప్పుడు సత్యరాజ్ కుమార్తె దివ్య ఇండస్ట్రీకి దూరంగా న్యూట్రిషియన్ గా కెరీర్ లో ముందుకు సాగుతుంది. ఆమె కెరీర్ లో విజయాలు సొంతం చేసుకుంటూ బాగానే ఉన్నారు. దివ్య సోషల్ మీడియా ద్వారా రెగ్యులర్‌గా హెల్త్ కి సంబంధించిన విషయాలను షేర్ చేస్తూ బాగానే ఫాలోవర్స్ ను సొంతం చేసుకున్నారు. అంతే కాకుండా దివ్య చూడ్డానికి చాలా అందంగా, హీరోయిన్ మాదిరిగా ఉంటారు. సినిమాల్లో ప్రయత్నిస్తే నటిగా మంచి ఫ్యూచర్ ఉండేది అనే అభిప్రాయంను చాలా మంది వ్యక్తం చేస్తున్నారు.

## డింపుల్ హయాతి.. లెగ్స్ అందాలతో క్రేజీ లుక్

టాలీవుడ్ లో గ్లామరస్ హీరోయిన్ గా తనకంటూ ప్రత్యేకమైన ఇమేజ్ సొంతం చేసుకున్న తెలుగమ్మాయి డింపుల్ హయాతి. ఈ బ్యూటీ గల్ఫ్ అనే సినిమాతో హీరోయిన్ గా కెరియర్ స్టార్ట్ చేసింది. అయితే మొదటి చిత్రం ఆశించిన స్థాయిలో సక్సెస్ ఇవ్వలేదు. తరువాత తమన్నా, ప్రభుదేవా కాంబినేషన్ లో వచ్చిన అభినేత్రి2 సినిమాలో కీలక పాత్రలో కనిపించింది. ఆ మూవీ కూడా పెద్దగా వర్క్ అవుట్ కాలేదు. గద్దలకొండ గణేష్ సినిమాల డింపుల్ హయాతి చేసిన ఐటెం సాంగ్ సూపర్ హిట్ కావడంతో ఒక్కసారిగా పాపులర్ అయ్యింది. ఆ సాంగ్ తర్వాత యురేకా అనే మూవీలో హీరోయిన్ గా చేసింది. బాలీవుడ్ లో అక్షయ్ కుమార్ అత్రాంగి రే సినిమాతో హిందీలోకి డింపుల్ హయాతి అడుగుపెట్టింది. తమిళంలో విశాల్ కి జోడీగా ఒక సినిమాలో నటించింది. తరువాత మాస్



మహారాజ్ రవితేజకి జోడీగా ఖిలాడీ చిత్రంలో ఆడిపాడింది. ఈ మూవీలో డింపుల్ హయాతి బికినీ వేసుకొని అందరికి షాక్ ఇచ్చింది. ఈ బికినీ ట్రీట్ తో గ్లామర్ రోల్స్ కి తాను సిద్ధమనే సిగ్నల్స్ ఇచ్చింది. నెక్ట్ రామబాణం సినిమాలో గోపిచంద్ కి జోడీగా నటించే అవకాశం డింపుల్ హయాతికి వచ్చింది. ఈ చిత్రంలో ఆమె మంచి ఫన్ జెనరేట్ చేసే పాత్రలో కనిపించింది. ఈ మూవీ కమర్షియల్ గా డిజాస్టర్ కావడంతో డింపుల్ హయాతి పెద్దగా ఎవరి దృష్టిని ఆకర్షించలేదు. అయితే కమర్షియల్ హీరోయిన్ అయ్యే ఫీచర్స్ డింపుల్ హయాతి దగ్గర పుష్కలంగా ఉన్నాయని ఆమె ఫ్యాన్స్ అంటూ ఉంటారు.

ఇన్ స్టాగ్రామ్ లో డింపుల్ రెగ్యులర్ గా తన గ్లామర్ పిక్స్ ని షేర్ చేస్తూ ఉంటుంది. ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతాయి. ఇదిలా ఉంటే తాజాగా డింపుల్ హయాతి వైట్ కలర్ టీషర్టుతో డిఫరెంట్ ఫోజులు ఇస్తూ ఆకట్టుకుంది. ఈ ఫోటోలకి నెటిజన్లు ఫిదా అయిపోతున్నారు. కళ్ళతోనే డింపుల్ హయాతి కట్టిపడేస్తోందని నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు.



# స్కిల్స్ యూనివర్సిటీ నిర్మాణం.. రూ.200 కోట్లు కేటాయించిన మేఘా

హైదరాబాద్: రాష్ట్రంలో యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు ప్రక్రియలో మరో ముందడుగు పడింది. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నెలకొల్పిన స్కిల్స్ యూనివర్సిటీ భవన నిర్మాణానికి మేగా ఇంజినీరింగ్ ఇన్‌ఫ్రాస్టక్చర్స్ లిమిటెడ్ ముందుకొచ్చింది. సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డితో సంస్థ ఎండీ కృష్ణారెడ్డి నేతృత్వంలోని ప్రతినిధుల బృందం సంప్రదింపులు జరిపింది. మొత్తం యూనివర్సిటీ క్యాంపస్ నిర్మాణానికి కంపెనీ తమ సీఎస్ఆర్ ఫండ్స్ నుంచి రూ. 200 కోట్లు కేటాయించింది. వీటితో యూనివర్సిటీ క్యాంపస్‌లో అవసరమైన భవనాలన్నింటినీ నిర్మించే బాధ్యతలను స్వీకరించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ వీఎల్వీఎస్ఎస్ సుబ్బారావు సమక్షంలో ఎంవోయూపై సంతకాలు చేశారు. ముఖ్యమంత్రితోపాటు ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్‌బాబు, ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్ ఈ సమావేశంలో పాల్గొన్నారు. హైదరాబాద్ శివారు కందుకూరు మండలం మీర్‌ఖాన్‌పేట సమీపంలో 57 ఎకరాల విస్తీర్ణంలో యూనివర్సిటీ నిర్మాణానికి ఆగస్టులోనే సీఎం రేవంత్ రెడ్డి చేతులమీదుగా భూమి పూజ చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో అక్కడ అధునాతన బోధన సదుపాయాలతోపాటు విద్యార్థులకు అన్ని వసతులు ఉండేలా క్యాంపస్ నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. సీఎస్ఆర్ నిధులతో క్యాంపస్ నిర్మాణానికి మేఘా కంపెనీ ముందుకు రావడం పట్ల ముఖ్యమంత్రి అభినందనలు తెలిపారు. ఆ ప్రాంగణంలో అకడమిక్ బిల్డింగ్, వర్క్‌షాపులు, హాస్టల్ బిల్డింగ్ వంటివి నిర్మిస్తామని కంపెనీ ఎండీ కృష్ణారెడ్డి వెల్లడించారు. ఇప్పటికే ఆర్కిటెక్ట్ నిపుణులతో తయారు చేయించిన యూనివర్సిటీ భవన నిర్మాణ నమూనాలు, డిజైన్లను ఈ సమావేశంలో ప్రదర్శించారు. వారం రోజుల్లోగా భవన డిజైన్లకు తుది రూపు ఇవ్వాలని సీఎం సూచించారు. నవంబరు 8 నుంచి విశ్వవిద్యాలయం భవన నిర్మాణ పనులు ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం తరఫున అందుకు అవసరమైన పూర్తి స్థాయి సహకారం అందిస్తామని సీఎం భరోసా ఇచ్చారు.




హైదరాబాద్: రాష్ట్రంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికకు ప్రత్యేక యాప్‌ను పొందించామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా ఉంటుందని.. అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామన్నారు. లబ్ధిదారుల ఎంపిక కోసం రూపొందించిన యాప్‌ను శనివారం సచివాలయంలోని తన కార్యాలయంలో మంత్రి పరిశీలించారు. ఈ యాప్‌లో ఒకటి రెండు మార్పు చేర్పులను మంత్రి సూచించారు. ఆయన సూచనల మేరకు మార్పులు చేసి వచ్చే వారంలో యాప్‌ను అందుబాటులోకి తీసుకురానున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. "కొద్దిరోజుల్లోనే రాష్ట్రంలో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రారంభిస్తాం. ఇందుకు చేయాల్సిన ఏర్పాట్లు తుది దశకు చేరుకున్నాయి. గ్రామీణ ప్రాంతాల ప్రజలను దృష్టిలో పెట్టుకొని యాప్‌లో తెలుగు వెర్షన్ ఉండేలా చూడాలని సూచించా. లబ్ధిదారుల ఎంపిక నుంచి ఇళ్ల కేటాయింపు వరకు సాంకేతిక పరిజ్ఞానాన్ని వీలైనంతవరకు వినియోగించుకోవాలి. పేదవారికి ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి ఇవ్వడమే ప్రభుత్వ లక్ష్యం" అని మంత్రి తెలిపారు. దీనిని దృష్టిలో పెట్టుకొని అధికార యంత్రాంగం పనిచేయాలని ఆదేశించారు.

# హైదరాబాద్ అభివృద్ధి.. తట్టుకోలేక విష ప్రచారం : డిప్యూటీ సీఎం భట్టి



హైదరాబాద్: నగరంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి తట్టుకోలేని కొందరు వ్యక్తులు కావాలనే విష ప్రచారం చేస్తున్నారని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మండిపడ్డారు. మూసీ నిర్వాసితులకు అద్భుతమైన జీవితాన్ని ఇవ్వాలని ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. మూసీ నిర్వాసితులకు వారు ఉండే చోటే అద్భుతమైన టవర్స్ నిర్మించి, వారి పిల్లలకు ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మిస్తామని భట్టి తెలిపారు. మూసీ నిర్వాసిత మహిళలతోపాటు నగరంలోని డ్వాక్రా మహిళలకు వడ్డీ లేని రుణాలు అందిస్తామన్నారు.

అనంతరం నరెడ్కో నిర్వహిస్తున్న ప్రాపర్టీ షోను భట్టి విక్రమార్క సందర్శించారు. ఈ సందర్భంగా స్థిరాస్తి వ్యాపారుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. బ్యాంకర్లతో చర్చించి స్థిరాస్తి వ్యాపారులకు రుణాలు అందే విధంగా చర్యలు తీసుకుంటామని భట్టి హామీ ఇచ్చారు. హైడ్రాపై ప్రతిపక్షాలు దుష్ప్రచారం చేస్తూ ప్రజలను భయాందోళనలకు గురిచేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో ఉన్న పార్కులు, చెరువులు, గుట్టలు, ప్రభుత్వ భూములను రక్షించేందుకు మాత్రమే హైడ్రా ఉందని భట్టి తెలిపారు. అనుమతి ఉన్న నిర్మాణాలకు ఎలాంటి ఇబ్బంది ఉండదన్నారు.

# గుస్సాడీ కళాకారుడు కనకరాజు మృతి పట్ల సీఎం రేవంత్‌రెడ్డి సంతాపం



హైదరాబాద్: పద్మశ్రీ గ్రహీత, ప్రముఖ గుస్సాడీ కళాకారుడు కనకరాజు మృతి పట్ల సీఎం రేవంత్‌రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అధికారిక లాంఛనాలతో శనివారం అంత్యక్రియలు నిర్వహించాలని ఆదేశించారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు జారీ చేశారు. గిరిజనుల సంప్రదాయ గుస్సాడీ నృత్యానికి జీవం పోసి, భావితరాలకు అందిస్తున్న పద్మశ్రీ కనకరాజు(94) శుక్రవారం కన్నుమూశారు. ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండలం మర్లవాయికి చెందిన కనకరాజు కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నారు. గుస్సాడీకి ఆయన చేసిన సేవలను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం 2021 నవంబరు 9న పద్మశ్రీ ప్రకటించి, అప్పటి రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ చేతుల మీదుగా ప్రదానం చేసింది.

**ఆయన సేవలు చిరస్మరణీయం: ప్రధాని మోదీ...** కనకరాజు మృతి పట్ల ప్రధాని నరేంద్ర మోదీ సంతాపం వ్యక్తం చేశారు. గుస్సాడీ నృత్యం కోసం ఆయన చేసిన సేవలు మరవలేనివన్నారు. కనకరాజు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

# సీఎం రేవంత్ వైఖరితోనే కానిస్టేబుళ్ల కుటుంబాలు రోడ్డు మీదకు.. సబిత ఇంద్రారెడ్డి ధ్వజం

హైదరాబాద్: కానిస్టేబుళ్ల కుటుంబాలు రోడ్డు మీదకు రావటానికి సీఎం రేవంత్‌రెడ్డి వైఖరే కారణమని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత సబిత ఇంద్రారెడ్డి ఆరోపించారు. హోంశాఖ నిర్వహిస్తోన్న రేవంత్ ఫెయిల్ అవ్వటంతోనే పోలీస్ కుటుంబాలు బయటకు వచ్చాయని చెప్పారు. ఇవాళ(శనివారం) తెలంగాణ భవన్‌లో సబిత ఇంద్రారెడ్డి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ... రక్షకభటులే న్యాయం కావాలని రోడ్డు ఎక్కటం బాధాకరంగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. పోలీసులు రోడ్డు ఎక్కటం చరిత్రలోనే మెదటసారి అని చెప్పారు. ప్రజా పాలన అంటే.. ఇదేనా రేవంత్ రెడ్డి అని ప్రశ్నించారు.

తెలంగాణలో హోంమంత్రి లేకపోవటంతోనే. కానిస్టేబుళ్ల బాధ ఎవరకి చెప్పుకోవాలో తెలియని పరిస్థితి నెలకొందని అన్నారు. యూనిఫాం వేసుకుని దర్నాలు చేయాల్సిన పరిస్థితి తెలంగాణలో వచ్చిందని.. అయినా ప్రభుత్వం నుంచి కనీస స్పందన లేకపోవడం బాధాకరమని చెప్పారు. ఏక్ పోలీస్ వ్యవస్థపై సీఎం రేవంత్ మాటను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. 18రోజులకు 4రోజులు కుటుంబంతో గడిపే పాత పద్ధతిని కొనసాగించాలని తెలిపారు. మహిళలపై అఘాయిత్యాలు రాష్ట్రంలో సర్వసాధారణంగా మారాయని అన్నారు. డీజీపీ స్థాయి అధికారులు జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించాలని సబితా ఇంద్రారెడ్డి పేర్కొన్నారు.

**పోలీస్ సమస్యలు పరిష్కరించాలి: ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి...** స్వాతంత్రం దేశంలో పోలీసులే నిరసన చేపట్టడం తొలిసారి అని ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి అన్నారు. పోలీసులతో ఇళ్లలో వివిధ పనులు చేర్పిస్తున్నారని ధ్వజమెత్తారు. పోలీస్ సమస్యలు పరిష్కారం చేయాలని ప్రభుత్వం కోరారు. సచివాలయం ముందు రోజూ ధర్నాలు జరగటం బాధాకరమని అన్నారు. రాష్ట్రంలో ప్రజాపాలన ఉందా? అనే అనుమానం కలుగుతోందని ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి పేర్కొన్నారు.



# తెలంగాణ వ్యాప్తంగా బెటాలియన్ కానిస్టేబుళ్ల ఆందోళన

హైదరాబాద్: ఒకే పోలీసు విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా బెటాలియన్ పోలీసులు ఆందోళనకు దిగారు. నిరసన కార్యక్రమాల్లో కానిస్టేబుళ్ల కుటుంబ సభ్యులు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు. వరంగల్ జిల్లాలోని మామునూరులో 4వ బెటాలియన్ కానిస్టేబుళ్లు ఆందోళన చేపట్టారు. మామునూరు బెటాలియన్ కమాండెంట్ ఆఫీస్ వద్ద బైఠాయించి నిరసనకు దిగారు. ఆందోళనల నేపథ్యంలో నల్గొండ గ్రామీణ ఎస్ఐ సైదాబాబుకు నిరసన సెగ తగిలింది. ఎస్ఐ గోబ్యాక్ అంటూ 12వ బెటాలియన్ కానిస్టేబుళ్లు నినాదాలు చేశారు. పోలీసుల కుటుంబసభ్యులపై సైదాబాబు దురుసుగా ప్రవర్తించారని నిరసనకు దిగారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో బెటాలియన్ కానిస్టేబుళ్ల కుటుంబసభ్యులు నిరసనకు దిగారు. సాగర్ రోడ్డుపై ధర్నా చేపట్టారు.

# బెటాలియన్ కానిస్టేబుళ్ల ఆందోళన.. చర్యలు తీసుకుంటామన్న తెలంగాణ డీజీపీ




హైదరాబాద్: బెటాలియన్ కానిస్టేబుళ్లు చేస్తున్న ఆందోళనపై తెలంగాణ డీజీపీ జితేందర్ స్పందించారు. క్రమశిక్షణతో కూడిన ఫోర్స్‌లో ఉంటూ ఆందోళనలు చేయడం సరికాదన్నారు. ఒకే పోలీసు విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా బెటాలియన్ పోలీసులు ఆందోళనకు దిగారు. నిరసన కార్యక్రమాల్లో కానిస్టేబుళ్ల కుటుంబ సభ్యులు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో డీజీపీ జితేందర్ శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. సెలవులపై పాత పద్ధతే అమలు చేస్తామని చెప్పినప్పటికీ మళ్లీ ఆందోళనలకు దిగడం సరికాదన్నారు. ఆందోళనల వెనుక ప్రభుత్వ వ్యతిరేక శక్తులు ఉన్నాయనే అనుమానం ఉందన్నారు. ఆందోళనలు చేస్తున్న వారిపై చట్టరీత్యా చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. మన దగ్గర ఉన్న రిక్రూట్‌మెంట్ వ్యవస్థను అన్ని రాష్ట్రాలు అమలు చేస్తున్నాయని ప్రకటనలో పేర్కొన్నారు.

# రేవంత్ కంటే చంద్రబాబు చాలా నయం..: మందకృష్ణ మాదిగ



హైదరాబాద్: చేయూత పింఛన్‌దారులందరినీ వికలాంగుల హక్కుల పోరాట సమితి (వీహెచ్‌పీఎస్) ఏకీకృతం చేసేందుకు ప్రయత్నం చేస్తోందని ఆ సంఘం వ్యవస్థాపక గౌరవ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ తెలిపారు. చేయూత పింఛన్ తీసుకునే వారిని రేవంత్ ప్రభుత్వం నట్టేట ముంచిందని విమర్శించారు. వీరితో కలిసి బలమైన ఉద్యమం చేపడతామన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు నమ్మిన పింఛన్‌దారులు కాంగ్రెస్‌ను గెలిపించారని చెప్పారు. 10 నెలలు అయినా.. ఎందుకు పెంచి ఇవ్వడం లేదని ప్రశ్నించారు. "ఏపీలో ఏప్రిల్ నెలలో మేం చంద్రబాబుకు వినతి పత్రం ఇచ్చాం. దివ్యాంగులకు రూ. 6 వేలు పింఛన్ ఇవ్వాలని కోరాం. ఆయన జూన్‌లో అధికారంలోకి రాగానే ఏప్రిల్, మే, జూన్ మూడు నెలలవి ఇచ్చారు. ఏపీలో కండరాల క్షీణత ఉన్నవాళ్లకు రూ. 15 వేల పింఛన్లు ఇస్తున్నారు. రేవంత్ కంటే చంద్రబాబు చాలా నయం. తెలంగాణలో వచ్చే నెల మొదటి వారంలో గడిచిన 10 నెలల బకాయిలతో పాటు నవంబర్ పింఛన్ ఇవ్వాలి. లేదంటే ఉద్యమం తప్పదు. నవంబర్ 1 నుంచి 16 వరకు ప్రతిరోజు రెండు జిల్లాల్లో చేయూత పింఛన్ లబ్ధిదారులకు చైతన్య సభలు నిర్వహిస్తాం. అప్పటికీ ఇవ్వకుంటే నవంబర్ 26న చలో హైదరాబాద్‌కు పిలుపునిస్తాం 26న వికలాంగుల మహా గర్జన పేరిట వేలాది మందితో ఇందిరాపార్క్ వద్ద ధర్నా చేపడతాం. కాంగ్రెసేతర అన్ని రాజకీయ పార్టీలను ఆహ్వానిస్తాం. రేవంత్ ప్రభుత్వంతో తాడో పేడో తేల్చుకుంటాం" అని మందకృష్ణ అన్నారు.

# క్యాన్సర్‌పై అవగాహన కల్పిద్దాం.. ప్రాణ నష్టాన్ని నివారిద్దాం



హైదరాబాద్, అక్టోబర్ 26: ఎమ్ఎన్‌జీ ఇన్‌స్టిట్యూట్ నిర్వహించిన బ్రెస్ట్ క్యాన్సర్ అవేర్నెస్ వాక్ కార్యక్రమంలో వైద్యఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులను ఎదుర్కోవడానికి ఇలాంటి కార్యక్రమాలు ఉపయోగపడుతాయన్నారు. నాన్ కమ్యునికేబుల్ డిసీజ్‌లు అన్నింటిలోకెల్లా క్యాన్సర్ అత్యంత ప్రమాదకరమన్నారు. క్రమశిక్షణ లేని జీవన విధానం సహా అనేక కారణాలు ఈ వ్యాధి ప్రబలడానికి కారణమవుతున్నాయన్నారు. ఇండియాలో ఏటా 14 నుంచి 15 లక్షల కేసులు నమోదవుతుంటే, తెలంగాణలో 50 నుంచి 60 వేల కేసులు నమోదవుతున్నాయన్నారు. క్యాన్సర్ గురించి అవగాహన లేకపోవడం వల్ల ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు. ప్రజలకు అవగాహన కల్పించి, ప్రాణ నష్టాన్ని నివారించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.

**ఉచితంగా స్క్రీనింగ్, ట్రీట్‌మెంట్..** మహిళల్లో ఎక్కువగా బ్రెస్ట్ క్యాన్సర్ కేసులు నమోదవుతున్నాయని.. మొత్తం ఉమెన్ క్యాన్సర్ బర్డెన్‌లో 14 శాతం బ్రెస్ట్ క్యాన్సర్ సంబంధిత కేసులే ఉంటున్నాయని డాక్టర్లు చెబుతున్నారని.. దీనిపై అవగాహన కల్పించి, స్క్రీనింగ్ చేస్తే ఎర్లీ స్టేజ్‌లో రోగ నిర్ధారణ చేయొచ్చని చెప్పారు. తద్వారా క్యాన్సర్‌ను పూర్తిగా నయం అయ్యేలా ట్రీట్‌మెంట్ అందించవచ్చన్నారు. ప్రతి మహిళా స్క్రీనింగ్ చేయించుకోవడానికి ముందుకు రావాలని కోరారు. ప్రభుత్వం ఉచితంగా స్క్రీనింగ్, ట్రీట్‌మెంట్ అందిస్తోందని తెలిపారు. ప్రతి గ్రామంలో మొబైల్ ల్యాబ్స్ ద్వారా ఉచితంగా స్క్రీనింగ్ చేయిస్తామన్నారు. 6 క్యాన్సర్ రీజినల్ సెంటర్స్ ఏర్పాటు చేయబోతున్నామని.. ఈ సెంటర్లలో డాక్టర్లు, పూర్తి స్థాయిలో ఎక్విప్‌మెంట్ తీసుకొస్తామన్నారు. ఈ సెంటర్లు అన్నింటికీ ఎంఎన్‌జే హాస్పిటల్ హబ్‌గా ఉంటుందని వెల్లడించారు.

**త్వరలనే పాలియేటివ్ రిహాబిలిటేషన్ సెంటర్లు...** క్యాన్సర్ ట్రీట్‌మెంట్ ఒక్కరోజులోనో, ఒక్క వారంలోనో అయ్యేది కాదని.. నెలలు, సంవత్సరాల తరబడి సాగుతుందన్నారు. పేషెంట్లకు ఫిజికల్, మెంటల్, ఫైనాన్షియల్ సపోర్ట్ చాలా అవసరమని.. దానికోసమే పాలియేటివ్ రిహాబిలిటేషన్ సెంటర్లను ఏర్పాటు చేయబోతున్నామన్నారు. డయాబెటీస్ క్లినిక్స్ ఏర్పాటు చేయబోతున్నట్లు మంత్రి దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు.

# బోనస్ దేవుడెరుగు.. మద్దతు ధరకే దిక్కు లేదు: కేటీఆర్



హైదరాబాద్: తెలంగాణలో తెల్ల బంగారం తెల్లబోతోందని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. పత్తి కొనుగోళ్ల తీరుపై ఆయన 'ఎక్స్' వేదికగా పోస్టు చేశారు. బోనస్ దేవుడెరుగు.. మద్దతు ధరకే దిక్కు లేదని ఎద్దేవా చేశారు. దళారుల చేతిలో పత్తి రైతులు చిత్తవుతున్నారని పేర్కొన్నారు. కొర్రీలతో సీసీఐ పత్తి కొనుగోళ్లు నిలిపేసిందని చెప్పారు. రైతు ఆగమవుతుంటే ప్రభుత్వం పత్తా లేదన్నారు. పత్తి కొనుగోళ్ల అంశంలో ప్రభుత్వ చొరవ లేదని వ్యాఖ్యానించారు. రైతు డిక్లరేషన్ బోగస్.. కర్షక ద్రోహి కాంగ్రెస్ అని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

# విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు.. అధికారులకు మంత్రి సీతక్క వార్నింగ్

హైదరాబాద్: కోట్లాదిమంది ప్రాణాలు మిషన్ భగీరథ సిబ్బంది చేతిలో ఉన్నాయని.. అందుకే అధికారులు అంతా బాధ్యతతో పనిచేయాలని మంత్రి సీతక్క అన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. గత వేసవికాలంలో నీటి ఎద్దడి ఉన్నా ఎలాంటి సమస్య లేకుండా తాగునీటిని అందించామని స్పష్టం చేశారు. 13456 మంచినీటి సహాయకులకు శిక్షణ ఇచ్చామని గుర్తుచేశారు. ఫిర్యాదుల కోసం టోల్ ఫ్రీ నెంబర్‌ను త్వరలో అందుబాటులోకి తెస్తామని అన్నారు. ఎర్ర మంజిల్‌లోని మిషన్ భగీరథ కార్యాలయంలో జిల్లాల వారీగా అధికారులతో మంత్రి సీతక్క ఇవాళ(శనివారం) సమీక్షా సమావేశం నిర్వహించారు.

జిల్లాల వారీగా గ్రామీణ మంచి నీటి సరఫరా వ్యవస్థ పనితీరుపై సమీక్షించారు. ఈ సమావేశానికి పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్, మిషన్ భగీరథ ఈఎన్సీ కృపాకర్ రెడ్డి, CE, SE,EEలు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ... తెలంగాణలో ఎక్కడా తాగునీటి సరఫరాలో సమస్య రానీయ కూడదని ఆదేశించారు. శుద్ధి చేసిన నీరే సరఫరా అయ్యేలా చూడాలని సూచించారు. రిజర్వాయర్లలో సరిపోయినంత నీటి నిల్వలు ఉన్నాయని.. వాటిని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. లోకల్ సోర్స్‌ల మీద దృష్టి పెట్టాలని అన్నారు. ప్రతి ఐదు, ఆరు నియోజకవర్గాలను ఒక యూనిట్‌గా ప్రణాళికలు రూపొందించాలని అన్నారు. చాలా గ్రామాల్లో మిషన్ భగీరథ నీరు వస్తున్నా ప్రజలు బోర్లు వేయించాలని, ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేయాలని కోరారు. మిషన్ భగీరథపై వేల కోట్లు ఖర్చుపెట్టిన తర్వాత బోర్ల మీద, ఆర్వో ప్లాంట్ల మీద ప్రజలు డిపెండ్ అవుతున్నారని అన్నారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com